


# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 170 శుక్రవారం 13 ఫిబ్రవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 25 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా



- కొత్తగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన రక్షణ శాఖ
- కాంబాట్ క్షిపణుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి

2



## ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేస్తున్నట్లు కాదు

- నిర్మలా సీతారామన్
- 2026-27 బడ్జెట్‌పై రాజ్యసభలో చర్చించిన కేంద్ర ఆర్థిక మంత్రి
- బడ్జెట్‌పై విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టిన నిర్మలా
- పన్ను వసూళ్ల పెరుగుదల ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని వెల్లడి

2




2

## అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు

- వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన
- భారత్- యూఎస్ ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు
- దీనిపై స్పందించిన భారత్
- ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని వెల్లడి

# సవాళ్లు-ప్రతిసవాళ్లతో దద్దరిల్లిన మండలి



- గవర్నర్ ప్రసంగంపై వాడీవేడి చర్చ
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో వాడీ వేడీ చర్చ
- తీర్మానాన్ని బలపరుస్తూ మాట్లాడిన టీడీపీ ఎమ్మెల్సీలు
- గవర్నర్‌పై దాడి చేయాలని ప్రయత్నించడం క్షమించరాని చర్య అని వెల్లడి

**అమరావతి**

గవర్నర్ ప్రసంగంపై ధన్యాదాలు తెలిపే తీర్మానంపై శాసన మండలిలో అధికార, విపక్షాల మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. పరస్పరం సవాళ్ల ప్రతిసవాళ్లతో సభ దద్దరిల్లింది. గవర్నర్ ప్రసంగంలోని అంశాలపై వైఎ-స్సార్సీపీ సభ్యులు విమర్శలు చేయగా ఆరోపణలను అధికారపార్టీ సభ్యులు దీటుగా తిప్పి కొట్టారు. ఆరోపణలు నిరూపించేందుకు తాము సిద్ధమని వైఎస్సార్సీపీ సభ్యులు సవాల్ విసరగా, దమ్ముంటే నిరూపిం చాలని దీనికి తాముసైతం సిద్ధమని అధికారపార్టీ నేతలు ప్రతిసవాల్ విసిరారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు చర్చ చేపట్టారు. తొలుత ప్రసంగించిన ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీర్మానాన్ని బలపరుస్తూ ప్రసంగించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని గవర్నర్ ప్రసంగంలోనూ ఇది ప్రస్ఫుటమైందని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల సాధన, పెట్టుబడుల సాధన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి దాడులు నిత్యకృత్యంగా చేశారని. వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు వేధింపులకు పాల్పడేవారని ఇంకా దళితులను చంపి - మిగతా3లో



## ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు..
- సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు
- 20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా
- రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

**అమరావతి**

గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్ డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదు-పాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం - మిగతా3లో



## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి

**అమరావతి**

"నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి - మిగతా3లో

# పేరు మార్పునకు పచ్చజెండా

- సచివాలయాల పేరు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా మార్పు
- కేబినెట్ ఆమోదించిన అంశాలు ఇవే!
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- నీటిపారుదలశాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం



**అమరావతి**

సోలార్ ఎనర్జీ కింద తీసుకునే అసైన్డ్ భూములను ఎకరాకు ఏడాదికి 30 వేలు కౌలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల పేరు మార్పునకు పచ్చజెండా ఊపింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో24 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. సోలార్ ఎనర్జీ కోసం తీసుకునే అసైన్డ్ భూములకు ఎకరాకు ఏడాదికి 30 వేలు రూపాయలు, 2 ఏళ్లకు 5 శాతం పెంచేలా మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డులుగా సచివాలయాల పేరు మార్పునకు పచ్చజెండా ఊపింది. నీటిపారుదల వనరులకు 7 వేల 189 నిర్వహణ పనులకు కేబినెట్ పరిపాలనా ఆమోదం తెలిపింది. భూములు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగించేందుకు - మిగతా3లో

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు రక్షణ శాఖ పచ్చజెండా

త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 3.60 లక్షల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. అదే విధంగా కాంబాట్ క్షిపణులు, ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్ల కొనుగోలుకు అనుమతి లభించింది. వైభవ్ యాంటీ ట్యాంక్ మైన్స్, పీ-8ఐ విమానాల వంటి కీలక ఆయు ధాలకు కూడా డీఏసీ ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్'కు ఇది మరింత ఊతమిస్తుందని రక్షణశాఖ తెలిపింది.



**150కు చేరుకోనున్న రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య**

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. మరికొన్ని రోజుల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్ పర్యటనకు రానున్న వేళ ఈ డీల్‌కు డీఏసీ అమోదం తెలిపింది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రఫేల్ విమానాలను భారత్‌లోనే తయారు చేసే విధంగా కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. విమానాల విడిభాగాల తయారీ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్‌తో భారత్ చర్చలు జరపనుంది. ఫ్రాన్స్‌తో ఈ ఒప్పందం కుదిరితే భారత వైమానిక దళంలో రఫేల్ యుద్ధ విమానాల సంఖ్య 150కు చేరుకుంటుంది. ప్రస్తుతం భారత వాయుసేన దగ్గర 36 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయి.

**సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించే కాంబాట్ క్షిపణులు**

కాంబాట్ క్షిపణుల ద్వారా సుదూర లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించవచ్చని రక్షణశాఖ తెలిపింది. గగనతలంలో నిరంతరం నిఘా ఉంచేందుకు, ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించేందుకు ఎయిర్‌షిప్ ఆధారిత హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లు ఎంతో ఉపయోగపడతాయని వెల్లడించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన విభవ్ యాంటీ- ట్యాంక్ మైన్లు శత్రువుల యుద్ధ ట్యాంకర్‌లను సులభంగా అడ్డుకుంటాయని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ౦-72 ట్యాంకులు, ఆర్మోర్డ్ రికవరీ వెహికల్స్, ఇన్‌ఫాంట్రీ కాంబాట్ వెహికల్స్‌లను పూర్తిగా మరమ్మతు చేసి, వాటి జీవితకాలాన్ని పెంచుతామని రక్షణశాఖ తెలిపింది.

**4 మెగావాట్ల సామర్థ్యం గల మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత జనరేటర్ల తయారీ**

సముద్ర జలాల్లో జలాంతర్గాములను పసిగట్టడంలో పీ-8ఐ యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ యుద్ధవిమానం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని రక్షణశాఖ స్పష్టం చేసింది. భారత నావిక దళానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని వివరించింది. నౌకాదళ అవసరాల కోసం 4 మెగావాట్ల సామర్థ్యం గల మెరైన్ గ్యాస్ టర్బైన్ ఆధారిత జనరేటర్లను స్వదేశీ పరిజ్ఞాతంతో తయారు చేయనున్నట్లు వెల్లడించింది. సముద్ర నిఘా సామర్థ్యాన్ని పెంచేందుకు డోర్నియర్ విమానాలకు ఎలక్ట్రో-ఆప్టికల్ లేదా ఇన్‌ఫ్రా-రెడ్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు రక్షణశాఖ తెలిపింది.

**హైదరాబాద్‌లో ఒక అత్యాధునిక ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు**

రఫేల్ యుద్ధ విమానాల తయారీలో ప్రముఖ సంస్థ అయిన దసో ఏవియేషన్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య గతేడాది జూన్‌లో నాలుగు చారిత్రాత్మక ఉత్పత్తి బదిలీ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్‌లో ఒక అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఈ తయారీ కేంద్రంలో రఫేల్ యుద్ధ విమానానికి సంబంధించిన కీలకమైన నిర్మాణ భాగాలను ఇక్కడే తయారు చేస్తారు. ఇక్కడి నుంచి మొదటి ఫ్యూజ్‌లేజ్ విభాగాలు 2028 నాటికి బయటకు వస్తాయని చెబుతున్నారు.

# అణు విద్యుత్ కేంద్రాల భద్రతపై ఆందోళనలు అవసరం లేదు

దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తి విస్తరణ వేగంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా చర్యల గురించి రాజ్యసభకు వివరించింది. కుడంకులం అణు విద్యుత్ కేంద్రం 3వ యూనిట్‌ను 2026లో, 4వ యూనిట్‌ను 2027నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ప్రశ్నోత్తర సమయంలో సభ్యుల అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 2031-32 నాటికి దేశ అణు విద్యుత్ సామర్థ్యాన్ని దాదాపు 22,380 మెగావాట్లకు మూడు రెట్లు పెంచాలని, అలాగే 2047 నాటికి 100 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించాలనే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. 'ప్రస్తుతం భారత్ అణు కార్యక్రమం విస్తరణ దశలో ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల వల్లే అణు రంగాన్ని ప్రైవేటు రంగానికి అప్పగించగలిగాం' అని ఆయన అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లోని రావల్‌బేటాలో ఉన్న అటామిక్ పవర్ ప్రాజెక్ట్ 700 మెగావాట్ల సామర్థ్యాన్ని ఫిబ్రవరి 10 ఉదయం 5.30 గంటలకు విజయవంతంగా సాధించిందని మంత్రి తెలిపారు. ఇది దేశ అణు రంగంలో మరో మైలురాయిగా ఆయన పేర్కొన్నారు.



**ప్రభుత్వంలోనే ప్రాజెక్టుకు మొదటి అడుగు పడింది!**

మరోవైపు, కుడంకులం ప్రాజెక్టు చరిత్ర గురించి ఆయన ప్రస్తావిం చారు. ఈ ప్రాజెక్టును 1988లోనే ప్రారంభించాలని ఆలోచన ఉన్నప్పటికీ, నిర్మాణ పనులు కొనసాగలేదన్నారు. అయితే, 2002లో ఎన్‌డీఏ ప్రభుత్వ కాలంలోనే ఆ ప్రాజెక్టుకు మొదటి అడుగు పడిందన్నారు. అనంతరం కూడా నిర్మాణ పనులు నెమ్మదిగా సాగాయని పేర్కొన్నారు. 2014లో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పనుల్లో వేగం పెరిగిందని చెప్పారు. 2014 డిసెంబర్‌లో 1000 మెగావాట్ల సామర్థ్యంతో తొలి యూనిట్ పనిచేయడం ప్రారంభమైందని, ఆ తర్వాత రెండో యూనిట్ కూడా పూర్తైందని ఆయన వివరించారు. "ప్లాంటు నిర్మాణంలో మేం నిర్దిష్ట కాలవ్యవధిని పాటిస్తున్నాం. దానికి అనుగుణంగానే పనులు ప్రారంభించాం. ఈ ప్లాంట్ ఎటువంటి భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రభావితం చేయలేవని భావిస్తున్నాను. ఇక ప్లాంట్ విషయానికొస్తే మూడో యూనిట్ 2026లో, నాలుగో యూనిట్ 2027లో పూర్తయ్యే అవకాశం ఉంది. 2031-32 నాటికి అణు సామర్థ్యాన్ని 22,380 మెగావాట్లకు పెంచగలమని అంచనా వేస్తున్నాం. 2025లో 8.8 గిగావాట్లు, 2032లో 22 గిగావాట్లు, 2037లో 47 గిగావాట్లు, 2042లో 67 గిగావాట్లు, 2047లో 100 గిగావాట్లు లక్ష్యంగా పెట్టుకున్నాం" అని జితేంద్ర సింగ్ తెలిపారు.

**భారత్ అణురంగంలో స్వావలంబన దిశగా సాగుతోంది!**

మరోవైపు, అణు విద్యుత్ సంస్థ 'ఎన్‌పీసీఐఎల్' పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం 'సీఎస్ఆర్' నిధులను వినియోగిస్తోందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, గత 10-11 ఏళ్లలో భారత్ అణు రంగంలో స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి చెప్పారు. 2014లో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, దేశ అణు విద్యుత్ సామర్థ్యం 4,780 మెగావాట్లుగా ఉండగా, ప్రస్తుతం 2026 నాటికి అది 8,780 మెగావాట్లకు చేరుకుందని ఆయన వివరించారు. అయితే, అణు విద్యుత్ కేంద్రాల భద్రతపై ఆందోళనలు అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

## ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడులో

# జైషే మహ్మద్ హస్తం

దేశ రాజధాని ఢిల్లీ లోని ఎర్రకోట వద్ద గత ఏడాది జరిగిన బాంబు పేలుడు ఘటనపై ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుతో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు సంబంధం ఉన్నదని పేర్కొన్నది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే మహ్మద్ తదితర ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలంగా నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. 'ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తున్నది. 2025 నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన ఆత్మాహుతి దాడి అందులో ఒకటని ఒక సభ్యదేశం ఆరోపించింది. అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేం దుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గత ఏడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం' అని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో పేర్కొన్నది.

జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి ఘటనను కూడా యూఎన్‌వో తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. కాగా జైషే, లష్కరే తాయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్థాన్ పదేపదే వాదిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధి బయటపడింది. కాగా ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడి వెనక జైషే మహ్మద్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి చేసుకున్న ఉగ్రవాది డాక్టర్ ఉమర్ నబీకి సంబంధించిన ఓ వీడియోను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారత్ అంతటా ఆత్మాహుతి దాడులకు ఈ ముఠా కుట్రలు పన్నినట్లు ఆ



వీడియోలో ఉంది. దానిపై దర్యాప్తు కొనసాగుతున్నది.

# శ్రీలంకకు వరుసగా రెండో విజయం

కొలంబో : ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఆతిథ్య శ్రీలంక జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గ్రూప్-బిలో భాగంగా గురువారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘనవిజయం సాధించింది. ఈ మెగా టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో గెలుపు కావడం విశేషం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది.పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఒమన్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బ్యాటర్లు కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61), పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60) అద్భుత అర్ధశతకాలతో రాణించారు. ఆఖర్లో కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.అనంతరం 226 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. లంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులకే పరిమితమైంది. ఒమన్ జట్టులో మహమ్మద్ నదీమ్ (53 నాటౌట్) ఒక్కడే అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర రెండేసి వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో గ్రూప్-బిలో శ్రీలంక అగ్రస్థానానికి చేరింది.

# డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలి

**కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే డిమాండ్**

బెంగళూరు : డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు.కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని అన్నారు. తామంతా శివకుమార్‌కు మద్దతిస్తున్నామని అన్నారు.ఇదిలా ఉండగా, సిద్ధరామయ్య వర్గానికి చెందిన వారిగా భావిస్తున్న ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనకు వెళ్లడంపై కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీ కర్ణాటక రాష్ట్ర ఇన్‌ఛార్జ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విదేశీ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేల పేర్లను అడిగినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై జరుగుతోన్న ప్రచారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేల విదేశీ పర్యటనకు వెళ్లారని సిద్ధరామయ్య వర్గం చెబుతోందని తెలుస్తోంది.

# ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేస్తున్నట్లు కాదు



వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు పెరగడం అంటే మధ్యతరగతి ప్రజలను అణచివేయడం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. రాజ్యసభలో 2026-27 కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలపై ఆమె ఈ మేర వ్యాఖ్యానించారు. పన్ను వసూళ్లు పెరుగుతున్నాయంటే దేశంలో మధ్యతరగతి వర్గం విస్తరిస్తుందనే అర్థం తప్ప, క్షీణించడం లేదని ఆమె వెల్లడించారు. పన్ను వసూళ్ల పెరుగుదలపై వస్తున్న ఆరోపణలను ఆమె తోసిబుచ్చారు. అది ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించినట్లు వస్తున్న విమర్శలను ఆమె ఖండించారు. ఏ రాష్ట్రానికి నిధులు నిలుపుదల చేయలేదని నిర్మలా స్పష్టం చేశారు. ఇప్పటివరకూ 48 లక్షల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరవేశామన్న కేంద్రమంత్రి, ఈ పద్ధతి ద్వారా అక్రమాలను అరికట్టి 4.31 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆదా చేసిందని వివరించారు.

అమెరికా ట్రేడ్ డీల్ ఫ్యాక్ట్‌షీట్‌లో మార్పులు



ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై భారత్ కీలక ప్రకటన చేసింది. రెండు దేశాల పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఈ ట్రేడ్ డీల్ జరిగినట్లు వెల్లడించింది. ఈ వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ అమలుకు ఇరుదేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపింది. ఈ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో అమెరికా ఇటీవల చేసిన సవరణలు రెండు దేశాల మధ్య భాగస్వామ్య అవగాహనలను ప్రతిబింబిస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు విలేకరుల సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ట్రేడ్ డీల్‌పై ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్ హౌస్ చేసిన మార్పుల గురించి రణ్‌ధీర్ జైస్వాల్‌ను విలేకరులు ప్రశ్నించారు. "ఇండియా-యూఎస్ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై విడుదల చేసిన ఉమ్మడి ప్రకటన ఇరుపక్షాల మధ్య పరస్పర అవగాహనకు నిదర్శనం. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనాల కోసం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాలు ఫిబ్రవరి 7న ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. భారత్, అమెరికా ఇప్పుడు ట్రేడ్ డీల్‌కు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి, మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కలిసి పనిచేస్తున్నాయి. యూఎస్ ఫ్యాక్ట్ షీట్‌లోని సవరణలు ఇరుదేశాల ఉమ్మడి ప్రకటనలో ఉన్న పరస్పర అవగాహనలను ప్రతిబింబిస్తాయి." అని రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు.

# సవాళ్లు-ప్రతిసవాళ్లతో దద్దరిల్లిన మండలి

-మొదటిపేజీ తరువాయి

డోర్ డెలివరీ చేసే వారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియాలు విచ్చలవిడిగా చెలరేగాయని అన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక సాయం చేస్తున్నామని, అమరావతిని గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తోందన్నారు.

కనీసం లాయర్‌నూ నియమించలేదు: కూటమి ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధి సంక్షేమాన్ని గవర్నర్ ప్రసంగంలో స్పష్టంగా తెలియజేశారని, గవర్నర్‌పై దాడి చేయాలని వైఎస్సార్సీపీ సభ్యులు ప్రయత్నించడం క్షమించరాని చర్య అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని వినలేని వారు వారానికోసారి ఆయన వద్దకు ఎందుకు వెళ్తున్నారో వైఎస్సార్సీపీ నేతలు చెప్పాలని నిలదీశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి కుప్పం నియోజకవర్గానికి నీరిచ్చి చిరకాల వాంఛ నెరవేర్చిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే ఎన్జీటీ స్టే ఇచ్చిందని, ప్రాజెక్టు స్టే ఎత్తేందుకు కనీసం మంచి లాయర్‌ను కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వం నియమించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖరరెడ్డి పలు ఆరోపణలు, విమర్శలు చేయడంతో శాసన మండలి వేడెక్కింది. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య పరస్పరం మాటల యుద్ధం, సవాళ్లు ప్రతి సవాళ్లకు దారి తీసింది. తల్లికి వందనం కింద విద్యార్థి తల్లికి ఏటా రూ.15,000 జమ చేస్తామని చెప్పి



ఇప్పుడు మోసం చేశారన్న చంద్రశేఖరరెడ్డి ఆరోపణలపై మంత్రి పార్థసారథి తప్పు పట్టారు. గవర్నర్ ప్రసంగంలో అపద్దాలు చెప్పించారని, రైతులకు ఎవ్వరికీ రూ.20,000 పూర్తి మొత్తం చెల్లించలేదని ఒక్క ఏడాదైనా రూ.20,000 ఇచ్చినట్లు రుజువు చేస్తే తాము క్షమాపణలు చెబుతామని మంత్రి పార్థసారథి అన్నారు. అన్ని అబద్దాలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. మాట తప్పం మడమ తిప్పమన్న గత ప్రభుత్వం ఇద్దరికి ఇస్తామని ఒక్కరికే అమ్మఒడి ఇచ్చిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏటా రూ.20,000 ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతులకు రూ.7,000 మాత్రమే ఇచ్చిందన్న మంత్రి, రైతులకు ధాన్యం డబ్బులు ఎగ్గొట్టినందుకు వైఎస్సార్సీపీ నేతలు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు.

### ఏ శిక్షకైనా సిద్ధం

చర్చ సందర్భంగా విపక్ష నేత బొత్స జోక్యం చేసుకోవడంతో మంత్రి పార్థసారథి దీటుగా జవాబిచ్చారు. బొత్స, మంత్రి పార్థసారథి మధ్య మాటకు మాట దారి తీసింది. పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం ఎవరికీ పూర్తిగా రూ.15,000 ఇవ్వలేదని, 63 లక్షల మందిలో కేవలం 15 శాతం మందికే తల్లికి వందనం కింద కేవలం రూ.7 నుంచి 8 వేలు మాత్రమే చెల్లించారని బొత్స ఆరోపించారు. నియోజకవర్గంలోనూ తల్లికి వందనం కింద పూర్తి డబ్బు చెల్లించలేదని సవాల్ చేసిన బొత్స సభను తాను తప్పుదోవ పట్టించినట్లు రుజువు చేస్తే మాటలు విత్ డ్రా చేసుకుని క్షమాపణ చెబుతానన్నారు. బొత్స ఆరోపణలను దీటుగా తిప్పికొట్టిన మంత్రి పార్థసారథి ఆరోపణలను ఖండించారు. బొత్స చేసిన చేసిన ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు మేము సిద్ధమని 15 శాతం మందికే చెల్లించినట్లు తేలిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు.

సభ రేపటికి వాయిదా: అనంతరం ప్రసంగాన్ని కొనసాగించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు మార్చారని, రద్దు చేయలేదని అన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ తప్పుపట్టారు. వైఎస్సార్సీపీ సభ్యులు చాలా తేలిగ్గా అబద్దాలు చెబుతున్నారన్న మంత్రి, వైఎస్సార్సీపీ సభ్యులు సభలో అబద్దాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని పూర్తిగా రద్దు చేసిన విషయాన్ని తెలుసుకుని మాట్లాడాలన్నారు. సభ్యుల మధ్య వాద-ప్రతివాదనలు, సవాళ్లు-ప్రతి సవాళ్లు కొనసాగుతుండగానే సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు ప్రకటించారు. రేపు ప్రశ్నోత్తరాల అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ కొనసాగనుంది.

# వైసీపీ మౌనం - వ్యూహామా? వైఫల్యమా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడానికి సమయం దగ్గరపడుతుండటంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మార్చి 9 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఈ త-రుణంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పా అనుస రిస్తున్న మౌనం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను కలవరపెడు తోంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న దాఖలాలు కనిపించక పోవడంతో, గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించినట్లే.. ఇప్పుడు కూడా అదే బాటలో నడుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సూచనలు రాగానే అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంపై పార్టీలు కసరత్తు చేస్తాయి. కానీ వైసీపీలో ప్రస్తుతం అటువంటి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత క్యాడర్‌ను తిరిగి సమీకరించడంలో నాయకత్వం కొంత తడబడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార కూటమి దూకుడుగా ఉండటం, పోలీసులు , అధికార యంత్రాంగంపై తమకు నమ్మకం లేదని గతంలోనే పార్టీ ప్రకటించినందున , పోటీకి దూరంగా ఉండటమే మేలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందనేది ఒక వాదన అయితే, అది పార్టీ మనుగడకే ముప్పు అనే సంకేతాలు క్షేత్ర-స్థాయి నుంచి అందుతున్నాయి. స్థానిక ఎన్నికలు అంటే కేవలం పార్టీ గెలుపోటములే కాదు, గ్రామాల్లో నాయకులు తమ ఉనికిని కాపాడుకునే అవకాశం. ఒకవేళ పార్టీ పోటీ చేయకపోతే, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా అనాథలయ్యే ప్రమాదం ఉంది. పోటీలో లేకపోతే క్యాడర్ నిరుత్సాహపడి, తమ రాజకీయ భవిష్యత్తు కోసం అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే అవకాశం ఉంది. రాజకీయాల్లో మైదానం వదిలి వెళ్లడం ఎప్పుడూ సరైన సంకేతం కాదు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ గ్రాఫ్ తగ్గుతూ వస్తోందని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్న తరుణంలో, స్థానిక ఎన్నికల నుంచి తప్పుకోవడం ఆ ప్రచారానికి బలం చేకూర్చినట్లు అవుతుంది. ఎన్నికల్లో ఓడినా పోరాడామనే ముద్ర ఉంటే భవిష్యత్తుపై ఆశ ఉంటుంది, కానీ పోటీనే చేయకపోతే పార్టీ బలహీనపడిందనే ముద్ర శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీ నుంచి వలసలను ప్రోత్సహించడమే కాకుండా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ యంత్రాంగాన్ని దెబ్బతీ-స్తుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. వైసీపీ నాయకత్వం ఈ ప్రచారాన్ని ఖండించి, కేడర్‌లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అధికార పార్టీ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూనే, ప్రజాక్షేత్రంలో పోరాటం చేయడం ద్వారానే కోల్పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవచ్చు. పరీక్షల లోపే ఎన్నికలు పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు



తగ్గట్టుగా, పార్టీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. లేనిప క్షంలో, ఈ స్థానిక ఎన్నికలు వైసీపీ ఉనికికి పెద్ద పరీక్షగా మారే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

### ఎమ్మెల్సీ ఎన్నికలు బాయ్ కాట్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో, గ్రామ పంచాయతీల గడువు ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలోనే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు వేగవంతం చేశాయి. సాధారణంగా ఎన్నికల షెడ్యూల్ సంకేతాలు రాగానే పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, కమిటీల నియామకంతో సందడి నెలకొంటుంది. కానీ, వైసీపీ క్యాంపులో కనిపిస్తున్న నిశ్శబ్దం పలు అనుమానాలకు తావిస్తోందిగతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలోనూ పార్టీ నాయకత్వం అదే ఆలోచనలో ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇందుకు అనేక కారణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పోలీసులు, అధికార యంత్రాంగం అధికార కూటమికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వరని వైసీపీ ఆరోపిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇంకా కోలుకోలేదు. ఆర్థికంగా, సామాజికంగా దాడులు ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నికల బరిలోకి దిగడం సాహసమేనని కొందరు భావిస్తున్నారు. ఓడిపోతే వచ్చే పరాభవం కంటే, వ్యవస్థలపై నిరసనగా పోటీకి దూరంగా ఉన్నామని చెప్పడం ద్వారా పార్టీ పరువు కాపాడుకోవచ్చనేది కొందరి వాదన. రాజకీయాల్లో 'మైదానం వదిలి వెళ్లడం' అంటే ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడమే. స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కావు, అవి పార్టీ గ్రామస్థాయి ఉనికిని చాటుకునే అవకాశం కల్పిస్తాయి. పార్టీ పోటీ చేయకపోతే దశాబ్దాలుగా జెండా మోసిన కార్యకర్తలు రాజకీయంగా అనాథలవుతారు. తమ ఉనికి కోసం వారు అధికార కూటమి వైపు లేదా ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూసే ప్రమాదం ఉంది. ఇప్పటికే కీలక నేతలు పార్టీని వీడుతున్న తరుణంలో, ఎన్నికల నుంచి తప్పుకుంటే పార్టీ పూర్తిగా బలహీనపడిందనే ముద్ర పడుతుంది. ఇది పార్టీ నుంచి భారీ వలసలకు దారితీసే అవకాశం ఉంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. పోరాటం చేయకుండా తప్పుకోవడం వల్ల వైసీపీకి దీర్ఘకాలికంగా నష్టమే జరుగుతుంది. ఓడినా పోరాడామనే ముద్ర ఉంటేనే క్యాడర్‌లో భవిష్యత్తుపై ఆశ చిగురిస్తుంది. వైసీపీ నాయకత్వం అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతూనే, ప్రజాక్షేత్రంలో గట్టిగా నిలబడాలి. మార్చిలో జరగబోయే ఈ స్థానిక ఎన్నికలు వైసీపీకి ఒక "లిట్మస్ టెస్ట్" లాంటివి. ఈ పరీక్షలో పోటీ చేసి ఉనికిని చాటుకుంటుందో లేక బహిష్కరణ పేరుతో వెనకడుగు వేస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, ఈ నిర్ణయం ఏపీ రాజకీయాల్లో వైసీపీ భవిష్యత్తును నిర్ణయించబోతోంది.

# పోర్టు రాకతో మచిలీపట్టణానికి మహర్ధశ

**విజయవాడ :** మచిలీపట్నం రూపురేఖలు మారబోతున్నాయి. అక్కడ కొత్తగా షిప్ బిల్డింగ్, రిపేర్ల కోసం సెంటర్ ఏర్పాటు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఏపీ ప్రభుత్వం మారిటైమ్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మచిలీపట్నంలో షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం పలు సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అనుకున్నట్లుగానే మచిలీపట్నం వాసుల కల నెరవేరనుందని జనసేన పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.. ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జివోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారికి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

-మొదటిపేజీ తరువాయి

మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

### మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

### విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

### ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

### హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

### ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

### విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

## పేరు మార్పునకు పచ్చజెండా

-మొదటిపేజీ తరువాయి

అనుమతించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో అనధికార ఇళ్ల క్రమబద్ధీకరణ గడువును జూన్ 30 వరకు పెంపునకు ఆమోదం తెలిపింది. ఏలూరు జిల్లా తోటపల్లిలో 45.6 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సంలో 250 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాలు భూమిని ఎకరాకు ఏడాదికి 31 వేల రూపాయల చొప్పున ఇచ్చేందుకు పచ్చజెండా ఊపింది. ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్‌డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అమరావతి మెరినా అభివృద్ధికి పీపీపీ విధానంలో 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన టెండర్లకు ఆహ్వానించాలని కేబినెట్ నిర్ణయించింది. యాగంటిలో 1000 మెగావాట్లు, రాజుపాలెంలో 800 మెగావాట్ల ప్రాజెక్టులకు ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంత్రివర్గం ముగిసిన తర్వాత తాజా రాజకీయ పరిణామాలు, వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో మాట్లాడారు. సభలో మంత్రుల జవాబులు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని సూచించారు. శ్రీశైలంలో భక్తుల పట్ల పోలీసుల తీరుపైనా సీఎం స్పందించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. క్యూలైన్‌లో ఇబ్బందిపడుతున్న పెద్దవాళ్లను బయటకు తీసుకొస్తున్న సమయంలో వారిని వేరేదారిలో తీసుకెళ్తున్నట్లు భక్తులు భావించారని హోంమంత్రి అనిత వివరించారు. అటువంటప్పుడు పోలీసులు ముందే అనౌన్స్ చేస్తే బాగుండేది కదా అన్న సీఎం చంద్రబాబు విషయాన్ని భక్తులకు అర్థమయ్యే రీతిలో మైక్‌లో చెప్పి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జలజీవన్ మిషన్ కింద ఏపీకి 12 వేల కోట్ల రూపాయలు విడుదలకు కేంద్రం అంగీకరించిందని చంద్రబాబు వెల్లడించారు. జలజీవన్ పనులు 3 ఏళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాల్లో జరుగుతున్న ప్రాజెక్టులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసే విధంగా ఇంఛార్జ్ మంత్రులు చూడాలని దిశానిర్దేశం చేశారు.



## సంపాదకీయం

# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు?

దేశవ్యాప్తంగా ఉచిత పథకాల రాజకీయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు భారీగా నగదు బదిలీలు, ఉచిత సరుకులు, సబ్సిడీలు ప్రకటిస్తుండగా, వాటి వల్ల రాష్ట్రాల ఆర్థిక స్థితి దెబ్బతింటోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుకు నిధులు సమీకరించలేక అప్పులపాలు కావడం పరిపాటిగా మారింది. కొన్ని రాష్ట్రాల్లో అప్పుల భారం పెరిగి, వడ్డీల చెల్లింపులే పెద్ద భారంగా మారాయి. జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో జీతాల చెల్లింపులపై ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఆర్థిక పరిస్థితి నియంత్రణలోనే ఉందని చెబుతోంది. అప్పుల పరిమాణం లక్షల కోట్లకు చేరుకుందని, భవిష్యత్తులో ఇది మరింత భారంగా మారుతుందనే ఆర్థిక నిపుణుల హెచ్చరికలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ సంక్షేమ పథకాల అమలుపై రాజకీయ ఆరోపణలు కొనసాగుతున్నాయి. ఒక ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను మరొకటి కొనసాగించాల్సి రావడం, వాటిని నిలిపివేయడానికి రాజకీయంగా వెనుకడుగు వేయడం సాధారణమైంది. ఫలితంగా ఖజానాపై ఒత్తిడి పెరుగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సంక్షేమ హామీలతోనే ప్రజలను ఆకర్షించాయి. అధికార పార్టీ తాము అమలు చేసిన పథకాలను వివరించగా, ప్రతిపక్షాలు "ఇవ్వని" హామీల జాబితా చదివాయి. "తులం బంగారం ఇచ్చారా? రైతుబంధు వేశారా? పెన్షన్ నాలుగు వేలిచ్చారా?" వంటి ప్రశ్నలతో పరస్పర విమర్శలు జరిగాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి. నగదు బదిలీ పథకాలు, ఉచిత గ్యాస్, ఉచిత రేషన్, ఉచిత విద్యుత్, మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం వంటి పథకాలు ఎన్నికల అజెండాలో కీలకంగా మారాయి. ఒకప్పుడు ఉచితాల సంస్కృతిని విమర్శించిన పార్టీలు కూడా ఇప్పుడు పరిస్థితులకు అనుగుణంగా అలాంటి హామీలను ప్రకటిస్తున్నాయి. ఉచితాల రాజకీయాలపై సుప్రీంకోర్టు కూడా గతంలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఉత్పాదక కార్యకలాపాల నుంచి దూరం చేసే విధంగా ఉచితాలు మారకూడదని వ్యాఖ్యానించింది. అయినప్పటికీ రాజకీయ పార్టీలు ఈ హెచ్చరికలను పెద్దగా పట్టించుకోలేదనే అభిప్రాయం ఉంది. సంక్షేమం అవసరమే. పేదల కోసం సామాజిక భద్రతా పథకాలు అవసరం. అయితే అవి మోతాదు మించితే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుంది. ఎక్స్‌ప్రెస్‌వేలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు తగ్గిపోతే దీర్ఘకాలికంగా రాష్ట్రాల ప్రగతికి ఆటంకం కలుగుతుంది. నగదు బదిలీల వల్ల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందనే వాదన ఉన్నప్పటికీ, అది శాశ్వత పరిష్కారం కాదని కొందరు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఉద్యోగ సృష్టి, పారిశ్రామిక వృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు వంటి అంశాలపై దృష్టి పెట్టకపోతే సంక్షేమం తాత్కాలిక ఉపశమనం మాత్రమే అవుతుంది. ఎన్నికల సమయంలో అసాధ్యమైన హామీలను నియంత్రించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేయాలా అనే చర్చ కూడా మొదలైంది. ఒకసారి అమలు చేసిన ఉచిత పథకాన్ని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోలేకపోవడం రాజకీయ వాస్తవం. అందువల్ల ముందుగానే ఆర్థిక సాధ్యతను పరిశీలించే వ్యవస్థ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఓటర్లూ తమ బాధ్యతను గుర్తించాల్సిన సమయం వచ్చింది. తాత్కాలిక లబ్ధి కంటే దీర్ఘకాలిక అభివృద్ధిని ప్రాధాన్యంగా చూడాలి. ఓటు కొనకూడదు, ఓటు అమ్మకూడదు అనే అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో చివరికి నిర్ణయం ప్రజలదే. రాజ్యాంగపరమైన మార్గదర్శకాలు, ఆర్థిక కట్టుదిట్టమైన నిబంధనలు, పారదర్శక బడ్జెట్ విధానం, ఖర్చులపై సామాజిక ఆడిట్ వంటి చర్యలు తీసుకుంటేనే పరిస్థితి మారుతుంది. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతౌల్యం పాటించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. లేకపోతే ఉచితాల రాజకీయాలు కొనసాగుతూనే ఉంటాయి. అప్పుల చక్రంలో చిక్కుకున్న రాష్ట్రాలు భవిష్యత్ తరాలపై భారాన్ని మోపే ప్రమాదం ఉంది. దివాళా పథకాలకు అడ్డుకట్ట వేయాలంటే రాజకీయ సంకల్పం మాత్రమే కాదు, ప్రజల స్పష్టమైన నిర్ణయం కూడా అవసరం.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# మోదీ విదేశీ పర్యటనల ఖర్చు 462.58 కోట్లు

- 2021-2025 మధ్య 43 దేశాల సందర్శన
- అమెరికా పర్యటనలకే అత్యధిక వ్యయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గత నాలుగేళ్లలో (2021ఉ2025) ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.462.58 కోట్లు వ్యయం చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ కాలంలో ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వ్యూహాత్మక భాగస్వామ్యాల విస్తరణ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడం వంటి లక్ష్యాలతో ఈ పర్యటనలు నిర్వహించినట్లు కేంద్ర వర్గాలు పేర్కొంటున్నాయి.

### అమెరికా పర్యటనలకే అత్యధిక ఖర్చు

మొత్తం వ్యయంలో అత్యధికంగా అమెరికా పర్యటనలకే ఖర్చు అయినట్లు సమాచారం. నాలుగు సార్లు అమెరికా సందర్శనలకు సుమారు రూ.74.4 కోట్లు, అంటే మొత్తం వ్యయంలో దాదాపు 16శాతం ఖర్చు చేశారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ. 22.8 కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో జరిగిన అమెరికా సందర్శనకు రూ. 19.6 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఈ పర్యటనల్లో క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితి సమావేశాలు, ద్వైపాక్షిక చర్చలు ప్రధాన అజెండాగా నిలిచాయి.

### జపాన్, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో

వ్యయంపరంగా జపాన్, ఫ్రాన్స్ దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు దేశాల పర్యటనలకు కలిపి మొత్తం వ్యయంలో సుమారు 9 శాతం ఖర్చు చేసినట్లు




గణాంకాలు సూచిస్తున్నాయి. 2025లో ఫ్రాన్స్ పర్యటన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలిచినట్లు సమాచారం. ప్రధాని ఒక్కరే పాల్గొన్న ఈ పర్యటన కోసం సుమారు రూ. 25.5 కోట్లు వ్యయం చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గొనడమే కాకుండా, మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2021ఉ2025 మధ్య కాలంలో అమెరికా, యుఎఇ, జపాన్ దేశాలను ఒక్కోటి నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలను రెండుసార్లు చొప్పున సందర్శించినట్లు వివరాలు చెబుతున్నాయి.

### విమర్శలు ఉ సమర్థనలు

దౌత్య సంబంధాల బలోపేతం, పెట్టుబడుల ఆహ్వానం, రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాల పెంపు లక్ష్యంగా ఈ పర్యటనలు నిర్వహించినట్లు ప్రధాని మోదీ పలుమార్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత స్థాయిని పెంచడంలో ఈ విదేశీ పర్యటనలు కీలకమని ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, విదేశీ పర్యటనలపై భారీగా ఖర్చు అవుతున్న నిధులపై ప్రతిపక్షాలు గతంలోనే ప్రశ్నలు లేవనెత్తాయి. దేశంలో ఇప్పటికీ పేదరికం, నిరుద్యోగం, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు కొనసాగుతున్న తరుణంలో ఈ వ్యయంపై పునఃపరిశీలన అవసరమని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిధులను ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు మళ్లిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని వారు సూచిస్తున్నారు.

### పారదర్శకతపై డిమాండ్

ప్రధాని విదేశీ పర్యటనల ఖర్చులపై పూర్తి స్థాయి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ప్రతి పర్యటన ఫలితాలపై వైట్‌పేపర్ విడుదల చేయాలని కొందరు రాజకీయ నేతలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో విదేశీ పర్యటనల ప్రణాళికలో ఖర్చు-లాభ విశ్లేషణను స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రయోజనాల కోసం నిర్వహించే విదేశీ పర్యటనలు ఎంతవరకు ఆర్థికంగా సమర్థవంతంగా ఉన్నాయనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### లోక్‌సభలో బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె తీర్మానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆయన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ నిషికాంత్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోక్‌సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రసాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని



వ్యాఖ్యానించా రు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఏంపీ నిషికాంత్ దూబె గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

# లంబోర్గిని ప్రమాద కేసు

### డ్రైవర్ డ్రామాకు కోర్టు చెక్..
### పొగాకు వ్యాపారి కుమారుడి అరెస్ట్
### ఢిల్లీ ఆస్పత్రిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**కాన్పూర్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారులపైకి లగ్జరీ లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో ప్రధాన నిందితుడు, ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివం మిశ్రాను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ప్రమాదం జరిగిన నాలుగు రోజుల తర్వాత, ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో బుధవారం ఒక నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. శివం మిశ్రాను కాపాడే ప్రయత్నంలో భాగంగా మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోయేందుకు ప్రయత్నించాడు. ప్రమాద సమయంలో శివం మూర్ఛపోయాడని, తానే కారు నడిపానని అతను కోర్టుకు వివరించాడు. అయితే, పోలీసుల దగ్గర ఉన్న వీడియో ఆధారాలు అసలు నిజాన్ని బయటపెట్టాయి. ప్రమాదం జరిగిన వెంటనే శివం మిశ్రానే డ్రైవర్ సీటులో ఉన్నట్లు వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. దీంతో పోలీసులు కోర్టుకు గట్టి ఆధారాలు సమర్పించడంతో, మోహన్ లొంగిపోవడాన్ని న్యాయస్థానం నిరాకరించింది. నిందితుడిని రక్షించేందుకు తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు మోహన్‌పై కూడా విచారణ జరిపే అవకాశం ఉంది.

### అసలేం జరిగింది?

గత ఆదివారం మధ్యాహ్నం కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో అతివేగంతో వచ్చిన లంబోర్గిని కారు అదుపు తప్పి మొదట ఒక ఈ-రిక్షాను, ఆ తర్వాత పాదచారులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో 18 ఏళ్ల ఈ-రిక్షా డ్రైవర్ మహ్మద్ తౌఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు. "శివం మిశ్రానే కారు నడిపాడని నిరూపించడానికి మా వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయి. నిందితుడిని ఢిల్లీలో అరెస్ట్ చేశాం, త్వరలోనే కోర్టులో హాజరుపరుస్తాం" అని పోలీస్ కమిషనర్ రఘుబీర్‌లాల్ తెలిపారు. అధికారం, డబ్బు ఉన్నా చట్టం ముందు అందరూ సమానమేనని ఈ అరెస్టుతో పోలీసులు స్పష్టం చేశారు.



# జాహ్నవి కుటుంబానికి 262 కోట్ల పరిహారం

## రెండేళ్ల తర్వాత దక్కిన న్యాయం

### సియాటెల్ నగర యంత్రాంగం చారిత్రాత్మక నిర్ణయం
### అమానవీయంగా ప్రవర్తించిన అధికారుల బర్తరఫ్

**న్యూఢిల్లీ/కర్నూలు, ఫిబ్రవరి 12:** అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యానికి బలైపోయిన కర్నూలు యువతి కందుల జాహ్నవి (23) మృతి కేసులో అక్కడి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. జాహ్నవి కుటుంబం దాఖలు చేసిన సివిల్ దావాపై స్పందించిన సియాటెల్ నగర యంత్రాంగం, 29 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 262 కోట్లు) భారీ పరిహారాన్ని చెల్లించేందుకు అంగీకరించింది. ఈ మేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. వివరాల్లోకి వెళితే.. 2023 జనవరి 23న సియాటెల్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్న జాహ్నవి, రోడ్డు దాటుతుండగా అతివేగంతో వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఆ సమయంలో అధికారి కెవిన్ దేవ్



గంటకు 119 కిలోమీటర్ల వేగంతో కారును నడిపినట్లు తేలింది. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటన తర్వాత మరో పోలీసు అధికారి డేనియల్ అడరర్ బాడీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపాయి. జాహ్నవి మరణాన్ని ఎగతాళి చేస్తూ.. "ఆమెది పరిమితమైన విలువ ఉన్న జీవితం, 11 వేల డాలర్లు ఇచ్చి చెక్ రాసిస్తే సరిపోతుంది" అంటూ అతను నవ్వుతూ మాట్లాడటం భారతీయుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. భారత ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని అమెరికా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలకు డిమాండ్ చేసింది. అమానవీయంగా మాట్లాడిన డేనియల్ అడరర్ తో పాటు, కారు నడిపిన కెవిన్ దేవ్‌ను కూడా సియాటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ విధుల్లో నుంచి తొలగించింది. తొలుత నిందితులపై క్రిమినల్ కేసులు లేవని కోర్టు ప్రకటించినా, కుటుంబ సభ్యులు పట్టుదలతో పోరాడి ఈ భారీ సివిల్ సెటిల్‌మెంట్‌ను సాధించారు. "జాహ్నవి ప్రాణం చాలా విలువైనది.. ఆమె మరణం అత్యంత బాధాకరం" అని సియాటెల్ నగరం అధికారికంగా విచారం వ్యక్తం చేస్తూ పరిహారాన్ని ప్రకటించింది. ఈ తీర్పుపై జాహ్నవి కుటుంబ సభ్యులు మరియు ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుతో ప్రాణాన్ని వెనక్కి తీసుకురాలేమని, కానీ బాధ్యత గల అధికారుల నిర్లక్ష్యంపై ఇది గట్టి హెచ్చరిక అని వారు పేర్కొంటున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు


# ఉపాధి హామీ హక్కును తొలగించిన కేంద్ర ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ పిసిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జె డి శీలం

**ముమ్మిడివరం( మనసులో మాట)ఫిబ్రవరి 12.** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో హక్కును కేంద్ర ప్రభుత్వం తీసివేయడం అన్యాయమని ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని మాజీ కేంద్రమంత్రి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ జెడి శీలం డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రాష్ట్రంలో పర్యటించనున్న సందర్భంగా గురువారం కాకినాడ నుండి అమలాపురం వెళ్తూ ముమ్మిడివరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పోలమ్మ చెరువుగట్టు బుద్ధ పార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, పార్టీ నాయకులు , ప్రజాసంఘాల నాయకులు జీడి శీలం ను కలిశారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా జెడి శీలం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేస్తూ జిరాంజి పథకంగా మార్చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ తోపాటు అనేక రాష్ట్రాల్లో సరైన పనులు లేక వలస వెళుతున్న సందర్భాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని హక్కుగా చట్టం చేయడం జరిగిందన్నారు. నేడు ఈ చట్టాన్ని నీరుగారిస్తూ గ్రామ పంచాయతీలకు కూడా అధికారులు తగ్గిస్తూ, కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే ఈ పథకాన్ని



అమలు చేసే విధంగా ఈ చట్టాన్ని రూపొందించడం దారుణం అన్నారు. భారత రాజ్యాంగాన్ని అందించడంలో బాబాసాహెబ్ అంబేద్కర్ తో పాటు మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా ఆజాద్, బాబు రాజేంద్రప్రసాద్ వంటి ప్రముఖులు ఈ దేశంలో అన్ని వర్గాల ప్రజలకు జీవించే హక్కులు తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా జాతీయ ఉపాధి హామీ పథకం పేద ప్రజలకు పని కల్పిస్తూ ఉపాధి ఇవ్వడంలో విజయవంతంగా నడుస్తుందన్నారు. అంతేకాకుండా కేంద్ర బడ్జెట్లో కూడా 60 శాతం నిధులు తగ్గించడం అన్యాయమన్నారు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వం 100% నిధులు కేటాయించవలసింది పోయి రాష్ట్రాలపై భారం మోపుతున్నప్పటికీ ఏ ఒక్క ఎంపీ కూడా నోరు విప్పక పోవడం ప్రజలకు ద్రోహం చేయడమే అన్నారు. బిజెపి, జనసేన, టిడిపి పార్టీలోని నాయకత్వం వహిస్తున్న నాయకులు ఆలోచన చేయకపోతే పేద ప్రజలు హక్కులు కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రచ్చబండ చేపట్టడం జరిగిందన్నారు. పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల బస్సు యాత్ర ద్వారా రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజావ్యతిరేక, కార్మిక, ఉద్యోగ, విద్యార్థులు సమస్యలపై కూడా పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పోలమ్మ చెరువుగట్టు పై జాతీయ నాయకుల విగ్రహాలు తొలగించిన అధికారులు వెంటనే వాటిని పునర్నిర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్వయంగా జెడి శీలం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేయడం జరిగింది. సిపిడబ్ల్యు స్కీమ్ ప్రాజెక్ట్ అధికారులు జాతీయ నాయకులు విగ్రహాలని వెంటనే పునర్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ శిలా విగ్రహానికి మాజీ కేంద్రమంత్రి జెడి శీలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల ఉదయ భాస్కర్ వర్మ, దివి వెంకన్నబాబు, గద్దం సురేష్ బాబు, ధోనిపాటి విజయలక్ష్మి, గోడి భాస్కరరావు,కుప్పిశెట్టి బాలకృష్ణ, ఉద్యోగ సంఘాల నాయకులు కాశి బాబు జగజీవన్ రావ్, ఆర్ పి.ఐ నాయకులు ధోనిపాటి ఆంజనేయులు, సిఐటియు నాయకులు జి.దుర్గాప్రసాద్, సఖి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తమ హక్కుల సాధన కోసం కాజులూరులో కార్మిక-కర్షకుల సమ్మె



**కాజులూరు మనసులో మాట ఫిబ్రవరి 12 :** మండల కేంద్రమైన కాజులూరులో కార్మికులు, కర్షకులు ఐక్యంగా సమ్మె చేపట్టడం ప్రస్తుత సామాజిక--ఆర్థిక పరిస్థితులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, సరైన వేతనాలు లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్న కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందనీ జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం రాజశేఖర్ , వల్లు రాజబాబు అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఖాళీలలో అల్లూరు సీతారామరాజు విగ్రహం నుండి తాహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డిప్యూటీ తాహసిల్దార్ శ్రీనివాస్ కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాజశేఖర్ రాజబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిందని ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడుస్తున్న ఇప్పటికి ఎక్కడ అమలు చేయడం లేదన్నారు. ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్లుగా లేబర్ కోడ్ల రద్దు, కార్మికులకు కనీస వేతనం హామీ, ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని, రోజుకు కనీస కూలి రూ.600 చెల్లింపు, అలాగే భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేయాలనీ కోరినప్పటికీ అమలు కావడం లేదన్నారు. నూతన లేబర్ కోడ్ల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని, ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీవన వ్యయానికి తగిన విధంగా కనీస వేతనాలను పెంచాలని వారు డిమాండ్ చేశారు. రోజుకు రూ.600 కనీస కూలి అమలు చేస్తేనే కార్మిక కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపగలరని అన్నారు.ఇక ఉపాధి హామీ కూలీల విషయానికి వస్తే, సంవత్సరానికి కేవలం కొద్ది రోజులే పని లభించడం వల్ల గ్రామీణ కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయనీ. అందుకే కనీసం 200 రోజుల పని హామీ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు కౌలు రైతుల సమస్యలపై కూడా సమావేశంలో భూ యజమానులపై ఆధారపడకుండా, కౌలు రైతులకు నేరుగా కౌలు కార్డులు జారీ చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కౌలు కార్డులు లేకపోవడం వల్ల అనేక మంది రైతులు రుణాలు, సబ్సిడీలు, బీమా ప్రయోజనాలకు దూరమవుతున్నారని వారు తెలిపారు.ఈ ఉద్యమం కేవలం వేతనాల కోసం మాత్రమే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం కూడా జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మిక--రైతుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాజులూరులో జరిగిన ఈ సమ్మె గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతిబింబంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు ,అంగన్వాడి సిబ్బంది ,ఆశా వర్కర్లు ,కౌలు రైతులు పాల్గొన్నారు.

# ఏపీఎస్ఎస్డీసీ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ సద్వినియోగం చేసుకోండి

**బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రసన్నశ్రీ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం రాజమహేంద్రవరం క్యాంపస్ లో ఏపీఎస్ఎస్డీసీ సౌజన్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ షార్ట్ టర్మ్ ఆఫ్ లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని, క్యాంపస్ విద్యార్థులంతా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. గురువారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ఏపీఎస్ఎస్డీసీ సౌజన్యంతో స్కిల్ డెవలప్మెంట్ షార్ట్ టర్మ్, ఆఫ్ లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 16 నుండి 20వ తేదీ వరకు ఎంఎస్ ఆఫీస్ పై ఆఫ్ లైన్ లో శిక్షణ అందిస్తారని తెలిపారు. విశ్వ విద్యాలయం క్యాంపస్ లో చదువుతున్న బీఈడీ, ఎంఎస్సీ విద్యార్థులందరికీ ఈ కోర్సులో ఉచితంగా శిక్షణ అందిస్తారన్నారు. తర్వలో కంప్యూటర్ ఫండమెంటల్స్, సర్టిఫికెట్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్, ఏడ్లూఎస్, ఆప్టిట్యూడ్, టెలీ, సర్టిఫికెట్ ఇన్ మిషన్ లెర్నింగ్, డేటా ఎనలిటిక్స్, పైథాన్, గ్రాఫిక్ డిజైన్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి కోర్సులలో శిక్షణ అంది స్తామని తెలియజేశారు. ఆసక్తి గల విశ్వ విద్యాలయ విద్యార్థులు https: // naipunyam.ap.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ



ఎంప్లాయి బిలిటీ స్కిల్ సెంటర్ సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ఆచార్య బీ జగన్మోహన్ రెడ్డి, ఏపీఎస్ఎస్డీసీ ఈఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ శ్రీరామచంద్రమూర్తి, ట్రైనర్ జీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# క్వాయర్ పరిశ్రమ ద్వారా గ్రామీణ వాసులకు ఉపాధి-కలెక్టర్



**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 12 :** వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కోనసీమ ప్రాంతంలో క్వాయర్ పరిశ్రమలు స్థాపన ద్వారా గ్రామీణ ఉపాధి సృష్టి, మహిళలకు ఉపాధి కల్పన సాధికారత క్వాయర్ ఎగుమతుల పెంపు దలకు కీలక పాత్ర పోషి స్తుందని ఆ దిశగా ఉప్పల గుప్తంలో ఐదు ఎకరాలు విస్తీర్ణంలో అన్ని కాంపో నెంట్స్ తో పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్ల డించారు. గురువారం క్వాయర్ బోర్డు, కేరళ కొచ్చి కేంద్ర క్వాయర్ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్తలు గిరీష్ కుమార్, సుమీ సబాస్తియన్ వివేక్ ప్రసాద్ షా, క్వాయర్ బోర్డ్ సభ్యులు సి.కే జయానంద్ రీజనల్ క్వాయర్ అధికారి పవన్ కుమార్ ఏపీఐఐసీసీ జిల్లా జోనల్ మేనేజర్ రాధామణి, ఎస్టేట్ మేనేజర్ పద్మజాదేవి, కడియపులంక క్వాయర్ క్లస్టర్ చైర్మన్ నండూరి ఫణి కుమార్, మాచవరం రాజరాజేశ్వరి క్వాయర్ ఇండ స్ట్రీ అంబటి కోటేశ్వ రరావు లతో జిల్లా ఉద్యాన అధికారి బివి రమణ లతో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్ష తన డిపిఆర్ రూపకల్పన ఉత్పత్తుల తయారీ నాణ్యత ఎగుమతుల ప్రోత్సాహకం వంటి అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పలగుప్తంశీ నందు 13.5 కోట్ల అంచనా వ్యయం తో క్వాయర్ ఉత్పత్తుల అభివృద్ధి కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మరియు ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపనకు నిర్మాణశీ క్వాయర్ ఆధారిత ఉత్ప త్తులు క్వాయర్ యార్న్, మ్యాట్స్, కోకో పిట్, జియో టెక్స్టైల్స్, వుడ్, గార్డెన్ ఉత్పత్తులు మొదలైనవి తయారీకి సమగ్ర సౌకర్యాలు అందించేందుకు ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఉప్పలగుప్తం నందు అయిదు ఎకరాలు స్థలాన్ని ఈ ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఇంక్యుబేషన్ కామన్ ఫెసిలిటీ కేంద్రాలు అన్ని కాంపోనెంట్లతో నిర్మా ణానికి పూర్తిస్థాయి-ంలో లేఔట్లు డిపిఆర్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆధునిక యంత్రాలు సాధనాల ప్రాప్తి,ఉత్పత్తి నాణ్యత మెరు గుదల ప్రామాణికరణ, బ్రౌన్ ఫైబర్ వైట్ ఫైబర్ గా కన్వర్షన్ అంశాలపై సుదీర్ఘంగా చర్చిం చారు.స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ సపోర్ట్. మార్కెటింగ్, ఎగుమతి బ్రాండింగ్ ప్రోత్సాహం వంటి హాశీగులతో ఎక్స్పో జర్ విజిట్ కేంద్రంగా తీర్చిదిద్ది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించే రీతిలో ఉండాలన్నారు. ఔత్సా హిక పారిశ్రామికవేత్తలకు ఏ ఉత్పత్తికి ఎంతమేర పెట్టుబడి వ్యయంతో ఏ రకాల మిషనరీ ఆధారంగా ఉత్పత్తి జరిగి లాభదాయకంగా ఉంటుందో అధ్యయనం చేసేలా ఈ కేంద్రం అన్ని విధాల ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ అధ్యయనం ఆధారంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ పథకాల రాయితీలతో యూనిట్ల స్థాపించుకుని గ్రామీణ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని ఆయన ఆకాంక్షించారు.స్థానిక యువ తకు, మహిళలకు ఉపాధి అవకాశాల పెంపు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ద్వారా యూనిట్ల స్థాపనకు ఈ కేంద్రం ఔత్సాహిక పారి శ్రామికవేత్తలకు దిక్సూచిగా నిలవాలన్నారు. జియోటెక్స్టైల్ ప్రొడక్షన్ యూనిట్ డైయింగ్, ఫినిషింగ్ యూ నిట్,టెస్టింగ్ ల్యాబ్, క్వా లిటీ కంట్రోల్ విభాగం ప్యాకేజింగ్ స్టోరేజ్ సదుపాయాలు సామూహిక వనరుల విని యోగం ద్వారా ఖర్చు తగ్గింపు అంశాలపై దృష్టి పెట్టి పరిశ్రమల స్థాపనకు చేయూతనందించాల న్నారు. నాణ్యతప్రమాణాల సాధన ఉత్పత్తి సామర్థ్యం పెంపు అంశాలతో పూర్తిస్థాయి ప్రతిపాదనలు రూపొం దించాలని సూచించారు. యూనిట్ స్థాపన కొరకు విద్యుత్, నీటి సరఫరా, భద్రతా సదుపాయా లు ట్రైనింగ్ హాల్ ,ఫైర్ సేఫ్టీ వ్యర్థ నిర్వహణ వ్యవస్థలు పక్కాగా ఉండాలన్నారు

**క్లస్టర్ ఆధారిత అభివృద్ధి**

సహకార వాతావరణం ప్రభుత్వ రాయితీలతో ప్రోత్సాహం కల్పన తో ముందుకు సాగాలన్నారు. ఎంఎస్ఎం ఈ పథకాలు క్వాయర్ బోర్డ్ సహాయం, పి ఎమ్ ఎఫ్ఎం ఇ మొదలైన. ప్రాజెక్ట్ ద్వారా క్వాయర్ పరిశ్రమ సమగ్ర అభివృద్ధి మార్గ నిర్దేశం చేసేలా యూనిట్ ఉండాలన్నారు. స్థానిక వనరులను సమర్థ వంతంగా వినియోగించి ఉపాధి, ఆదాయం ఎగు మతులు పెంచుతూ జీవనో పాదులు కల్పించి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్నారు. వారం రోజులలో డిపిఆర్ సిద్ధం చేసి సమర్పిం చాలని ఆయన కేంద్ర క్వాయర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలకు సూచించారు.

# జాతీయ స్థాయి యోగా పోటీలలో మహిళా కానిస్టేబుల్ ప్రతిభ

**రెండు పతకాలు సాధించిన రోహిణిని అభినందించిన ఎస్పీ నరసింహ కిశోర్**



**రాజమహేద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12 :** జాతీయ స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చూపిన మహిళా కానిస్టేబుల్ ఆర్ రోహిణినీ జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ అభినందించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ అండ్ యోగా క్లస్టర్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్--2025 లో యోగాసన గ్రూప్ ఈవెంట్, యోగాసన ఆర్టిస్టిక్ ఫెయిర్ ఈవెంట్స్ లో 2 కాంస్య పతకాలను మహిళా కానిస్టేబుల్ ఆర్ రోహిణి (డబ్ల్యూ పీసీ-1469 కంట్రోల్ రూమ్) గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ స్థాయి క్రీడలలో గెలుపొందిన పతకాలు చూపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆమెను పతకాలతో సత్కరించి, శాలువా కప్పి సన్మానించి, ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# సమగ్ర అభివృద్ధి లక్ష్యం కావాలి!

**కమిషనర్ సునీత.**

**పెదపూడి (మనసులో మాట) ఫిబ్రవరి 12;** సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా మార్కెట్ కమిటీ పాలకవర్గాలు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఐఏఎస్ కోరారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడ కు చెందిన అనపర్తి ఏఎంసీ చైర్మన్ జుత్తుక సూర్య కుమారి గురువారం రాష్ట్ర కమిషనర్ సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం లో మార్కెట్ కమిటీ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను సూర్యకుమారి రాష్ట్ర కమిషనర్ సునీతకు వివరించారు. అనపర్తి ఏఎంసీ అభివృద్ధికి, రైతుల సంఖ్యామానికి సహకారాన్ని అందించాలని కోరుతూ కమిషనర్ సునీతకు చైర్మన్ సూర్యకుమారి వినతి పత్రం అందించారు. కమిషనర్ సునీత సానుకూలంగా స్పందించినట్లు సూర్యకుమారి తెలిపారు.


# పెదపూడిలో కథం తొక్కిన కార్మికులు



**పెదపూడి (మనసులో మాట) ఫిబ్రవరి 12;** సిఐటియు కేంద్ర కమిటీ పిలుపుమేరకు పెదపూడి లో గురువారం వివిధ కార్మిక సంఘాల నేతలు కార్యకర్తలు మహా ఆందోళన నిర్వహించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పెదపూడి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సిఐటియు మండల కన్వీనర్ మిరియాల రాజేశ్వరి ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం సాగిస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తక్షణమే కార్మిక రంగ సమస్యలపై స్పందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సత్తిరాజు కోరారు. ఆశ, అంగన్వాడి, భవన నిర్మాణ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్మికుల సహకారంతో పెదపూడి మండలంలో దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయినట్లు సిఐటియు కన్వీనర్ మిరియాల రాజేశ్వరి తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం

**జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అత్యవసర వైద్య ఖర్చులకు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సల కోసం ఎదురవుతున్న ఆర్థిక బాధలను తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించాలని జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిది అందిస్తున్నామని పేదవారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జీనుమణి బాబు, సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, గోవిందపురం సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు, పిట్ట అరుణ్, మారిశెట్టి రాధా, ఉండవల్లి చందు, గండే చినరాజు, కొత్తపల్లి సత్యనారాయణ నలమాటి ఆనంద్, నాని రాజు, ఆయిల్ స్వామి, కొల్లు రామకృష్ణ, హనుమంతు పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## ముమ్మిడివరంలో కార్మిక సంఘాలు భారీ ర్యాలీ



**ముమ్మిడివరం ( మనసులో మాట) ఫిబ్రవరి 12.**దేశవ్యాప్త జరుగు సారవత్రిక సమ్మెలో భాగంగా ముమ్మిడివరం మండలంలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొని నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నినాదించారు. గురువారం ముమ్మిడివరం మండల ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర నుండి ఎయిమ్స్ కాలేజీ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ నాయకత్వం వహించారు.సమ్మె లో పాల్గొన్న సంఘాలు అంగన్ వాడి, భవన నిర్మాణ కార్మిక సంఘం, కొబ్బరి ఒలుపు, ఆశ, ఉపాధి హామీ కూలీలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, మున్సిపల్ కార్మికులు, , ఆటో కార్మికులు, ముఠా జట్టు కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, మండల ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు యల్లమెల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల మల్లికార్జునరావు, బొంతు శ్రీనివాసరావు, సిఐటియు కో కన్వీనర్ నిమ్మకాయల వెంకటేష్, కముజు సత్తిబాబు, శీలం వెంకట రమణ,గంజా శ్రీనివాస్,జి శాంతి కుమారి, జి మంగయమ్మ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, పట్టా శివప్రసాద్, కాకి రాంబాబు,, బుంగ కుమార్, నాగవేణి, వర్మ,గంజా నాగేశ్వరరావు, ఏవి రమణమ్మ, విత్తనాల ఏడుకొండలు, జగడం నాగేశ్వరరావు,రాంబాబు, మూడే చిన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ఎన్నికలు

**అమలాపురంలో సర్వం సిద్ధం-ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్**

**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 13 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రెండోసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. పోటీలో 143 మంది అభ్యర్థులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 23 బార్ కౌన్సిల్ సభ్యత్వ స్థానాల కోసం 143 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అమలాపురం బార్ అసోసియేషన్ నందు రేపు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అమలాపురం బార్ అసోసియేషన్‌లో మొత్తం 306 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఓటు వేసే ప్రతి ఒక్కరూ కనీసం 5 ఓట్లను, గరిష్టంగా 23 ఓట్లను వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యాయవాదులందరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ, క్రమశిక్షణతో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఫ్యామిలీ సర్వేలు వేగవంతంగా పూర్తి చేయాలి

**ఇన్చార్జి ఎంపిడిఓ రాజలపూడి పద్మలత**

**కాజులూరు,మనసులో మాట ఫిబ్రవరి 12 :** గ్రామాలలో కొనసాగుతున్న ఫ్యామిలీ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్చార్జి ఎంపిడిఓ రాజలపూడి పద్మలత సూచించారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో మొత్తం 24,234 కుటుంబ సర్వేలు నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 12,712 సర్వేలు పూర్తయ్యాయని ఆమె తెలిపారు. మిగిలిన కుటుంబాల సర్వేలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి ఆమె ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫ్యామిలీ సర్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందువల్ల ప్రతి కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.సర్వేల్లో ఎదురయ్యే సమస్యలను తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. మండల అభివృద్ధికి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు ఫ్యామిలీ సర్వేలు బలమైన ఆధారమని ఆమె తెలిపారు. స్వమిత్వ సర్వే ప్రక్రియను డిప్యూటీ ఎంపీడీవో చక్రపాణిరావు, గ్రామ వార్డు సర్వే ప్రక్రియను ముద్రగడ సత్యనారాయణమూర్తి పర్యవేక్షిస్తున్నారని ఆమె తెలిపారు.

## కాజులూరులో ఈ-క్రాప్ నమోదు 79 శాతం పూర్తి



**కాజులూరు మనసులో మాట ఫిబ్రవరి 12 :** కాజులూరు మండలంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని 21 రైతు సేవా కేంద్రాలలో ఇప్పటివరకు 79 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ తెలిపారు.రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో పొందేందుకు ఈ-క్రాప్ నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇంకా నమోదు చేయించుకోని రైతులు వెంటనే తమ సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పంట బీమా, పంట నష్టం పరిహారం వంటి పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.మండలంలోని అన్ని గ్రామాలలో నమోదు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ అధికారి వి. అశోక్ పేర్కొన్నారు.

## విలేఖరి పై దాడి -కేసు నమోదు

**ముమ్మిడివరం( మనసులో) ఫిబ్రవరి 12** కాట్రేనికోన మండలం చెయ్యరు గ్రామానికి చెందిన శ్రీ కేశవ స్వామి దేవస్థానం భూముల్లో అక్రమంగా జెసిబి, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న ఘటనలో విధి నిర్వహణలో న్యూస్ కవర్ చేయడానికి వెళ్లిన న్యూస్ రిపోర్టర్ పై దాడి ఘటన ముమ్మిడివరం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. ఈనెల ఆరో తేదీన సాయంత్రం అదే గ్రామానికి చెందిన గూడూరి సూర్యనారాయణ రాజు ఘటనా స్థలంలో విజువల్స్, ఫోటోలు తీస్తున్న న్యూస్ రిపోర్టర్ యేళ్ల శ్రీనివాసరావు పై కులం పేరుతో దూషించి, తీవరంగా దుర్భాసలాడి భౌతిక దాడికి పాల్పడం జరిగిందని బాధితుడు ఫిర్యాదులు పేర్కొన్నాడు. ఈ ఘటనపై కాట్రేనికోన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై అవినాష్ కేసు దర్యాప్తు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ క్రింద 115(2),351(2),దీచీా, 3(1)తీ, 3(1)o,3(2)(ఋ) ఎస్సీ ఎస్టీ యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడం జరిగింది.

## కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి

- **దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసన, మానవహారం**



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు జగ్గంపేటలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు ,మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరుకుర్తి ఏసు, ఐ ఎఫ్ టి యు జాతీయ కమిటీ సభ్యుడు వి.చిట్టిబాబు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు రాజు, సిఐటియు మండల కార్యదర్శి పి సుజాత తదితర నాయకులు పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారులకు వచ్చిన తర్వాత కార్మికులు ,రైతులు ఇబ్బందులు పడుతున్నారే తప్ప వారికి న్యాయం చేయడంలో విఫలమయ్యారని వారు విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి దేశాన్ని మొత్తం పెట్టి అప్పుల ఊబిలో పడేస్తున్నారని వారు తెలిపారు.

**డిమాండ్స్:**

1. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి 2. వి బి జి రాంజీ చట్టం రద్దు చేయాలి. 3. జాతీయ విత్తన చట్టం రద్దు చేయాలి. 4. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలి. వీటిని రద్దు చేయకుండా పరిపాలన సాగిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ,భవిష్యత్తులో ఇంకా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుఎబ డాన్ శ్రీను, ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గంట బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బాబురావు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యుడు వరదరాజు, పిఓడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యురాలు వి.శాంతి, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్ .లక్ష్మి, జగ్గంపేట మండలం యానిమేటర్ మండల కార్యదర్శులు శ్రీదేవి, జి.ఈశ్వరి, సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షుడు బోర సత్తిబాబు ,యుటిఎఫ్ నాయకుడు వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ టౌన్ ప్రెసిడెంట్ కొల్లే సత్తిబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం ప్రెసిడెంట్ అడబాల వీరభద్రరావు, ఆశ వర్కర్స్ యూనియన్ మండల ప్రెసిడెంట్ సిహెచ్ మంగ, అంగన్వాడి నాయకులు గంగ భవాని ,ఏ.నాగమణి, వి రామలీల ,కృపాభాయ్, అమ్మాజీ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కార్యకర్తలు, కూలీలు ,కార్మిక సంఘం కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, యానిమేటర్లు, బ్యాంకు ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథం నిర్వహణ కోసం దరఖాస్తులు కోరుతున్నారు

**అమలాపురం(మనసులో మాట) ఫిబ్రవరి 12:** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంబాజీపేట, రాజోలు, మామిడికుదురు, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, సఖినేటిపల్లి, ఆత్రేయపురం, అయినవిల్లి, కొత్తపేట, అమలాపురం, ఉప్పలగుప్తం మరియు పి.గన్నవరం మండలాలలో ఒక యూనిట్ గా స్వచ్ఛ రథం నిర్వహణ కోసం అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగు తోందని జిల్లా పంచాయతీ అధికారి శాంత లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి మండలాన్ని ఒక యూనిట్ తీసుకోవడం జరిగిందని కావున విడివిడిగా దరఖాస్తులు చేసుకోవా లన్నారు వర్తించే గరిష్ట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (మోడల్-1 కి రూ.25,000/ నెల, మోడల్ II కి రూ.21,000/నెల), దరఖాస్తులను సమ ర్పించడానికి చివరి తేదీ (టెండర్ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజు ల్లోపుగా నిర్దేశించామన్నారు. స్క్రాప్టిలింగ్, ఘన వ్యర్థాల సేకరణ లేదా పునర్వినియోగపరచదగిన పదార్థాల నిర్వహణలో కనీసం మూడు సంవత్స రాల ధృవీకరి ంచదగిన అనుభవం కలిగి ఉండాల న్నారు స్క్రాప్ లేదా పున ర్వినియోగపరచదగిన పదార్థాల నిర్వహణ కోసం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్సు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు.దరఖాస్తుదారుడు దరఖాస్తును ఆధార్ పాన్ కాపీ. నివాసం లేదా సంస్థ రిజిస్ట్రేషన్ రుజువు. అనుభవ ధృవీకరణ పత్రం మరియు సహాయక పత్రా లు సమర్పించాలన్నారు స్క్రాప్ డీలింగ్/MRF ఆపరేషన్ కోసం ట్రేడ్ లైసెన్స్, కలిగి ఉండాలన్నా రు. +ూరిజిస్ట్రేషన్ వర్తిస్తే గత మూడు సంవత్సరాల టర్నోవర్ స్టేట్ మెంట్ మరియు ×ు రిటర్న్. సమర్పించాలన్నారు.స్వచ్ఛ రథం కోసం ప్రతిపాదిం చబడిన వాహనం వివరా లు RC కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, కాలుష్య ధృవీకర ణ పత్రం, బీమాధృవీకరణ పత్రం, ఫిట్ నెస్ సర్టిఫికేట్ తో పాటుగా బ్యాంక్ పాసుబుక్ ఉమ్మడి ఆపరేషన్ వివరాలు సమర్పించాలన్నారు. అధికారుల నుండి నెలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందడానికి బిడ్డర్ కోట్ చేసిన మొత్తంసీలింగ్ )- పరిమితి మోడల్-1 కి రూ.25,000/-, మోడల్-II కి రూ:21000/-, మించ కూడదన్నారు.పాస్ పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ మరియు సంప్రదింపు వివరాలు సమర్పించాలన్నారు దరఖాస్తు దారుడు రూ.10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ ను పూఇూ చిరు నామాతో దరఖాస్తు తో పాటు సమర్పించాలని, ఈ సొమ్ము తిరిగి చెల్లించబ డదన్నారు.టెండర్ ఆమోదించుటకు గాని రద్దుపరచుటకు గాని మరియు వాయిదా వేయుటకు గాని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి మరియు కన్వీనర్ వారికి పూర్తి అధికారశీ కలద న్నారు.ఇతర వివరాల కొరకు కార్యాలయపు చరవాణి 9247862775 నందు సంప్రదించవలెనని ఆమె ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## సార్వత్రిక సమ్మెతో హోరెత్తిన పిఠాపురం

**దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా పట్టణంలో కార్మిక, ప్రజాసంఘాలు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి**




**పిఠాపురం, (మనసులో మాట)ఫిబ్రవరి 12:** కేంద్ర కార్మిక సంఘాలు, సిఐటియు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా గురువారం పిఠాపురం పట్టణంలో కార్మిక, ప్రజాసంఘాలు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి ఉప్పాడ బస్టాండ్ వరకు సిఐటియు సహా వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహించిన ధర్నాలో నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కుంచె చిన్న, యూటీఫ్ నాయకులు సిహెచ్ సూరిబాబు లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం మానుకోవాలని, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం వెనక్కి తగ్గకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ప్రధానంగా ఈ కింది డిమాండ్లను వెంటనే పరిగణలోకి తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలి.ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించి, 200 రోజుల పని దినాలు కల్పించి, రోజువారీ వేతనం రూ. 600 చెల్లించాలి. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కొత్త పిఆర్సిని ప్రకటించాలని కోరారు. రద్దు చేసిన జర్నలిస్టుల హక్కుల చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలి.మహిళలకు భద్రత కల్పించి, 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని అమలు చేయాలి.రజక వృత్తిదారులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం, లేబర్ కోడ్‌ల రద్దు వరకు పోరాటం ఆగదని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు చామంతి, వెంకట లక్ష్మి, ఆశా నాయకులు పద్మావతి, భవన నిర్మాణ సంఘం నాయకులు గోవింద్, బి.ఎన్ శ్రీను, ఐద్వా నాయకులు కె. మణి, మున్సిపల్ యూనియన్ నాయకులు అప్పారావు, రజక సంఘం నాయకులు కోనేటి రాజు, ప్రకాష్, రిక్షా యూనియన్ సభ్యులు సహా పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## కడియం మండలంలో హోమ్ స్టేలు, పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం

- **నర్సరీ ఉత్పత్తుల ఎగుమతులకు సింగిల్ డెస్క్ఏర్పాటు**
- **జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** రాజమహేంద్రవరం రూరల్ కడియం మండలాన్ని పర్యాటక, ఉద్యాన రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-29 ప్రకారం హోమ్ స్టేలను ప్రోత్సహించే దిశగా నిర్మాణాలు చేపట్టడానికి గరిష్ఠంగా 30 శాతం వరకు ప్రభుత్వ రాయితీ అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు. గురువారం బొమ్మూరు కలెక్టరేట్‌లో కడియం మండలంలో హోమ్ స్టేల నిర్మాణం, నర్సరీ ఉత్పత్తుల విదేశీ ఎగుమతులు, పర్యాటకాభివృద్ధి తదితర అంశాలపై నర్సరీ రైతులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి చర్చించారు. కడియం నర్సరీలలో పెంచే వివిధ రకాల మొక్కలకు విదేశాలలో విశేష డిమాండు ఉన్న నేపథ్యంలో రైతులు నేరుగా ఎగుమతులు చేపట్టేందుకు అవసరమైన అనుమతులు, ధృవపత్రాలు సులభంగా పొందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ క్రమంలో బొమ్మూరు ఆర్‌టీఐహెచ్‌లో గాని లేదా కడియంలో గాని 'సింగిల్ డెస్క్' వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎగుమతి ప్రక్రియలను సరళీకృతం చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ అభివృద్ధి కింద కడియం మండల అభివృద్ధిని ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు ఇతర రైతులను చైతన్యపరచి, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. దీని ద్వారా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆమె తెలిపారు. కడియం నర్సరీల సోయగాన్ని పర్యాటక అవకాశంగా మలుచుకునేందుకు హోమ్ స్టేలు నిర్మించడం లాభదాయకమని కలెక్టర్ వివరించారు. రాజమహేంద్రవరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో భవిష్యత్తులో హోమ్ స్టేలకు మంచి డిమాండు ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అదనపు ఆదాయ వనరులను సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. అదే విధంగా కడియం నుంచి వాడపల్లి వరకు కాలువ మార్గంలో బోటు సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని, దీని ద్వారా పర్యాటక రంగం మరింత విస్తరించే అవకాశముందని ఆమె సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, డీహెచ్ఓ మల్లికార్జునరావు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ సూర్యప్రకాశ్, కడియం నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఆ బెదిరింపులు ఎవరికి? -మంత్రులకా?..ప్రభుత్వానికా??

- నలుగురు మంత్రులకు లేఖల ద్వారా బెదిరింపులపై పోలీసులు ముమ్మర దర్యాప్తు
- మావోయిస్టులా?..ఆకతాయిలా??
- అందరిలోనూ ఇదే సందేహం..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12 :** రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ జరగని సంఘటన. నలుగురు మంత్రులకు ఒకే రోజు బెదిరింపు లేఖలు రావడం. అదీ నిషేధిత మావోయిస్టుల పేరుతో. నమ్మటం, నమ్మకపోవడం వేరే విషయం. కాకపోతే రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, అనగాని సత్య ప్రసాద్, సత్యకుమార్..వీరికి బెదిరింపు లేఖలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ విధమైన బెదిరింపు లేఖలు ఎందుకు పంపినట్లు?. ఎవరు రాశారన్నది పక్కన పెడదాం. ఎందుకు బెదిరించాల్సి వచ్చిందనేది ప్రధాన ప్రశ్న. మావోయిస్టులు ఈ విధంగా రాయరనేది అందరి నోటా వినబడుతున్న మాట. అందులోనూ ఆ లేఖలలో మొబైల్ నెంబర్ కూడా ఉందని చెబుతున్నారు. ఎవరిదా మొబైల్ నెంబర్ అన్న అంశంతో మొట్టమొదట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆ మొబైల్ నెంబరు కు ఫోన్ చేసి ఆరా తీస్తే..తెలంగాణాకు చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. నెంబర్ అయితే తనదేనని, ఎవరో ఉద్దేశపూర్వకంగా తన మొబైల్ ఇచ్చి ఉంటారని, ఆ లేఖలకు తనకూ ఎటువంటి సంబంధం లేదని సదరు వ్యక్తి పోలీసులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ నెల 9న మంత్రులకు లేఖలు వచ్చాయి. 10న తెరచి చూడగా..'మీ లైఫ్ డేంజర్ లో ఉంది. మీ పైన, మీ కుటుంబ సభ్యులపైనా మావోయిస్టులు త్వరలో దాడి చేస్తారు. జాగ్రత్త' ఇదీ ఆ లేఖల సారాంశం. నిశితంగా పరిశీలిస్తే..ఎవరో హెచ్చరిక చేసినట్టు ఉందే కానీ, నేరుగా మావోయిస్టుల నుంచి వచ్చినట్టుగా అనిపించడం లేదు. 'మావోయిస్టులు త్వరలో దాడి చేస్తారు' అంటే ఎవరో హెచ్చరించినట్టుగా ఉంది. తొలిరోజు సామాజిక మాధ్యమాల ద్వారా అయితే.. "మీ అంతు చూస్తాం..ఖబడ్దార్. మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యులను హతమారుస్తాం"..అన్నట్టు వార్తా కథనాలు వచ్చాయి. రెండవ రోజుకు 'మావోయిస్టులు త్వరలో దాడి చేస్తారు'..అనే పదం ముందస్తుగా మంత్రుల శ్రేయస్సు కోరి..ఎవరో అప్రమత్తం చేసినట్టు కనిపిస్తోంది. ఏదేమైనా ఈ బెదిరింపు లేఖలు మంత్రులనే కాదు..ప్రభుత్వాన్ని సైతం హెచ్చరించినట్లే. ప్రభుత్వ యంత్రాంగం ఏ విధంగా ఈ బెదిరింపులను స్వీకరిస్తుందో, ఎటువంటి చర్యలు తీసుకుంటుందో పరిశీలించడానికి ఈ బెదిరింపు లేఖలు వదిలారా?, లేఖ ఆకతాయిల పనా అనేది ఒకటీ రెండు రోజుల్లోనే స్పష్టంగా తెలిసే అవకాశాలు ఉన్నాయి. అయితే.. పోలీసులు ప్రాథమికంగా ఈ వ్యవహారం మొత్తాన్ని ఆకతాయిల చర్యలుగానే భావిస్తున్నారట. మరింత లోతుగా దర్యాప్తు నిమిత్తం మంత్రులు ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిసింది.

### బెదిరింపు లేఖలు రాయడానికి మావోయిస్టులు ఎక్కడ ఉన్నారు?..

ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్‌లోని నలుగురు కీలక మంత్రులకు అజ్ఞాత వ్యక్తుల నుంచి బెదిరింపు లేఖలు రావడం కలకలం రేపుతోంది. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా సాగుతున్న తరుణంలో..ఈ లేఖలు ఎక్కడి నుంచి వచ్చాయనేది చర్చనీయాంశంగా మారింది. బెదిరింపులు ఇవ్వడానికి ఇప్పుడు మావోయిస్టులు ఎక్కడున్నారన్న ప్రశ్న వస్తోంది. అగ్రనేతలంతా ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోవడమో, లేదంటే అనారోగ్య కారణాలతో లొంగిపోవడమో జరిగింది. మిగిలిన అతి కొద్దిమంది కూడా ఛత్తీస్‌గఢ్ వంటి దట్టమైన అడవుల్లో ఎక్కడో ఒక చోట ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి, సొంత ఉనికిని కాపాడుకోవడమే గగనమైన వేళ, మంత్రులకు లేఖలు రాసేంత సాహసం వారు చేస్తారంటే ఎవరూ నమ్మడం లేదు. కేంద్ర ప్రభుత్వం కూడా నక్సల్స్ విషయంలో అత్యంత కఠినంగా ఉంది. వచ్చే మార్చి 31వ తేదీ లోపు భారత దేశాన్ని నక్సల్స్ రహిత దేశంగా ప్రకటించాలని కేంద్ర హోం శాఖ ఇప్పటికే గడువు విధించుకుంది. అడవులను జల్లెడ పడుతున్న బలగాల ధాటికి నక్సల్స్ మూలాలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. వారు ఇలాంటి హెచ్చరికలకు దిగడం అసాధ్యమనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ లేఖలు నక్సలైట్లు రాసినవి కావని, కేవలం పబ్లిసిటీ పిచ్చితో లేకపోతే మంత్రులను బెదిరించడానికి ఆకతాయిల పనేనని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం పోలీసు లు ఈ లేఖల మూలాలను వెతికే పనిలో పడ్డారు. నిఘా వర్గాలు కూడా వీటిని సీరియస్‌గా తీసుకుని రాసిన వారిని బయటకు తీసుకురానున్నారు. ఎవరు ఏ ఉద్దేశంతో రాసినా, ప్రజా ప్రతినిధులకు భద్రత పెంచడంతో పాటు, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసు శాఖ స్పష్టం చేస్తోంది. మెుత్తంపై మంత్రులకు బెదిరింపు లేఖల వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో ఇటువంటి బెదిరింపు లేఖలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మావోయిస్టులు, ఆకతాయిలు కాకుంటే..మరెవరైనా ఇలా రాసి ఉంటారా అనే అనుమానాలు కూడా ప్రజల నుంచి వినవస్తున్నాయి. ఆ ఎవరో... ఎవరై ఉంటారా అనేది పోలీసుల విచారణలో బహిర్గతం కావచ్చునని, ఏదైనా ఇటువంటి విష సంస్కృతిని మూలాల్లోనే తుంచి వేయాలని పలువురు కోరుతున్నారు.

# రాష్ట్ర బడ్జెట్ లో జగ్గంపేట నియోజకవర్గానికి నిధులు కేటాయించాలి

### పాటంశెట్టి సూర్యచంద్ర



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** 2026-27 బడ్జెట్ నందు జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు రప్పించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు హామీలు గుర్తు చేస్తూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ని ప్రజల పక్షాన పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు. ఇప్పటికే రెండు బడ్జెట్ లు పూర్తి అయ్యాయని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒకటి కూడా నెరవేర్చక పోవడం వల్ల మీ మాటలు నీటిమూటలయ్యాయని 14వ తేదీన విడుదల చేసే మూడో బడ్జెట్లో అయినా జగ్గంపేట నియోజకవర్గంలో ఎన్నికల్లో మీరు ఇచ్చిన హామీలైన పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఏలేరు ఆధునీకరణకు 2000 కోట్ల నిధులు బడ్జెట్లో కేటాయించాలని, మల్లవరం ఎత్తిపోతల పథకానికి 200 కోట్ల రూపాయలు నిధులు బడ్జెట్లో కేటాయించాలని, గోకవరం మండలానికి సంబంధించి సత్యసాయి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ నకు 50 కోట్లు నిధులు బడ్జెట్లో కేటాయించాలని, గోకవరం,గండేపల్లి, కిర్లంపూడి మండల కేంద్రాల్లో డిగ్రీ కాలేజ్ లు మంజూరు చేయించి భవన నిర్మాణాలకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని, గోకవరం ఠానా సెంటర్లో బ్రిడ్జ్ పునః నిర్మాణం వేగవంతంగా నిర్మించాలని, జగ్గంపేటలో ప్రభుత్వ ఐటిఐ కాలేజీ భవన నిర్మాణాలకు బడ్జెట్లో నిధులు మంజూరు చేయించాలని, ఏలేరు నదిపై శృంగరాయునిపాలెం-కృష్ణవరం బ్రిడ్జి నిర్మాణానికి 50 కోట్లు నిధులు బడ్జెట్లో కేటాయించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ని ప్రజల పక్షాన పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు

# దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా అనపర్తిలో కార్మికులు భారీ ర్యాలీ




**అనపర్తి:(మనసులో మాట) ఫిబ్రవరి 12 :**కార్మికుల డిమాండ్స్ పరిస్కారం చేయాలని, 4 లేబర్ కొడ్లను రద్దు చేయాలని జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా అనపర్తిలో కార్మికులు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనపర్తి ఐ.ఎల్.టి.డి నుంచి ర్యాలీగా దేవిచౌక్ వరకూ వచ్చి మానవహారం చేసి దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేశారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు అన్నపూర్ణ, అనూష, రాజ్ కుమారి, భాస్కర్, సామెల్ రాజు, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మిక హక్కులను రద్దు చేసిందని, బ్రిటీష్ కాలం నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలుచేయాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. మరోప్రక్క గ్రామీణ భారతంలో ఉపాధి పొందుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబిజి రామ్ జీ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ విబిజి రామ్ జీ పథకంలో 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వాలపై అదనంగా భారం మోపింది. ఇది రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతుందని విబిజి రామ్ పథకాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షిం చాలని, ప్రైవేటీకరించే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గానికి చట్టాలు అమలుచేసి కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 30000 అమలు చేయాలని, అంగన్వాడీ, ఆశ మధ్యాహ్నం భోజన పథకం, వి.ఓ.ఎ, ఆర్పీ స్కూల్ పేపర్స్ స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విద్యుత్ రంగం తో సహా ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విరమించుకోవాలని అన్నారు. ఈ దేశ వ్యాప్త సమ్మెలో కాంగ్రెస్ నాయకులు వడియార్, టి.కె. విశ్వేశ్వరరెడ్డి పాల్గొని దేశ వ్యాప్త సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, సన్యాసి రావు, కోటయ్య, సత్యనారాయణ, కన్నసాహెబ్, స్వర్ణలత, కె. సుజాత, రాజ్ కుమారి, కల్పన, చంద్ర లీల, శ్రీదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణకు అల్బెండజోల్

## ఈ నెల 17న నేషనల్ డీవార్మింగ్ డే

### జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** పిల్లల్లో నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపాలు, శారీరక-మానసిక వికాసంలో ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ జిల్లా యంత్రాంగానికి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సూచించారు. ఈ నెల 17న నిర్వహించనున్న నేషనల్ డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, లక్షిత వయస్సు గల పిల్లలందరికీ మాత్ర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాల బాలికకు అంగన్వాడీలు, ప్రభుత్వ-ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ-ప్రైవేటు కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు తదితర విద్యా సంస్థల్లో అల్బెండజోల్ మాత్ర మింగించనున్నారు. ఇప్పటికే అన్ని శాఖల సమన్వయంతో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఎంఎచ్ఓ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,400 విద్యా సంస్థల్లో కార్యక్రమం నిర్వహించబడుతుండగా, 1--19 సంవత్సరాల మధ్య వయస్సు గల 4,06,342 మంది పిల్లలకు మాత్ర అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల సహకారం అత్యంత కీలకమని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు. ఫిబ్రవరి 17న ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పని సరిగా పాఠశాలలు, కళాశాలలకు పంపాలని, పాఠశాలల్లో చేరని పిల్లలకు వారి సమీప అంగన్ వాడి కేంద్రాల్లో మాత్ర అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, ఐసీడీఎస్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన జిల్లా అధికార యంత్రాంగం పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే నిర్ణయం బిజెపి ప్రభుత్వ దుర్మార్గపు చర్య

### సిఐటియు- రాజోలులో సమ్మె విజయవంతం..!



**రాజోలు ఫిబ్రవరి 12 మనసులోమాట** :ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణయం దుర్మార్గమని సిఐటియు సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ కొత్తగా తీసికొని వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో సిఐటియు ఆద్వర్యంలో నిర్వహించిన దేశవ్యప్త సమ్మె గురువారం విజయవంతంగా జరిగింది. దీనిలో భాగంగా కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎల్ఐసి ఉద్యోగులు పాల్గొన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తలపెట్టడం దుర్మార్గపు చర్యని కార్మికులు నినాదాలు చేశారు. ఇంకా సమ్మెలో సిఐటియు, వ్యవసాయ కార్మికసఘం, కౌలు రైతు సంఘం నాయుకులు కారుపల్లి గోపాలన్, పీతల రామచంద్రరావు, బుంగ సత్యనారాయణ, తాడి శ్రీరామ్మూర్తి, యార్ల గడ్డ శ్రీరాములు, బళ్ల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కొడ్లు తక్షణమే రద్దు చేయాలి

### సిఐటియుడ సిపిఐ ఎంఎల్ అనుబంధ సంస్థల సమ్మె.



**రౌతులపూడి, (మనసులో మాట ) ఫిబ్రవరి 12 :** దేశవ్యాప్తంగా సిపిఐ ఎంఎల్డ సిఐటియు, అంగన్వాడీల తలపెట్టిన నిరవధిక సమ్మె విజయవంతం అయింది. ముందుగా తాసిల్దార్ కార్యాలయం నుండి స్థానిక మార్కెట్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని 8 గంటల పని దినం అమలు చేయాలి అని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, మరియు సిపిఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుతనిఖీ



స్వయంభూ శ్రీ రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయం పాదగయ క్షేత్రం లో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గురువారం పరిశీలించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూ లైన్లు, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పనుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం మునిసిపల్ కమిషనర్ నామా కనక రావు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాసు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గండేపల్లిలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం




**గండేపల్లి.(మనసులో మాట) ఫిబ్రవరి 12.** సీఐటీయూ ఆధ్వర్యంలో గండేపల్లి మండలం లో సీఐటీయూ మండల అధ్యక్షులు వై.శ్రీనివాసరెడ్డి. కార్యదర్శి నొక్కులలిత ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యలయం వద్ద సమ్మె నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్ గారికి డిమాండ్స్ నోటీస్ అందించారు కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని. కనిసవేతనం 26000 చెల్లించాలని స్కీం వర్కర్స్ ఐన అంగన్వాడీ .ఆశా .మిదేమీల్ తదితర పథకాలు లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని.. 12గంటలు పని విధానాన్ని రద్దుచేయాలని. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ పెంచాలని .రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని.కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని .సమనపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ .సమ్మె నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేయడం జరిగింది.. ఈ సమ్మెలో భవన నిర్మాణ రంగం..అంగన్వాడీ ఆశా. నుండి రాజేశ్వరి, జ్యోతి, వెంకటలక్ష్మిశాంతి, విష్ణులక్ష్మి, మహేష్ .శ్రీను, తాళ్లూరు, మల్లెపల్లి గ్రామలనుండి బిల్డింగ్ రంగాల నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు,ఈ సమ్మెకు మద్దతుగా యూ టి ఎఫ్ నుండి రమణ అధ్యక్షత వహించారు.

# స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన మండల జనసేన నాయకులు.




**రౌతులపూడి, (మనసులో మాట )ఫిబ్రవరి 12:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రశ్నాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథాన్ని రౌతులపూడి మండలం ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, ఉపాధ్యక్షుడు జై గంట , మండల సంయుక్త కార్యదర్శి బచ్చల నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఎన్డీఏ కూటమి సహకారంతో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ర దాల ద్వారా గ్రామాల్లో ఉన్న చెత్తను తీసుకొని నిత్యవసర సరుకులు అందించే కార్యక్రమాన్ని రూపొందించారని దీని ద్వారా చెత్త రహిత గ్రామాలుగా మారుతాయని సలీం అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రథాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రౌతులపూడి మండల జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మల్లేపల్లిలో లేక దూడల ప్రదర్శన.



**గండేపల్లి .(మనసులో మాట) ఫిబ్రవరి 12.** గండేపల్లి మండలం మల్లెపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం మరియు ఫెర్టిలిటీ క్యాంపును గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను ఆధ్వర్యంలో ప్రారంభించారు లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో రైతులు 40 దూడలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మొదటి విజేతగా వల్లభశెట్టి రాజు గేదే దూడను, రెండవ బహుమతి గా గాలిదేరి రాంబాబు చెందిన గేదే దూడ, మూడవ బహుమతి వనపర్తి వెంకటేష్ గేదే దూడగాను ఎంపిక చేయడం జరిగింది. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ బహుమతులు అందించారు. ఫెర్టిలిటీ క్యాంపు లో భాగంగా 45 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స మరియు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరం అయినా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి గ్రామ టిడిపి నాయకులు తెలగ రెడ్డి భద్రరావు, కొల్లి త్రిమూర్తులు, మరియు పశుసంవర్ధక శాఖ నుండి డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, డాక్టర్ కళ్యాణి, గండేపల్లి మండలం బస్సు వైద్యాధికారి శ్రీనివాస్, మురారి వైద్యాధికారి నీ కృష్ణవేణి, నాయకంపల్లి వైద్యాధికారి శ్యాంప్రసాద్, మరియు చెప్పండి గోపాల మిత్రులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం

## చికిత్స పొందుతున్న వ్యక్తి శశికిరణ్



**రాజోలు, ఫిబ్రవరి 12 మనసులోమాట :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లిలో ప్రమాదానికి గురై కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోనమండ మోషే కు సఖినేటిపల్లికి చెందిన ఎన్నారై గల్ఫ్ వైఎస్సార్సీపీ కో-కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. సఖినేటిపల్లి లోని మోషే ఇంటికి నేరుగా వెళ్లిన దొండపాటి శశికిరణ్ రూ. 10,000 రూపాయిలను సఖినేటిపల్లి జెడ్పిటిసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా మోషే కుటుంబ సభ్యులకు అందచేశారు. రాజోలు నియోజకవర్గంలో ఎన్నారై దొండపాటి శశికిరణ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని స్థానిక నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఇంజేటి ఆశిబాబు, తాడి చినిబాబు, పల్లికొండ మూర్తి, గొల్లమందల శ్యాంమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీ ఎస్ ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ వై అర్ కే కు రాబడిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్.ఐ రఘునందన్ రావు, తన సిబ్బంది తో జగ్గం పేట మండలం మల్లిపాక గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు.ఈ దాడులలో ముగ్గురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 6200/- రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జగ్గంపేట ఎస్సై రఘు నందన్ రావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా అయన తెలియజేశారు.

# మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసిన సఖినేటిపల్లి జడ్పిటిసి



**రాజోలు ఫిబ్రవరి 12 మనసులో మాట:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని సఖినేటిపల్లి జడ్పిటిసి సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో ఆమె కుమారుడు, వైస్సార్సీపీ కో- కన్వీనర్ దొండపాటి శశికిరణ్ తో కలిసి జగన్మోహన్ రెడ్డిని గురువారం కలుసుకున్నారు. గల్ఫ్ దేశాల్లో తెలుగు ప్రజల స్థితిగతులు, జీవన విధానంపై జగన్ ఆసక్తికరంగా శశికిరణ్ తో ముచ్చటించారు. అదేవిధంగా స్థానికంగా పార్టీ అభివృద్ధి కొరకు కష్టపడి పని చేయాలని జగన్ సూచించారని జెడ్పిటిసి అన్నపూర్ణ తెలిపారు.

# మీడియా అక్రిడేషన్ కార్డుల కోసం నేరుగా సంప్రదించండి

## జిల్లా కలెక్టర్ షణ్ముహన్ సగిలి



**కాకినాడ, (మనసులో మాట) ఫిబ్రవరి 12 :**మీడియా అక్రిడిటేషన్ కార్డులు పొందుటకు జర్నలిస్టులు ఎవరికీ డబ్బులు చెల్లించనవసరం లేదని, అర్హతలు కలిగిన వారు అవసరమైన పత్రాలతో తనను నేరుగా కలిసి ధరఖాస్తులు అందజేయవచ్చునని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లాలో ఇప్పటి వరకూ 489 మంది జర్నలిస్టులకు 2026-2027 ద్వైవార్షిక కాలానికి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదించిందని, అక్రిడిటేషన్లు జారీ చేసిన జర్నలిస్టుల జాబితాను కలెక్టరు కార్యాలయంలోని నోటీసు బోర్డులో పారదర్శకంగా ప్రదర్శిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ జాబితాలోని జర్నలిస్టులు, ఇంకా ధరఖాస్తు చేసుకోనే జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం మీడియా సంస్థలకు గానీ, మీడియా సంఘాలకు గానీ, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు గానీ, సమాచార శాఖ అధికారులు, సిబ్బంది గానీ, లేదా మరే మీడియేటర్లకు గానీ ఎవరికీ ఎటువంటి సొమ్ము చెల్లించనవసరం లేదని కలెక్టర్ స్పష్టంచేసారు. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ మీడియా అక్రిడిటేషన్ కార్డులు జారీకి జర్నలిస్టుల అర్హతే ప్రమాణికమని, దళారులకు డబ్బులు చెల్లించి నష్టపోవద్దని ఆయన జర్నలిస్టులకు సూచించారు. సంస్థలు, సంఘాలు, అధికారులు, సిబ్బంది ఎవరైనా అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు డబ్బులు డిమాండు చేస్తే బాధితులు తన దృష్టికి తెవాలని, అటువంటి చర్యలకు పాల్పడిన సంస్థలు, సంఘాలను బ్లాక్ లిస్ట్ చేస్తామని, దళారులు, అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# అభివృద్ధికి ఆమడదూరంలో గుర్రపాలెం ఎస్.సి స్మశాన వాటిక

- సరైన సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న కాలనీ వాసులు
- కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరిన అంబేద్కర్ వాది నీలపల్లి అప్పారావు



**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** జగ్గంపేట మండలం గుర్రపాలెం గ్రామంలో ఎస్.సి షెడ్యూల్ కి సంబంధించి సుమారుగా 1000 మంది జనాభా కలిగి ఉన్నప్పటికీ అక్కడ ప్రజలు ఎవరైనా మరణిస్తే వారి భౌతికకాయాన్ని అంత్యక్రియలు చేయడానికి ఆ శ్మశాన వాటికలో సరైన సదుపాయాలు లేని పరిస్థితులు నెలకొన్నాయి అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మండల గ్రాంట్ నుండి ఎంపీపీ నిధులు కేటాయించి ఓటర్ షెడ్ నిర్మించడానికి పనులు చేసియున్నారు కానీ 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఎలక్షన్ కోడ్ అమలు కారణంగా ఆ పనులు మధ్యలో నిలిపివేసినారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 2 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఈ శ్మశాన వాటికకలో ఎటువంటి పనులు చేయకపోవడం పూర్తిగా ప్రభుత్వం నిర్లక్షమేనని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారని అంబేద్కర్ సిద్ధాంత ప్రచారకులు నీలపల్లి అప్పారావు మీడియా ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత డా,,బి.ఆర్ అంబేద్కర్ ప్రజల ఓటు హక్కు ద్వారా ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎటువంటి ఉపయోగకరమైన పనులు,అభివృద్ధి చేయకపోతే వాటిని పరిశీలించి తగు చర్యలు చేపట్టి ప్రజలకు న్యాయం చేసే బాధ్యత అధికారులకు రాజ్యాంగం ఇచ్చిందనీ,అటువంటిది నాయకులు అధికారులే ప్రజలను మోసం చేస్తుంటే ఇంకెవరిని అడగాలని ఆయన అన్నారు. తక్షణమే గుర్రపాలెం శ్మశాన వాటికలో నిలిచిపోయిన పనులు పూర్తి చేసి ఆ గ్రామ ప్రజలకు మంచి చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

# బరియల్ గ్రౌండ్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలి

- క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో తీర్మానం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12** :రాజమండ్రి లాలాచెరువు రోడ్‌లో ఉన్న శాంతి నిలయం చర్చిలో రాజమండ్రి అర్బన్ అండ్ రూరల్ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న క్రీస్తు శ్రమకాల ధ్యానములు ప్రారంభ దృష్ట్యా ప్రార్థనలు చేశారు. రాజమండ్రి అర్బన్, రూరల్ క్రైస్తవుల నిమిత్తం 2023లో ప్రభుత్వం మంజూరు చేసిన క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అడ్వయిజరీ కమిటీ ప్రత్యేకమైన ప్రార్థనలు చేసింది. ఆ బరియల్ గ్రౌండ్‌లో ఇప్పటి వరకు 1,050 సమాధులను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే బరియల్ గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ ను నిర్మించమని గత ప్రభుత్వానికి, ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వానికి సంబంధిత ప్రభుత్వ అధికారులందరికీ ఎన్నోసార్లు వినతులు పెట్టినా నేటికీ ప్రహరీ గోడ నిర్మాణం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రహరీ గోడ లేకపోవడం వలన చుట్టు ప్రక్కల నివాస ప్రాంతాలైన రెవెన్యూ కాలనీ, టిడ్కో హౌసెస్, సావిత్రి నగర్ ప్రాంత వాసుల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు వస్తున్నాయన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామి దాసులకు ఈ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం నివేదికలు సమర్పించామన్నారు. ఈ నెల 5న సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామి దాసు ద్వారా అమరావతిలో కలిశామని, అతి త్వరలో కాంపౌండ్ వాల్, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తమ వంతు కృషి చేస్తూనే ఉన్నారన్నారు. ప్రతి వర్షా కాలంలో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో నీటి సమస్య, బరియల్ గ్రౌండ్ చుట్టుపక్కల నివాసితుల ందరికీ ఆటంకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రహరీ గోడను, ప్రహరీ గోడ చుట్టూ విద్యుత్తు దీపాలను ఏర్పాటుచేయాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సెక్రటరీ బీ ఏలియా, ట్రెజరర్ కే శాంతా రావు, జాయింట్ సెక్రటరీ ఎన్ లాజర్, ఎం విజయకుమార్, వాసంశెట్టి అనం, కమిటీ ప్రెసిడెంట్ బిషప్ పొన్నమాటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు ప్రాధాన్యత :దేవదాయశాఖ డి.సి

- ప్రతిష్టాత్మకంగా మహా శివరాత్రి మహోత్సవాలు
- మురమళ్లలో శివరాత్రి ఏర్పాట్లు పరిశీలన



**ముమ్మిడివరం. ( మనసులో మాట) ఫిబ్రవరి 12.** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు తీసుకొంటున్నట్లు దేవదాయశాఖ డిప్యూటీ కమీషనర్ డి.ఎల్.వి రమేష్ బాబు అన్నారు. ఐ. పోలవరం మండలం మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 15 నుండి 19 వరకు జరగబోయే మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ తో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా డి సి మాట్లాడుతూ దేవాదాయశాఖ ఉన్నతాధికారుల సూచనలు మేరకు భక్తులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ జోన్ పరిధిలో ఉన్న 7 జిల్లాలో 42 ముఖ్య ఆలయాలకు ప్రత్యేక అధికా రులను నియమించి ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఆయా అధికారులకు పలు సూచనలు అంది స్తున్నట్లు తెలిపారు. వీరేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు రద్దీ, క్యూ లైన్ విధానం, కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. సుమారు 30 వేలకు పైగా భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తున్నట్లు అసిస్టెంట్ కమీషనర్ వివరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకొంటున్నామని శీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం ఏర్పాటు చేశామన్నారు. చంటి పిల్లలకు పాలు, బిస్కెట్లు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. తొలుత వీరికి ప్రత్యేక దర్శనం అందించి దుశ్శాలువతో సత్కరించి వేద ఆశీర్వచనం అందించారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు బాసటగా జిల్లా యంత్రాంగం

## జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉదారతతో ఇద్దరు చిన్నారులకు ఆసరా దొరికింది. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ వద్దకు చేరిన ఇద్దరు చిన్నారులకు అండగా నిలబడేందుకు జిల్లా అధికార యంత్రాంగం మానవత్వంతో ముందడుగు వేసింది. పిల్లలకు గూడు కల్పించేందుకు ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు నడుం బిగించింది.పిఠాపురం నియోజకవర్గం మాదాపూర్ గ్రామంలో ఇటీవల తల్లిదండ్రులు ఇద్దరును కోల్పోయిన చిన్నారులు గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇద్దరు చిన్నారులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తుందిన్నారు. చిన్నారులు ఇద్దరు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన వంతు బాధ్యతగా ఇద్దరు చిన్నారులకు ప్రతినెల రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని ప్రకటన చేయడం జరిగింది అన్నారు. పిల్లలకు శాశ్వతం నివాసం కల్పించేందుకు జిల్లా అధికార యంత్రం నుంచి వెంటనే ఇంటి పట్టాను మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరితన ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా సమంత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. పిల్లలు చదువుకునేందుకు అవసరమైన సదు-పాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మే-రకు ఈరోజు సాయంత్రం నాటికి ఇంటి పట్టా అందించేందుకు చర్యలు ఎమ్మార్వో,ఎంపిడివో చేపట్టారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం ఎంపీడీవో కే.స్వప్న, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ బ్యాంక్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ

## జాతీయ సార్వత్రిక సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు




**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఫిబ్రవరి 12, గురువారం నాటి " జాతీయ సార్వత్రిక సమ్మె " లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్లకు చెందిన, జిల్లాలో వివిధ బ్యాంకులలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. మిగిలిన యూనియన్లు వీరికి మద్దతు పలికాయి. .ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన బ్యాంక్ ఉద్యోగులు కాకినాడ మెయిన్ రోడ్డు లో గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీసు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఉద్దేశించి కోఆర్డినేషన్ కమిటీ సెక్రెటరీ కె. ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల సంఘాల హక్కులను హరించివేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయరాదని, బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాలని, ఖాతాదారులకు సర్వీస్ చార్జీలను తగ్గించాలని, వెంటనే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.అనంతరం బ్యాంక్ ఉద్యోగులందరు కలెక్టర్ ఆఫీసు వరకు కేంద్ర కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకు సంఘాల నాయకులు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, శ్యామ్ కుమార్, జేఎన్వి శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీధర్, వీ రాస్వామి, రామ్ జీ, రంజిత్, హిమకిరణ్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# మలికిపురం ఏ ఎఫ్ డి టి కళాశాలకు కంప్యూటర్ పరికరాలు కొనుగోలు

- మలికిపురం ఏ ఎఫ్ డి టి కళాశాలకు కెనరా బ్యాంక్ ఆర్థిక సాయంతో కంప్యూటర్ పరికరాలు కొనుగోలు

**రాజోలు ఫిబ్రవరి 12 మనసులోమాట:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రకాశం జిల్లా మలికిపురం కళాశాలకు కెనరా బ్యాంక్ ఆర్థిక సహాయంతో కంప్యూటర్ పరికరాలను కొనుగోలు చేశారు. జూనియర్ కాలేజీ అభివృద్ధికి రూ.10 లక్షలను కెనరా బ్యాంక్ ఎండి, సీఈవో కలిదిండి సత్యనారాయణ రాజు అందజేశారు. విడుదల చేసిన సొమ్ముతో విద్యార్థినీ విద్యార్థులకు ఉపయోగపడే కంప్యూటర్ సిస్టంలు, జనరేటర్, వాటర్ ప్లాంట్, జిరాక్స్ మిషన్ కొనుగోలు చేశారు. దీంతో కెనరా బ్యాంక్ కాకినాడ ఏటీఎం ఆర్. గణేష్ చేతుల మీదుగా కంప్యూటర్ పరికరాలను గురువారం ప్రారంభించారు. అనంతరం జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఆర్.వి. రామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే పది లక్షల రూపాయలు మంజూరు చేసిన అప్పటి ఎండికి అభినందనలు తెలియజేశారు. బ్యాంక్ ఏజీఎం ఆర్. గణేష్ మాట్లాడుతూ ఖాతాదారులకు సేవ చేయడమే కాక, సేవా కార్యక్రమాలలో కూడా కెనరా బ్యాంక్ ముందుంటుందని అన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన లక్కవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ లక్కవరం చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధి నిమిత్తం రూ.35 లక్షల రూపాయలు మంజూరు చేసిన కలిదిండి సత్యనారాయణ రాజుకి ధన్యవాదాలు తెలియజేశారు. కాలేజీ కరస్పాండెంట్ మంగేన వెంకట సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న సమయంలో కెనరా బ్యాంక్ ఆదుకోవడం గర్వించవలసిన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కోటప్పకొండ నందు జరుగుతున్న పనులను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**పల్నాడు, ఫిబ్రవరి 12, (మనసులో మాట) :** మహాశివరాత్రి పండుగ సందర్భంగా కోటప్పకొండ నందు జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి పల్నాడు జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు పరిశీలించారు. ఈ నెల 15 వ తేదీ ఆదివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా కోటప్పకొండ శైవక్షేత్రం త్రికోటేశ్వర స్వామి పరిసర ప్రాంతాలలో జరుగుతున్న పనులను కలెక్టర్ తో కలిసి ఎస్పీ పరిశీలించి తగు సూచనలు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చు భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లను, బారికేడింగ్ ను పరిశీలించడం జరిగింది. ప్రసాదాల కౌంటర్ల వద్ద, లిఫ్ట్ ల వద్ద తోపులాట జరగకుండా ఉండటానికి తగు సూచనలను చేయడం జరిగింది. స్నానాల ఘాటు వద్ద జరుగుచున్న బారికాడింగ్ పనులను పరిశీలించడం జరిగింది. ప్రభల నిధి వద్ద ప్రభలు పోలీసు వారు నిర్ణయించిన సమయంలోపు చేరుకోవాలని, అక్కడ జరుగుతున్నటువంటి పనులను పరిశీలన చేశారు. వాహనాల పార్కింగ్ కొరకు ఏర్పాటు చేసిన స్థలాలను, తిరునాళ్లకు వచ్చే భక్తులు వివిధ మార్గాల ద్వారా స్వామి వారి కొండకు చేరుకునే సమయంలో ఆయా మార్గాలలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేసుకునేటట్లు తెలిపే బోర్డులను పరిశీలించడం జరిగింది. వాహనాలు పార్కింగ్ ప్రదేశాల వద్ద, ప్రభల ప్రదర్శన ప్రాంతంలో ముఖ్యంగా దేవుని దర్శించుకునే సమయంలో జన సందోహం స్తంభించకుండా తగ్గిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం కొండ దిగువన ఏర్పాటు చేసినటువంటి తాత్కాలిక బస్టాండ్లను, అక్కడ జరుగుతున్నటువంటి బారికేడింగ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్పీ జేవి.సంతోష్ , నరసరావుపేట రూరల్ సీఐ ఎం.వి సుబ్బారావు, నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ట్రిబ్యునల్స్ ద్వారా రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాల పరిష్కారానికి కేంద్రం చర్యలు

- కృష్ణ ట్రిబ్యునల్-II ద్వారా ఏపీ, తెలంగాణల మధ్య వివాదాల పరిష్కారానికి సహకారం
- కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు బదులిచ్చిన కేంద్రమంత్రి

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** భారత దేశంలో పలు రాష్ట్రాల మధ్య నెలకొన్న నదీ జల వివాదాల పరిష్కారానికి చర్చలు, చట్టం ప్రకారం చర్యలు చేపడతామని, చర్చలు విఫలమైతే ట్రిబ్యునల్స్ ద్వారా వివాదాలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి తెలిపారు. రాష్ట్రాల మధ్య నెలకొన్న నదీ జల వివాదాల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు, ట్రిబ్యునల్స్ పనితీరుపై గురువారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం దేశంలో పలు రాష్ట్రాల మధ్య నెలకొన్న నదీ జల వివాదాల పరిష్కారానికి రవి బియస్ వాటర్ ట్రిబ్యునల్, మహాదయి ట్రిబ్యునల్, మహానది ట్రిబ్యునల్ తో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న కృష్ణా నది జల వివాదాలు పరిష్కారానికి కృష్ణ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ -II ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత వివాదం న్యాయస్థానం పరిధిలో ఉందని, ట్రిబ్యునల్ పదవీ కాలాన్ని ఈ ఏడాది జులై వరకు పొడిగించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల కారణంగా ఆర్థిక, వ్యవసాయ నష్టాలపై ఎటువంటి అంచనాలు వేయలేదని, ట్రిబ్యునల్స్ ద్వారా సాధ్యమైనంత తొందరగా రాష్ట్రాల మధ్య వివాదాలు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని కేంద్రమంత్రి బదులిచ్చినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.



# జీరో వేస్ట్ కాలనీల దిశగా కాకినాడ అడుగులు

## స్వచ్ఛ సర్వేక్షన్‌లో సింగిల్ డిజిట్ లక్ష్యం

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 11:** కాకినాడ నగరంలోని కాలనీలను జీరో వేస్ట్ కాలనీ లుగా తీర్చిదిద్దేందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ( ఆర్డబ్ల్యూఏ) సభ్యులు పూర్తి సహకారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ కోరారు. బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వివిధ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులతో కమిషనర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు--2025లో కాకినాడను ఉత్తమ స్థానంలో నిలపడం లక్ష్యమని తెలిపారు. గతంలో స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్స్‌లో 178వ స్థానంలో ఉన్న కాకినాడ, సమష్టి కృషితో ప్రస్తుతం 34వ స్థానానికి చేరుకుందని చెప్పారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించడం సాధ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లోనూ అవార్డు వచ్చే విధంగా ప్రతి ఒక్కరు భాగ్యస్వాములై ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రధాన రహదారుల వెంట గోడచిత్రాలు (వాల్ పెయింటింగ్స్) వేయాలని సూచించారు. కాలనీల్లో అసోసియేషన్లు ముందడుగు వేస్తే కార్పొరేషన్ నుంచి అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. గోడచిత్రాల ద్వారా కాలనీలకు శుభ్రతతో పాటు ఆకర్షణీయమైన రూపం వస్తుందని అన్నారు. అలాగే చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, మూటకట్టేసి కాలనీల్లోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసే యూనిట్లలో నిల్వ చేసి, వారానికి రెండు సార్లు సేకరణ చేయాలనే ప్రణాళికను వివరించారు. మొదటగా సిద్ధార్థనగర్‌ను మోడల్ కాలనీగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఒక వారం ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలను పరిశీలిస్తామని చెప్పారు. తదుపరి నెలలో రాష్ట్ర స్థాయి అసెస్మెంట్ జరగనున్నందున కాలనీల శుభ్రత, అందం, చెత్త నిర్వహణ విధానాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. కాలనీల్లో శుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసి, ఫోటోల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. చెత్తను రహదారులపై వేయకుండా ప్రజల్లో బాధ్యతాభావం పెంపొందించేందుకు పెద్దలు, సంఘ ప్రతినిధులు చైతన్యం కల్పించాలని కోరారు. 25 కాలనీల్లో ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడకు ప్రత్యేక గుర్తింపు దక్కుతుందని అన్నారు. మన లక్ష్యం ఫస్ట్, సెకండ్ స్థానాల గురించి కాకుండా సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించడమే. సమయం తక్కువైనా అందరూ సహకరిస్తే అది సాధ్యం" అని కమిషనర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. కార్పొరేషన్‌తో కలసి పనిచేస్తే కాకినాడను మోడల్ నగరంగా తీర్చిదిద్దవచ్చని, ప్రతి కాలనీ శుభ్రతలో ఆదర్శంగా నిలవాలని సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, ఈ ఈ కనకారావు , డి హార్టికల్చర్ లక్ష్మి, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు వైడి రామారావు, ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కిషోర్, కాకినాడ నగరంలో గల 28 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు




# మహిళలకు ఏపీ ఆర్టీసీ శివరాత్రి కానుక..స్పెషల్ బస్సుల్లోనూ ఫ్రీ జర్నీ

- మహాశివరాత్రికి ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం
- కోటప్పకొండకు 618, శ్రీశైలానికి పలు డిపోల నుంచి బస్సులు
- భక్తుల సౌకర్యార్థం రెండు వేల మంది సిబ్బందితో ఏర్పాట్లు

**పల్నాడు, ఫిబ్రవరి 12,( మనసులో మాట) :**పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం మొత్తం 618 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 70 బస్సులను నడుపుతున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దాదాపు రెండు వేల మంది సిబ్బందిని విధుల్లో నియమించారు. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, అద్దంకి, చీరాల డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ప్రయాణికుల సౌకర్యార్థం పెట్లూరివారిపాలెం వద్ద ప్రత్యేకంగా ఆర్టీసీ క్యాంపు కార్యాలయాన్ని కూడా



# భారీ అగ్నిప్రమాదం

## బిక్కవోలు మండలంలోని రంగాపురం గ్రామంలో...



**అనపర్తి (మనసులో మాట) ఫిబ్రవరి 12:** ఈ ఘటనలో ఓ రైతుకు చెందిన గడ్డివాము పూర్తిగా భస్మీపటలమైంది. గ్రామానికి చెందిన రైతు ఎం. వీరస్వామి తన పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డివాముకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. గాలి తోడవడంతో మంటలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. మంటల తీవ్రతను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అనపర్తి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్నిప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగనప్పటికీ, సుమారు రూ. 66 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు ధృవీకరించారు. కళ్లముందే గడ్డివాము బూడిదవ్వడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీపీ బందం శ్రీదేవి

**రంపచోడవరం (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రంప కొండ మీద శివరాత్రి కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించుట జరిగింది. అటవీశాఖ సీ బీ ఈ టీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంప వాటర్ ఫాల్స్ కోసం వచ్చే పర్యాటకుల నుండి వసూలు చేసే రుసుములో శివరాత్రి జాతరకు 50% నిధులు, శివాలయ అభివృద్ధి మరియు సిబ్బంది జీతభత్యాల కోసం 50% నిధులు ఖర్చు పెట్టాలని గతంలో తీర్మానించుకోవడం జరిగిందని కానీ ఆ మేరకు అటవీశాఖ అధికారులు నిధులను విడుదల చేయకపోవడం వలన ప్రస్తుతం జాతర నిర్వహణ కష్టసాధ్యంగా ఉన్నదని జాతర కమిటీ వారు ఎంపీపీకి తెలియజేసినారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె అన్నారు. అలాగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలని రంప శివరాత్రి ఉత్సవాలకు ఉన్న గొప్పతనాన్ని మనమంతా కలిసి మరింత గొప్పగా ఈ జాతర మహోత్సవాల నిర్వహణ కోసం కృషిచేద్దామని ఆమె అన్నారు



# విశ్రాంత వైద్యుని దాతృత్వం

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** రంగరాయ వైద్య కళాశాల చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగ వైద్య విద్యార్థులకు ఉపయోగపడే అకడమిక్, ఆపరేషనల్ బుక్స్‌ను డాక్టర్ సుధీర్ అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ఇఎన్‌టి విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ సమక్షంలో వాటిని విద్యార్థులకు అందజేశారు. సుమారు రూ.12 వేల విలువ చేసే అరుదైన బుక్స్‌ను సమకూర్చి డిపార్ట్‌మెంట్‌కు సహకారం అందజేశారు. డాక్టర్ సుధీర్ రంగరాయ వైద్య కళాశాలలో చదివి, ఇఎన్‌టి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, కాకినాడ ప్రభుత్వాసుపత్రి ఏఆర్‌ఎంఓగా చేశారు. ఈఎన్‌టీ విభాగ విద్యార్థులకు దోహదపడే బుక్స్‌ను అందజేసి వైద్య విద్యాభివృద్ధికి సహకరించిన డాక్టర్ సుధీర్‌ను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ అభినందించారు.



# సమ్మెకు మద్దతుగా కార్మిక సంఘాల భారీ నిరసన




**ముమ్మిడివరం( మనసులో మాట) ఫిబ్రవరి 12.** కార్మిక సంఘాలు పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ముమ్మిడివరం, కాట్రేనికోన, మురమళ్ల గ్రామాల్లో కార్మికులు భారీ ర్యాలీలు, రహదారులపై బైటాయింపు, మానవసరం కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, భవననిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలుచేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి తదితర డిమాండ్లు తో నిరశన కార్యక్ర మాలు నిర్వహించారు. సి. ఐ. టి. యి. ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగ న్వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, కొబ్బరి వలపు కార్మికులు, ఆటో యూనియన్ సభ్యులు, నగర పంచాయతీ కాంటాక్ట్ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల సమ్మెలో జర్నలిస్టులు




**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానాల్లో కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చింది. రద్దు చేసిన చట్టాల్లో పాత్రికేయులకు సంబంధించిన రెండు చట్టాలు కూడా ఉన్నాయి. లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా గురువారం అఖిల భారత ట్రేడ్ యూనియన్లు, నేషనల్ ఎలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్ ఇచ్చిన పిలుపుమేరకు జరిగిన సమ్మెలో పాత్రికేయులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజెఎఫ్) కాకినాడ జిల్లా కమిటీ ఈ సందర్భంగా కార్మికులకు మద్దతు తెలిపింది. కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపీడబ్ల్యుజెఎఫ్ కాకినాడ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని మద్దతు తెలియజేస్తూ ధర్నాలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, మీడియా సెక్రెటరీ పుర్రె త్రినాధ్, సభ్యులు కె.సత్యనారాయణ(సత్య), వల్లూరి నానాజీ,సోనీ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# సహజీవనం మలుపు తిరిగింది..హత్యగా మారిందా?

**మద్యం మత్తులో ఘర్షణ-రాజమహేంద్రవరం వ్యక్తి అనుమానాస్పద మృతి...**

**శ్రావణిపై పోలీసుల అనుమానం-కేసు నమోదు, దర్యాప్తు వేగం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** రాజమహేంద్రవరం నగరానికి చెందిన నాగశివ (38) విశాఖ జిల్లా ఆనందపురం శివారులో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. మొదట సహజ మరణంగా భావించినా.. ఈ ఘటనలో మృతదేహంపై గాయాల గుర్తులు కనిపించడంతో పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నాగశివ కొంత కాలంగా శ్రావణి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల ఇద్దరి మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటన రోజున మద్యం సేవించిన అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో జరిగిన దాడిలో నాగశివ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు.ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శ్రావణిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు పోస్టు మార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. సహజీవనం వివాదమే హత్యకు దారితీసిందా?.. లేక మరేదైనా కారణం ఉందా? అన్న దానిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# కడియం ఫిష్ హ్యాచరీ సందర్శించిన కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు గురు వారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామంలో ఉన్న చేప పిల్లల పెంపకం ఆర్చరీ (హ్యాచరీ) ను సందర్శించారు. ఈ సందర్భంగా చేప పిల్లల ఉత్పత్తి విధానం, పంపిణీ విధానం, మత్స్యకారులకు కలిగే ఆర్థిక లాభాలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులకు స్థిరమైన ఆదాయం ఎలా లభిస్తుందో, నాణ్యమైన సీడు సరఫరా ఎలా చేయాలి, మత్స్యకారులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఎలాంటి మద్దతు అందించవచ్చో వంటి అంశాలపై చైర్మన్ సమగ్రంగా చర్చించారు. మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పెద్దిరాజు అన్నారు. కడియం ఫిష్ పాంట్స్ నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన చైర్మన్, చేప పిల్లల ఉత్పత్తి ప్రమాణాలు, నిర్వహణ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచి, జిల్లాలోని మత్స్యకారులకు లాభదాయకంగా మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్శన లో అసిస్టెంట్ డైరెక్టర్ సుమలత, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోపాలరావు, మల్లాడి శ్రీను, ఎంపీఎఫ్ఈఏ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి- సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 12 :** పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గం ఇరగవరం మండలం వేంద్ర వారి పాలెం రూట్ ్ శీ ఏలేటిపాడు వరకు 1కోటి 50 లక్షలు రూపాయల తో రోడ్డు నిర్మాణం శాసనసభ్యులు అరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు పనుల ప్రారంభ శంకుస్థాపన కార్యక్రమం కూటమి నాయకులుతో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మీడియాతో టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మరియు మాజీ జడ్పీటీసీ సభ్యుడు చుక్కా సాయిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమాన్ని ,అభివృద్ధిని రెండు కళ్ళుగా భావించి ముందుకు తీసుకువెళ్తుందని వక్కాణించారు. మండల పార్టీ సెక్రటరీ పోతిరెడ్డి శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లు విచ్చిన్నమైనప్పటికీ పట్టించుకోకుండా కాలయాపనం చేసిందని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాధాకృష్ణ ద్వారా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకిపాటి శ్రీను, మండల అధ్యక్షులు బొంతు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి కునుకు జనార్ధన్, సొసైటీ ప్రెసిడెంట్ వేంద్ర నాగు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు నాగరాజు, సొసైటీ డైరెక్టర్ చోడే సంజీవరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాక రామాంజనేయులు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు వేంద్ర జనార్ధన్, పోతురాజు సత్యనారాయణ, డిపార్ట్మెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భీమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**అనపర్తి (మనసులో మాట) ఫిబ్రవరి 12:** శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారి దేవస్థానం గొల్లల మామిడాడ 33వ కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. భీమే శ్వర స్వామి వారి 33వ కళ్యాణ మహోత్సవం, జి. మామి డాడ గ్రామంలో కొలువుదీరిన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దివ్య కళ్యాణం గురువారం ఘనంగా జరిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ద్వారంపూడి వీర రాఘవులు అనే పాపిరెడ్డి, సత్యవతి దంపతులు పూజాకార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భారీ బాణాసంచా కాల్చారు. ఇటీవల కాలంలో ఆలయ పునర్నిర్మాణానికి సుమారు 15,00,000- రూ.లు ఖర్చు చేసినట్లు తెలియజేశారు. శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ డి.వి.ఆర్.ఎ. పాపిరెడ్డి తెలిపారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడ అగ్రగామి లక్ష్యం

**కమిషనర్ సత్యనారాయణ స్పష్టం**



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడ నగరాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) సభ్యులు సక్రమంగా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఆయన కొండేలపేట, సురేష్ నగర్, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలోని 20 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు దోమల నివారణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా సెప్టిక్ ట్యాంకుల గొట్టాలకు నెట్‌లు కట్టడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని ఆయన తెలిపారు.సిద్ధార్థ నగర్‌లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి. రామారావు ఆధ్వర్యంలో కమిషనర్‌కు స్వాగతం పలికారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌డబ్ల్యూఏ సభ్యులతో కమిషనర్ చర్చించారు. నగరంలోని 20 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు రోజుకు ఒక కాలనీ చొప్పున 20 రోజులపాటు పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కమిషనర్ సత్యనారాయణ వెల్లడించారు. సిద్ధార్థ నగర్‌ను ఆదర్శ కాలనిగా తీర్చిదిద్దడంలో ఆర్‌డబ్ల్యూఏ సభ్యుల కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు.రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి. రామారావు మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడను అగ్రగామిగా నిలిపేందుకు నగరపాలక సంస్థ చేస్తున్న కృషికి తామంతా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం సిద్ధార్థ నగర్‌లో సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు కమిషనర్ ఎన్ వి వి సత్యనారాయణ నెట్‌లు కట్టి కాలనీ సభ్యులకు నెట్‌ల పంపిణీ కమిషనర్ సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, డీఈ ఫణీంద్ర, టీపీఎస్ రామ్మోహన్ తదితర అధికారులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ లు కాదు -కార్మికుల పాలిట గొడ్డలి పెట్టు

- మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాడతాం..
- నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి
- వాసంశెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేస్తామని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు స్పష్టం చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వాసంశెట్టి ఆధ్వర్యంలో స్థానిక కోట గుమ్మం శివుడి బొమ్మ వద్ద ఐఎన్ టీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా మారి కార్మికులను ఇబ్బందులు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు 1926లో పోరాడి అమల్లోకి తెచ్చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చడం దారుణమని ధ్వజమెత్తారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పక్కనపెట్టి 10 గంటలు 12 గంటలకు మార్చి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా 12 లక్షల కోట్ల రుణమాఫీ చేసి వారికి అండగా నిలబడిన మోడీ కార్మికులపై ఎందుకు కక్ష కట్టారో అర్థం కావడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా 30 కోట్ల మంది కార్మికులు సార్వత్రిక సమ్మెలో భాగంగా రోడ్డు ఎక్కి ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండు చేశారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు పాలన సాగించలేవని ఇప్పుడు కూడా దేశంలో అదే పరిస్థితి ఉత్పన్నమవడం ఖాయమని హెచ్చరించారు. ఐఎన్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి టీ నారాయణరావు, ఆటో వర్కర్స్ యూనియన్, క్వారీ లారీ వర్కర్స్ యూనియన్, సదరన్ డ్రగ్స్ యూనియన్, కడియం కోస్టల్ పేపర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# చదివే బాధ్యత మీది దానికి తగిన ఏర్పాట్లు చేసే బాధ్యత నాది

- విద్యార్థులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న యువ నాయకుడు మంత్రి లోకేష్
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ.



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** తమ యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థుల చదువులకు ఎక్కడ ఆటంకం కలగకుండా అలాగే కాలేజీ యజమానులకు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా మంత్రి లోకేష్ రాష్ట్రం ఆర్థిక భారంలో ఉన్న కూడా విద్యార్థులకు ఇచ్చిన హామీ ప్రకారం 1200 కోట్లు తక్షణ సహాయంగా విడుదల చేసి ఉత్తర్వులను విడుదల చేశారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు, భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు), అన్నారు. విద్యార్థులు, కాలేజీ యాజమాన్యం తరఫున ఆయన మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే లోకేష్ చదువుకిచ్చే ప్రాధాన్యత ను విద్యార్థులందరూ గమనించి చదువులో ఉత్తీర్ణులై రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు అలాగే కాలేజీ యాజమాన్యం కూడా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వారికి కావలసిన వసతులు మెరుగుపరచాలని గత ప్రభుత్వంలో విద్యా పై చేసిన అలవసత్వాన్ని తమ నాయకుడు లోకేష్ గాడిలో పెడుతున్నారని విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంచుతూ గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను కూడా త్వరలో సరి చేస్తారని రానున్న కాలంలో కూటమి ప్రభుత్వ హయాంలో అనేక మార్పులు తీసుకొస్తారని దానికి అనుగుణంగా విద్యార్థులు కూడా రాబోయే తరాల్లో తిరుగులేని వ్యవస్థగా విద్య వ్యవస్థ మారుతుందని భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ అన్నారు.

# "కందుకూరి" చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలియాలి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** నవ-యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు సమాజానికి చేసిన సేవ... ఆయన చరిత్ర మన ముందు తరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. రూ. 30 లక్షలతో వకాయల వారి వీధిలోని కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహానికి చేపట్టిన రెనోవేషన్ పనులను ఆయన జనసేన పార్టీ రాజమండ్రి ఇంచార్జ్ అత్తి సత్యనారాయణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహం శిథిలావస్థలో ఉందని, గత ఐదేళ్ల వైసీపీ



పాలనలో విస్మరించబడినట్టు ఆరోపిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చారిత్రక ఆస్తిని పునరుద్ధరించేందుకు ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సహకారంతో రూ. 30 లక్షల రూపాయలు మంజూరు చేసి, మరమ్మత్తు పనులు ప్రారంభమైనట్లు ప్రకటించారు.

**చారిత్రక ప్రాముఖ్యత..**

కందుకూరి వీరేశలింగం పంతులు బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాల నిషేధాలకు వ్యతిరేకంగా పోరాడి ఈ ఇంటిలోనే 1881 డిసెంబరు 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించారని గుర్తు చేశారు. బ్రిటిషు ప్రభుత్వం 1893లో ఆయనకు 'రావు బహదూర్' బిరుదు ప్రదానం చేసిందన్నారు. సమాజ హితం కోరుతూ తన యావదాస్తిని దానం చేసిన కందుకూరి రచనలు, బట్టలు, కుర్చీ, మఫ్లర్‌లు ఇక్కడ భద్రంగా ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.

**వైసీపీ పాలనలో హీనావస్థ..**

గత ఐదేళ్లు వైసీపీ కందుకూరి వీరేశలింగం పంతులు వారి ఆస్తులను నిర్లక్ష్యంగా వదిలేసిందని మండిపడ్డారు. ఆయన విద్యా సంస్థల్లో అశాస్త్రీయంగా కొన్నింటిని దేవదాయ, విద్యా శాఖలలోకి కలిపిందని, మరికొన్నింటిని గాలికి వదిలేయడం వల్ల వాటి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. గత పాలకులు ఈ ఇంటిని కూడా నిర్లక్ష్యంగా వదిలేశారని మండిపడ్డారు. టౌన్ హాల్ కు గత ఐదేళ్లు తాళాలు వేసి మూసేశారని విమర్శించారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మరమ్మత్తులు చేసినా, అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కందుకూరి ఆస్తులపై నిర్లక్ష్యం చూపటం వీరేశలింగం పంతులుపై కక్ష కలిగిన చర్యలా ఉందన్నారు.

**కూటమి చొరవలు..**

ఎంపీ పురంధేశ్వరి వారి ఎంపీ నిధుల నుంచి రూ. 30 లక్షలు మంజూరు చేసి, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, టేక్‌వుడ్ బీమ్స్, ఫ్యాన్ టైల్స్‌తో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 50 లక్షలతో పూర్తి చేసి భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం స్థానిక నాయకుల ద్వారా టౌన్ హాల్ కు మరమ్మతులు చేపట్టి దానిని కూడా తెరిచి, గ్రంథాలయాన్ని కళాకారులకు వేదికను అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు.

**ప్రజలకు పిలుపు..**

ప్రజలు, విద్యార్థులు, మునుపటి విద్యార్థులు ఈ చారిత్రక స్థలాన్ని సందర్శించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ ఆస్తులన్నీ కాపాడేటందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పురావస్తు శాఖ, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరుబాట

- దేశవ్యాప్త సమ్మెతో నిలిచిన పరిశ్రమలు, కాకినాడ పోర్టు పనులు
- కార్మికులందరికీ కనీసవేతనం 30 వేలకై డిమాండ్



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12** దేశవ్యాప్త సమ్మె పిలుపుమేరకు కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ సీపోర్టు పనులను తెల్లవారుజాము నుండే షిఫ్ట్ మరియు జనరల్ షిఫ్ట్ పనులను అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులను అడ్డుకోవడంపై పోలీసులతో తోపులాట జరిగింది. అనంతరం కాకినాడ మెయిన్ రోడ్డు హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్దనుండి మసీదు సెంటర్, బాలచేరువు మీదుగా కలెక్టరేట్ వరకు భారీ జనసమీకరణతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. వెంకటేశ్వర్లు, ఏఐసిసిటియూ రాష్ట్ర నాయకులు చిన్నబిల్లి నాగేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు వల్లూరి రాజబాబు, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోఆర్డినేషన్ కమిటీ నాయకులు ఆదినారాయణమూర్తి, ఏపీఎంఎస్ఆర్యు జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, రిటైర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు రెడ్డి, వైఎస్ఆర్ టియు జిల్లా అధ్యక్షులు చెక్క చక్రవర్తి మాట్లాడుతూ నేటి ధరలకు అనుగుణంగా కనీసం 30 వేలు కార్మికులందరికీ చెల్లించాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, పని గంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను రెగ్యులర్ చేసి వేతనాలు పెంచాలని, డ్రైవర్ల మెడకు ఉరితాడుగా ఉన్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దుచేసి, ఉచిత బస్సు వల్ల నష్టపోయిన డ్రైవర్లకు పరిహారం చెల్లించాలని, అసంఘటిత రంగ కార్మికులైన హమాలీ, ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్న అన్ని పథకాలను అమలు చేయాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, పాత ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంట రుణాలు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ దేశవ్యాప్త సమ్మెకు ఏపీ ఎన్జీవో సంఘం కాకినాడ జిల్లా కమిటీ, జిల్లా జేఏసీ నాయకులు మద్దతుగా భోజన విరామ సమయంలో కలెక్టరేట్ వద్ద బహిరంగ సభలో మద్దతు తెలియజేసారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, పోర్టు వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్యారావు, కుమార్ స్వామి, సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, జ్యోతి, రమణమ్మ, ఆశా వర్కర్ సీనియర్ నాయకులు భారతి, లక్ష్మి, సిహెచ్ వేణి, ఎం నాగలక్ష్మి, జిజిహెచ్ శానిటేషన్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, శేషు, రమేష్, జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్ నాయకులు అనపర్తి ఏడుకొండలు, రాజశేఖర్, ఏచూరి శ్రీను, జిజిహెచ్ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ నాయకులు ధర్మ, భాగ్యలక్ష్మి, మెప్మా ఆర్పీ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ఆన్లైన్ ఆటో యూనియన్ నాయకులు బాలు, విజయ్, నాగేశ్వరరావు, కాకినాడ పాసింజర్ ఆటో యూనియన్ నాయకులు ప్రకాష్ రావు, టాటా మ్యాజిక్ యూనియన్ నాయకులు శ్రీను, రమేష్, సత్తిబాబు, ఏపీ ఎమ్మెస్ ఆర్ యు యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, క్యాబ్ డ్రైవర్ యూనియన్ నాయకులు ఇస్మాయిల్, గంగాధర్, దుర్గాప్రసాద్, అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ నాయకులు నాయుడు, సత్యనారాయణ. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మి నారాయణ, సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కెవి.రామయ్య, రంగరాయ ఔట్సోర్సింగ్ వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు వనమాడి కాటవేణి, శివ, ఏఐటీయూసీ నాయకులు బంగారు రాజేష్, కాటూరి రాజు, అప్పన్న, హరి, జాన్ బాబు, ఐఎఫ్టియుసి నాయకులు బూరెమ్మ, శివకుమార్, బి. అశోక్ కుమార్, వనుము రమణ, ఇందిర, సురేష్, శ్రీనివాస్,ఏఐసీసీటియు నాయకులు గొడుగు సత్యనారాయణ, బద్రి రవి, బద్రి నాగబాబు, జి నాగమణి, బత్తిన లావరాజు, కొల్లా చిన్నబాబు, పోరంకి నరసరాజు, ఎస్ ప్రసాదరావు, కే శ్రీను, జి నాగేశ్వరరావు ఏఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడికి సత్యం, కుంచే అంజిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు రెడ్డి దుర్గాదేవి, వల్లే సత్తిబాబు, రాయుడు గోవిందు, తిరుమలశెట్టి వెంకటరమణ, గొల్లెల శివ రాంబాబు, నాగరాజు, బాబీ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చెయ్యాలి

- కాకినాడ రూరల్ లో కదం తొక్కిన కార్మిక లోకం... సమ్మె విజయవంతం.
- సర్పవరం సెంటర్లో భారీ ర్యాలీ, మానవహారం.

**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, కనీస వేతనం 30 వేలు ఇవ్వాలని, పాత ఉపాధి చట్టాన్ని కొనసాగించాలని రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో భాగంగా కాకినాడ రూరల్ మండలం లో పారిశ్రామిక ప్రాంతం, గ్రామాల్లో సమ్మె జయప్రదంగా జరిగింది. కాకినాడ రూరల్ లో ఉన్న కోరమండల్, ఏం గ్రీన్ అమోనియా, ప్యారి సుగర్ ఓఎన్జిసి రిలయన్స్ ఆదాని ఆయిల్ ఇతర ఆయిల్ కంపెనీలో స్వచ్ఛందంగా ఏ షిఫ్ట్ రద్దు చేసుకున్నారు. ఉదయం 5 గంటల నుండి కోరమండలం వద్ద సమ్మె ప్రారంభమైంది. ఎక్కువమంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. రిలయన్స్ యాడ్ కాంటాక్ట్ కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. సర్పవరం విశాఖ డైరీ సెంటర్ నుండి వందలాది మంది కార్మికులు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, బిజెపి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు నశించాలని, 8 గంటల పని విధానం కొనసాగించాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ సర్పవరం సెంటర్లో మానవహారం అనంతరం బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. ఈ బహిరంగ సభకు కాకినాడ రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా అధ్యక్షతన జరిగింది. బహిరంగ సభలో ప్రజానాట్యమండలి నాయకులు డప్పు కొట్టి, పాటలు పాడి సభను ఉత్తేజపరిచారు. ఈ బహిరంగ సభలో సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్షులు దువ్వా శేష బాబ్జి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్ గోవిందరాజులు, ఏపీ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చింతపల్లి అజయ్ కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరవేణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, విమల, వివో ఏ సంఘం నాయకులు గంగాభవాని మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం 30 వేలు ఇవ్వాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 21 ఇవ్వాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాల్ని అవలంబిస్తుందని విమర్శించారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా వచ్చిన ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ కూటమి ప్రభుత్వం 12 గంటలు చేయడం దారుణం అన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా పని గంటలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. అంగన్వాడి ఆశ మిడ్ డే మిల్ పంచాయతీ వివో ఏ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని అన్నారు. కాకినాడ రూరల్ పారిశ్రామిక ప్రాంతంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్నికి నిధులు పెంచాలి 200 రోజులకు పని పెంచి రోజుకి 600 రూపాయలు కూల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులు ఇచ్చి ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించిన పని గంటల పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేదంటే చలో అసెంబ్లీ పిలిపిస్తామన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు అయ్యే వరకు కార్మికులు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మె సెగతోటైనా మోడీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలు మానుకోవాలి అన్నారు. పార్లమెంట్లో స్తంభించే విధంగా చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు రైతులు మహిళలు యువకులు అందరూ పాల్గొనాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వాసంశెట్టి చంద్రరావు, అంబటి రామకృష్ణ, చిట్టూరి విజయ్ కుమార్, జుత్తిగ శ్రీనివాస్, అంకం సుబ్రమణ్యం, లోవరాజు పంచాయతీ వర్కర్స్ యూనియన్ కాకినాడ రూరల్ అధ్యక్షులు వీరభద్రరావు, రిలయన్స్ యూనియన్ నాయకులు అప్పన్న, కృష్ణ పారిశ్రామిక ప్రాంత కార్మికులు సత్యనారాయణ, బలరాం, శ్రీహరి, రాంబాబు, సంగీతరావు, రామకృష్ణ, నూకరాజు, ప్రసన్న, శ్రీను, దుర్గాప్రసాద్, నూకరాజు, సాయి, చంద్రశేఖర్, అప్పలరాజు, ఆదర్శ కార్తీక్, అంగన్వాడి నాయకులు కనకమహాలక్ష్మి రాజేశ్వరి తనుజ బేబీ రామలక్ష్మి అప్పలకొండ ఆశ వర్కర్ యూనియన్ నాయకులు బేబీ, శారదా, పి.సుగుణ, సుబ్రహ్మణ్యం, సూర్యకుమారి, ఎం సుగుణ, వరలక్ష్మి, నూకరత్నం చంటమ్మా తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ, నకిలీ అంతా కూటమి నేతల్లోనే- తిరుమల తిరుపతి లడ్డులో కాదు



జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం

**జగ్గంపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** తిరుమల తిరుపతి లడ్డులో కల్తీ లేదని విచారణ సంస్థలు చెప్పడాన్ని కూటమి నేతలు తట్టుకోలేక పోతున్నారని కల్తీ అంతా కూటమి నేతల్లోనే ఉంది తప్ప లడ్డులో కాదని తోట నరసింహం విమర్శించారు.ప్రపంచ వ్యాప్తంగా శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కూటమి నేతల ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పట్ల కూటమి నేతలకు కనీస గౌరవం లేదని తమ తప్పులను కప్పుపుచ్చుకోవడానికి చంద్రబాబు అండ్ కో ఎంతకైన దిగజారతారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ముఖ్య పుణ్యక్షేత్రాలలో ప్రమాదాలు జరగడం భక్తులు మరణించడం లాంటి అనేక సంఘటనలు జరిగిన ఈ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. శ్రీశైలం శివమాల ధరించి, ఎంతో నిష్టతో దీక్ష చేసి వచ్చిన శివ స్వాములకు సౌకర్యాలు కల్పించలేక వారిపై లాఠీ చార్జీలు చేసిన దుర్మార్గపు ప్రభుత్వం ఏదైనా ఉందంటే కూటమి ప్రభుత్వమని విమర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ని ప్రజలకు, ముఖ్యంగా హిందువులకు దూరం చేయాలని చంద్రబాబు చేసిన కుట్ర రాష్ట్ర వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారు భక్తులకు అర్థమైందని అన్నారు. వైజాగ్ లో ఆలయం కట్టిన, మారుమూల మన్యం ప్రాంతాలలో ఆలయాలు కట్టిన, విదేశాలలో ఆలయాలు కట్టిన అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని తోట నరసింహం అన్నారు. కక్ష పూరిత రాజకీయాల్లో భాగంగా సీనియర్ నాయకుడు మాజీ మంత్రి అయినటువంటి అంబటి రాంబాబు పై అక్రమ కేసులు బనాయించి రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా జోగి రమేష్ ఇంటిపై పెట్రోలు బాంబులతో దాడి చేసి గుండాలు వలె ప్రవర్తించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, గోకవరం మండల పార్టీ అధ్యక్షుడు పాటి రాంబాబు, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, జగ్గంపేట నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు కరటూరి వీర్రాజు, రాజుపూడి ఎంపీటీసీ నంగన నాని, రాజపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు పూనిశెట్టి శ్రీను, ఎక్స్ ఎం పి టి సి శ్రీను, ధనిశెట్టి వరప్రసాద్, తదితర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కంతేరు గ్రామంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు



**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 12 :** ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దీవెన ఆగ్రో కెమికల్స్ పేరుతో నిర్వహిస్తున్న ఎరువులు, పురుగు మందుల దుకాణం తోపాటు గోదాములపై ఏకకాలంలో దాడులు చేశారు. అనధికారికంగా నిర్వహిస్తున్న గోదాము గుర్తించిన అధికారులు. ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో అవకాతవకాలు గుర్తించారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదేశాలు మేరకు ఎస్సై సీతారాము ఆధ్వర్యంలో రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు.

# తంటికొండ వెంకన్నను దర్శించుకున్న కలెక్టర్లు



**గోకవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై కలియుగ దైవంగా వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ఐఏఎస్ వి అభిషేక్, ఎటపాక యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి బాలకృష్ణారెడ్డి తో పాటు స్థానిక తాసిల్దార్ పి రామకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు.వేద పండితుల మంత్రోత్సవాల నడుమ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, చల్లా ఉదయ బాబు నాయుడు వీరిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. స్వామివారి పట్టు వస్త్రాలను కలెక్టర్ కు అందించారు. విశేష పూజలు జరిపించి, కలెక్టర్ కు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. తంటికొండ దేవస్థానం యొక్క విశిష్టతను కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు బొట్ట రామకృష్ణ, చింతల నాగు, ఆలయ గుమస్తా చిన్ని, వేద పండితులు ఫణి తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్ కి గురై యువకుడు మృతి



**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 12 :** ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతి చెందారు. విశాఖపట్నంలోని హెచ్.పి.సి.ఎల్ సంస్థలో ఉద్యోగం చేస్తున్న గ్రామానికి చెందిన గోపిశెట్టి సతీష్ కుమార్ (28).స్వగ్రామంలో సొంత ఇల్లు నిర్మాణంలో ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి.ఎస్.ఐ జానా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా శ్రీ గోపాలకృష్ణ ఆలయ వార్షికోత్సవం



**తాళ్లరేవు (మనసులో మాట) ఫిబ్రవరి 12:** స్థానిక అయిన గడ్డ వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ గోపాలకృష్ణ ఆలయ మందిరం 15వ వార్షి కోత్సవ వేడుకలు గురువారం అత్యంత ఘనంగా జరిగాయి ముమ్మిడి సత్యనారాయణ గురు స్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గం టల నుంచి విశ్వక్సేన పూజ పుణ్యాహవచనం పంచా మృ తాభిషేకం తదితర విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఎరగల వీరబాబు ఆదిలక్ష్మి, తెల్ల మేకల రాంబాబు సుజాత, లంజిపల్లి గోవిందు ఈశ్వరి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేశారు. ఉదయం సీతారామపురం తాళ్లరేవు పాత తాళ్లరేవు జార్జిపేట వారిచే కోల సంబరం సాయంత్రం సొన్నా సూర్యారావుచే మంగాదేవి పాటను భక్తిశ్రద్ధలతో ఆలపించారు. ఈ సందర్భంగా అనేకసార్లు కోల సంబరం నిర్వహించడంతోపాటు 2002, 2010, 2013 సంవత్సరాలలో తాళ్లరేవు శివాలయం నుంచి శబరిమల వరకు పాదయాత్ర చేసిన ముమ్మిడి సత్యనారాయణ గురుస్వామిని ఆలయ కమిటీ ప్రతినిధులు దుస్తాలు వారు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# సిఐటియు ఆధ్వర్యంలో భారీ నిరసన

4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ కోటనందూరులో ..



**కోటనందూరు (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడజిల్లా, కోటనందూరులో కార్మికులు భారీ ధర్నా చేపట్టారు. కోటనందూరుబస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్మించి అక్కడి నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్ బాబా, మండల అధ్యక్షులు దాడి గోవిందు, సిఐటియు మండల అధ్యక్షులు ముక్కుడుపల్లి బాబురావు, కార్యదర్శి ఎస్.కె. పద్మ మీడియాతో మాట్లాడుతూ..కొత్త చట్టాలు కార్మికులను బానిసలుగా మారుస్తాయని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి అని , నవంబర్ 21 నుండి అమలుకానున్న లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.కార్మిక హక్కులను కాలరాసే నిర్ణయాలను అన్ని పార్టీల ఎంపీలు వ్యతిరేకించాలనీ కోరారు. కార్మికుల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ విధులను బహిష్కరించి పోరాటంలో పాల్గొనాలని పిలుపునిస్తూ, అనంతరం తహశీల్దార్కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రమణమ్మ, లీల, లోవ కుమారి, ఆటో యూనియన్ నాయకులు శంకరరావు, రుపీ, ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, నూకరత్నం, కుసుమ, కాంట్రాక్ట్ కార్మికులు లోకేష్,రమేష్, భవన నిర్మాణ కార్మికులు బొజ్జ నూకరాజు, యేసు, నాగరాజు, మధ్యాహ్నం భోజన పథకం వర్కర్లు సత్యవతి, దేవుడమ్మ, స్కూల్ ఆయాలు అప్పలనరస, వెంకటలక్ష్మి, వాచ్ మెన్ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేపు గోకవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**గోకవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12 :** గోకవరం మండల ప్రజా పరిషత్ లో ఈనెల 14న సర్వసభ్య సమావేశం జరుగనున్నదనిఎంపీడీవో మోతుకూరి గోవింద్ లిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు అధ్యక్షతన జరగబోవు ఈ సమావేశంలో జగ్గంపేట నియోజకవర్గ శాసనసభ్యుడు, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నదని , సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించడం జరిగిం దన్నారు. మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల పై సర్వసభ్య సమావేశం జరగనున్నదని ఎంపీడీవో గోవింద్తెలిపారు

# తూర్పు'లో మున్సిపల్ కార్మికుల బంద్ సంపూర్ణం

**అప్కోస్ కార్మికులను రెగ్యులర్ చేసే వరకు పోరాటం ఆగదు**

**-యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు తూర్పు గోదావరి జిల్లాలో తాటిపాక మధు నాయకత్వంలో రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు ప్రాంతాలలో సమ్మె విజయవంతంగా కొనసాగింది. గురువారం ఉదయం నుండే కార్మికులు పనికి వెళ్లకుండా. చీపురు ముట్టకుండా నిరసన తెలిపారు. పేపర్ మిల్లు గేట్ వద్ద.. రాజమండ్రి పేపర్ మిల్లు గేట్ వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు టీ అరుణ్, తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మికులు - భారీ ర్యాలీ



**తాళ్లరేవు (మనసులో మాట) ఫిబ్రవరి 12:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్రం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నిర్వహించిన సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కదంతొక్కారు. సీతారామపురం అంబేద్కర్ విగ్రహంవద్ద ప్రజా సంఘాల నాయకులు టి. ఈశ్వరరావు, ఈశ్వరీబాయి, నాగలక్ష్మి, అదృష్టదీపుడు తదితరులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి దేశ పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికులపైన స్కీము వర్కర్లు పైన ఉక్కుపాదం మోపిందన్నారు. కోట్లాదిమంది ఉపాధి కూలీల పొట్ట కొడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి జీవంలేని కొత్తచట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. అనంతరం సీతారామపురం నుంచి తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డ్వాక్రా యానిమేటర్స్. ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఉపాధి హామీ కార్మికులు, ఆటో కార్మికులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం


**-ఈ నెల 12 నుండి 14వ తేదీ వరకూ..**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఎంఎస్ఎంఈ-డీ ఎఫ్ ఓ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల 'పీఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్' గురువారం రాజమండ్రిలో ఘనంగా ప్రారంభించడం జరిగిందని ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్ ఆర్ సెంథిల్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక దానవాయిపేటలోని ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ ప్రదర్శన ఈ నెల 12, 13, 14 తేదీలలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఆర్ సెంథిల్ కువ

# మెల్లూరులో కొమ్మన సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొన్న..

**మాజీ ఎమ్మెల్యే దంపతులు.**



**అనపర్తి (మనసులో మాట)ఫిబ్రవరి 12:** బిక్కవోలు మండలం మెల్లూరు గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కొమ్మన సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం అనపర్తి నియోజకవర్గ వైయస్ ఆర్సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి,ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన వైయస్ఆర్సీపీ కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి,ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దంపతులతో పాటు బిక్కవోలు మండల వైయస్ఆర్సీపీ కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి(బుజ్జి), గ్రామ కన్వీనర్ సత్యనారాయణ, కొమ్మన ఆనంద్, మాగాపు వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం

**కార్మికుల హక్కుల కోసం కలిసి పోరాడుతాం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి**

- **సమ్మెకు ఏఐవైఎఫ్ మద్దతు పరిశ్రమల దగ్గర నిరసన**



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కాకినాడ జిల్లా కాకినాడ అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు గా ఏఐవైఎఫ్ యామ్ గ్రీన్ అమోనియా పరిశ్రమ దగ్గర నిరసన తెలియజేశారు ఈ నిరసన కార్యక్రమానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వాల చేతుల్లో కీలుబొమ్మగా మారారని అన్నారు కార్మికుడి సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వాలే అడ్డుపడడం సరికాదన్నారు కార్మికుడికి కనీసం 26 వేల రూపాయలు ఇవ్వాలని అదనంగా పీఎఫ్ ఈఎస్ఐ కల్పించి కార్మికుడికి అండగా ఉండాలని అన్నారు అలాగే ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని కోరారు అలాగే భవనిర్మాణ కార్మికులకు వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ తో పాటుగా గత ఐదు సంవత్సరాలుగా జరిగిన క్లెయిమ్స్ ని కూడా క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు కార్మికుడు భీమా 25 లక్షల రూపాయలు ఉండాలని కోరారు నాలుగు లేబర్ కోడెలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు కార్మికులు సమస్యలపై ఏఐవైఎఫ్ కలిసి పోరాడుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు. ఎం వీరబాబు. గోనెల నాగభూషణం. బోండా. మైఖేల్ .బి దుర్గారావు. ఈ మధుబాబు. ధర్మరాజు. లోవ రాజు. కె కృష్ణ. వాడ్రేవు వెంకటేష్. సిహెచ్ రాము. సురేష్. ముమ్మసాని .లోవరాజు. కోరమండల్. ప్యారి షుగర్. ఏ ఎమ్ గ్రీన్ అమోనియా . పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు

# ఆంధ్రప్రదేశ్‌కు అంతరిక్ష సాంకేతిక మద్దతు



**కాకినాడ (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర అంతరిక్ష శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్ రాజ్యసభలో సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో ఇస్రో మరియు ఎన్ఆర్ఎస్సి ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు వివిధ రంగాల్లో విస్తృతంగా అంతరిక్ష సాంకేతిక మద్దతు అందించామని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉపగ్రహ డేటాతో పంట విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కరువు ప్రభావ విశ్లేషణ, వై ఈ ఎస్ - టి ఈ సి హెచ్ సాంకేతికత, అగ్రిస్టాక్ కోసం హై రిజల్యూషన్ డేటా అందజేస్తున్నారు. మత్స్యరంగంలో పి ఎం ఎం ఎస్ వై కింద నావిక్ ఆధారిత వేస్సెల్ కమ్యూనికేషన్ అండ్ సపోర్ట్ సిస్టం (వి సి ఎస్ ఎస్ ) ద్వారా మత్స్యకారులకు ద్విమార్గ సమాచార సదుపాయం కల్పించారు.విపత్తు నిర్వహణలో వరదలు, తుఫానులు, అడవి మంటల మ్యాపింగ్‌తో పాటు గోదావరిలో రెండు రోజుల ముందస్తు వరద హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థ అమలులో ఉంది. జియోపోర్టల్, మెరుపు గుర్తింపు సెన్సార్లు కూడా ఏర్పాటు చేశారు. పట్టణ ప్రణాళికలో భువన్ వెబ్ జీఐఎస్ ద్వారా గృహాల జియోట్యాగింగ్, ఏపీఐ సపోర్ట్ అందిస్తున్నారు. టెలి-ఎడ్యుకేషన్, టెలి-మెడిసిన్ సేవలకు ఉపగ్రహ సామర్థ్యం వినియోగిస్తున్నారు. జలవనరుల పరిరక్షణలో తడి భూముల మ్యాపింగ్, నీటి నాణ్యత అంచనా, ఏ ఎన్ ఆర్ యు టి పట్టణాల జలవనరుల సమాచార సేకరణ, పి ఎం కె ఎస్ వై వాటర్‌షెడ్ ప్రాజెక్టుల పర్యవేక్షణ నిర్వహించారు. నిధుల పరంగా ఎస్ ఐ ఎస్- డి పి ప్రాజెక్ట్‌కు రూ.118.95 లక్షలు పూర్తిగా వినియోగించగా, భూమి వినియోగ మ్యాపింగ్‌కు రూ.106.66 లక్షలు మంజూరు చేశారు. తడి భూముల ప్రాజెక్ట్‌కు రూ.31.25 లక్షలు వినియోగించారు. అదేవిధంగా ఇన్ స్పేస్ ద్వారా రాష్ట్రానికి చెందిన స్టార్టప్‌లు, ఎం ఈ ఎం ఎస్ లు, విద్యాసంస్థలు నమోదు చేసుకోగా, తెనాలికి చెందిన సీడ్ ఫండ్ మెంటర్‌షిప్ మరియు ఇస్రో సదుపాయాల వినియోగానికి అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఇలా వ్యవసాయం నుంచి విపత్తు నిర్వహణ వరకు పలు రంగాల్లో అంతరిక్ష సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

- **స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి**
- **జిల్లాలోని 115 స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి**
- **ఫిర్యాదుల నమోదుకై ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ గురించి 18004256131 విస్తృత ప్రచారం చేయాలి**





**ఏలూరు, ఫిబ్రవరి, 12(మనసులో మాట) :** జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసి అండ్ పిఎన్డిటి) అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. పుట్టబోయేది ఆడ శిశువు అని తెలియగానే కొన్ని సందర్భాల్లో గర్భస్రావానికి సిద్ధ పడుతున్నారని ఇది చాలా బాధాకరం అని, ఇటువంటి సంఘటనలు రూపుమాపడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం తీసుకు వచ్చి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో 13, ప్రైవేట్ విభాగంలో 102 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జరగకుండా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. ఏ కేంద్రంలోనైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జరిగినట్లు తేలితే తగిన ఆధారాలతో ఆయా కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ, ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖాధికారులు పోలీసు అధికారుల సహకారంతో పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని సరైన పరికరాలతో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. గర్భ విచ్చిత్తి ఔషదాలు ఔషధ దుకాణాలలో విచ్చలవిడిగా ప్రజలకు అందుబాటులో లేకుండా డ్రగ్ ఇన్స్పెక్టర్లు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కేసు కేంద్రాలపై ఫిర్యాదుల కోసం జిల్లాలో టోల్ ఫ్రీ 18004256131 ఫోన్ నెంబర్ ఏర్పటుచేయడం జరిగిందని, టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలందరికీ తెలిసేలా ప్రతీ స్కానింగ్ సెంటర్ వద్ద ప్రదర్శించాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, సదరు స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం జిల్లాలో 1499 అబార్షన్స్ నమోదయ్యాయని, వీటిపై స్కానింగ్ కేంద్రాలు, మండల, గ్రామాల వారీగా వివరాలు అందించాలని, వీటిపై సమగ్ర విచారణ చేయాలన్నారు. ఏలూరు జిలాల్లో స్త్రీ, పురుష నిష్పత్తి 934, 1000 గా ఉందని, ఇది ఆందోళనకరమైన విషయమన్నారు. జిల్లాలో డేకాయ్ ఆపరేషన్లు నిర్వహించి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టం పటిష్టంగా అమలు పరిచి, జిల్లాలో స్త్రీ నిష్పత్తిని గణనీయంగా పెంచుటకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి-లేదా మోడీ గద్దె దిగాలి..

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు**
- **తూర్పు గోదావరిలో సమ్మె విజయవంతం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), పిబ్రవరి 12:** కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు, ఉపాధి హామీ పథకం కుదింపు, విద్యుత్ బిల్లు 2025 కి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేస్తున్న అఖిల భారత సమ్మె విజయవంతం అయ్యిందని, మోదీ గద్దె దిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు హెచ్చరించారు. గురువారం ఉదయం సార్వత్రిక సమ్మె నేపథ్యంలో పేపర్ మిల్లు, హార్లిక్స్ ఫ్యాక్టరీ, కోకో ప్లాంట్ జట్ల సంఘం, మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టారు. బ్యాంకులు కూడా మూతపడ్డాయి. అనంతరం స్థానిక కోటిపల్లి బస్ స్టాండు నుండి కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు మీదుగా కోటగుమ్మం వరకు ర్యాలీ సాగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ బ్రిటిష్ వారి పాలనలో కార్మిక హక్కులు చట్టాలు ఉన్నాయని, పోరాడి సాధించుకున్న మన కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నేడు నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయటం దారుణం అన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర పోరాటం చేయాలని మధు పిలుపు నిచ్చారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, అసంఘటిత రంగ కార్మికులను పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్స్ కి కనీస వేతనం రూ.26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ఆపాలని, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర పెంచి, రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. "మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని మధు కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీ అరుణ్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత పథకాన్ని ప్రవేశ పెట్టాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే కార్మికులకు జీతాలు చెల్లించాలని, వ్యవసాయ మార్కెట్లలో దడువాయి కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 65కు పెంచాలని, మెడికల్ కాంట్రాక్టు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని,పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేసి వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండు చేశారు. నాలుగు కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో జట్ల సంఘం అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కే రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ పవన్, కాంగ్రెస్ నాయకులు టీకే విశ్వేశరరెడ్డి, బాలేపల్లి వెంకటరమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరావు, దుర్గమ్మ సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, సప్ప రమణ, సీఐటీయూ మూర్తి, ఏఐటీయూసీ నాయకులు రామారావు, కే రామకృష్ణ, ఐఎఫ్టీయూ నాయకుడు రమణ జోజి, సీపీఐ నాయకులు చింతలపూడి సునీల్, కే శ్రీనువాస్, పీ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# లేబర్ కోడ్లు రద్దు చేయాలంటూ కార్మిక సంఘాలు సమ్మె కార్యక్రమం




**తణుకు మనసులో మాట ఫిబ్రవరి 12 :**కార్మికులను కట్టు బానిసలను చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు అమలు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాపిత సమ్మె తణుకులో సీఐటీయూ, ఏఐటీయూసీ ల ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. కార్మికులు, ఉద్యోగులు తమ విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వేలాదిమంది కార్మికులు అరుణ పతాకాలు చేతబట్టి,సంఘాల బేనర్లతో రాష్ట్రపతి రోడ్, నరేంద్ర సెంటర్ మీదుగా మున్సిపల్ ఆఫీసు వరకు మహాకార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మన్సిపల్ ఆఫీసు రోడ్ లో నిర్వహించిన బహిరంగ సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు,సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజారామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ కార్మికులు జీవించే హక్కు హరిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు నిర్విరామ పోరాటాలకు ఉద్యోగ, కార్మికులు సిద్ధం కావాలన్నారు. కార్మికులు ప్రాణత్యాగాలు,రక్తతర్పణ చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో ఏభై కోట్ల మంది కార్మికుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి అదానీ,అంబానీ లాంటి కొద్దిమంది కార్పోరేట్ లు,సంపన్నుల ప్రయోజనమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఒక పక్క కార్పోరేట్ లకు అనుకూలంగా కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికుల శ్రమకు తగిన వేతనాలు చెల్లించకుండా మరింత దోపిడీ చేసుకునేందుకు వీలుగా లేబర్ కోడ్స్ తెచ్చారని, మరో పక్క ప్రజల ఆస్థి,దేశ సంపదగా వున్న లక్షల కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ లకే దోచిపెడు తున్నారన్నారు. మోడీ విధ్వం సకర విధానాలు ప్రతిఘటిస్తూ నిరంతర పోరాటాలకు పూనుకోవాల న్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బొద్దాని నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు బళ్ళ చినవీరభద్రరావు,సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి,సీపీఎం తణుకు పట్టణ కార్యదర్శి ఎ. అజయకుమారి,అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకుడు రవికుమార్, ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘ నాయకులు పిఎల్ నరశింహారావు,ఎన్జీవో సంఘ నాయకులు నరసరాజు, మెడికల్ రిప్రజెంటీటివ్ యూనియన్ నాయకుడు రమేష్,లాయర్స్ యూనియన్ నాయకుడు కామన మునుస్వామి,యూటీఎఫ్ నాయకులు జయకుమార్ తదితరులు మాట్లాడారు.మహా కార్మిక ప్రదర్శనకు అక్కమాంబ టెక్స్ టైల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చిక్కాల దుర్గాప్రసాద్,ఉపాధ్యక్షుడు దేవ పెద్దిరాజు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి నున్న ఫణింద్ర, శ్రీసత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దాకే ముసలయ్య, ఉపాధ్యక్షులు అట్లు వెంకట్రావు,వాన్ బరీ వర్కర్స్ యూనియన్ నాయకుడు గుబ్బల గోపి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు ఆదినారాయణ, మందుల ముత్తయ్య, ఏపీ సీడ్స్ మహిళా వర్కర్స్ యూనియన్ కోశాధికారి పిండి సత్యవతి,సహాయ కార్యదర్శి వలవల అరుణకుమారి, జయలక్ష్మి ఏఐటీయూసీ,సీఐటీయూ నాయకులు నిర్మల, కరుటూరి ప్రసాద్, ఇసుకపల్లి రమేష్, శివకుమార్ తదితరులు ఆధ్వర్యం వహించారు.

# తమ న్యాయమైన డిమాండ్ల కోసం కదం తొక్కిన కార్మికులు



**అయినవిల్లి (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా నాలుగు లేబర్స్ కోడ్ ను అమలులోకి తీసుకురావడం కార్మికుల పొట్ట కొట్టడమేనని సిఐటియు నాయకుడు దుర్గాప్రసాద్ ఆరోపించారు. గురువారం అయినవిల్లి మండలంలో అంగనవాడీ ఆశ కార్యకర్తలు మిడ్డే మీల్స్ వీఆర్ఏ వలుపు కార్మికులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం అయినవిల్లి మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుండి ర్యాలీగా ముక్తేశ్వరం నాలుగు రోడ్ల కూడలికి బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్మికుల పొట్ట కొట్టే విధంగా లేబర్స్ కోడ్ ను తీసుకొచ్చారని లక్షల కోట్లు బ్యాంకులు సొమ్ము దోచుకున్న వారికి కొమ్ముకాస్తూ రోజువారి కూలీ చేసుకునే కార్మికుల పై నిబంధనలు పెట్టడం దుర్మార్గమైన చర్యని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రధాన నరేంద్ర మోడీ కళ్ళు తెరిచి లేబర్ కోడ్స్ రద్దు చేయాలని లేకపోతే 2029 ఎన్నికల్లో కార్మికులే ఆయనను గద్దె దించిండం ఖాయమని ఎద్దేవా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అయినవిల్లి తహశీల్దార్ విద్యాపతికి వినతి పత్రాన్ని అందజేసారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నెలకు 26,000 జీతం ఇవ్వాలని ప్రభుత్వ బెనిఫిట్స్ కల్పించాలని ఇలా పలు డిమాండ్లతో వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు ఉమామహేశ్వరి రామలక్ష్మి జ్ఞానేశ్వరి నాగదుర్గ మంగాదేవి రమ్యలతో పాటు భారీగా కార్మికులు పాల్గొన్నారు.

# ఖాతాదారుల ప్రయోజనాలకే భీమా పథకాలు

## యూనియన్ బ్యాంక్ మేనేజర్ దున్న సురేష్

**కాజులూరు మనసులో మాట ఫిబ్రవరి 12 :** కాజులూరు మండలంలోని అంద్రంగి గ్రామంలో గురువారం మనసును తాకే ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన రెండు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి భీమా పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ కాజులూరు శాఖ మేనేజర్ దున్న సురేష్ మాట్లాడుతూ, ఖాతాదారుల కుటుంబ సభ్యుల భవిష్యత్తు భద్రతే భీమా పథకాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇటీవల మరణించిన అన్నమనీడి చంద్రకళ, గిడ్ల సత్యనారాయణ నామినీలైన రామారావు, గీడ్ల దుర్గాదేవి కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందజేయబడింది. అంద్రంగి గ్రామంలోని బిజినెస్ కరస్పాండెంట్ శేషారావు సమక్షంలో చెక్కులను మేనేజర్ దున్న సురేష్, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి సుజాత, ఎంపీటీసీ సభ్యులు మట్ట సత్యనారాయణమ్మల ఆధ్వర్యంలో



అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సురేష్ మాట్లాడుతూ, తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న జీవన్ జ్యోతి భీమా పథకం వంటి బీమా పథకాలు అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక రక్షణగా నిలుస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా భీమా పథకాల్లో చేరాలని ఆయన సూచించారు. కుటుంబానికి ఆదరణగా నిలిచే వ్యక్తి లేకపోయినా, భీమా సాయం ఆర్థికంగా ఒక ఆధారంగా నిలుస్తుందని చెప్పారు. గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి సుజాత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ భీమా పథకాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ప్రజలు అవగాహనతో ముందుకు వచ్చి నమోదు చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు మట్ట సత్యనారాయణమ్మ కూడా ఈ పథకాల ప్రాముఖ్యతను వివరించారు.

# పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని కలిసిన..

## రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి



**అనపర్తి (మనసులో మాట) ఫిబ్రవరి12:** వై ఎస్ ఆర్ పి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి ఆయన సతీమణి సత్తి అచ్చియ్యమ్మ లు తాడేపల్లి లో, గురువారం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి అనపర్తి నియోజకవర్గం మరియు విశాఖపట్నం జిల్లాలలో పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. మరల అధికారంలోకి తీసుకురావడానికి, అందరూ కృషి చేయాలని ఈ రాష్ట్రంలో వైసిపి ఆధ్వర్యంలో మరోసారి ప్రజా సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటు చేయడం మనందరి బాధ్యతని, వచ్చే ప్రభుత్వంలో తప్పనిసరిగా కార్యకర్తకు అత్యంత ప్రాథమిక కల్పిస్తామని జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు సత్తి సుబ్బారెడ్డి తెలిపారు.

# మహాశివరాత్రి వేళ భక్తులకు ఊరట



**పిఠాపురం,(మనసులో మాట) ఫిబ్రవరి 12 :** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి (పాదగయ) క్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం పూజా సామాగ్రి ధరలను అధికారులు ఖరారు చేశారు. గురువారం దేవస్థానం ఎదురుగా ఉన్న దుకాణదారులతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారి వివి గోపాలకృష్ణ అధ్యక్షతన కమర్షియల్ టాక్స్, మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భక్తులను ఇబ్బంది పెట్టకుండా కొబ్బరికాయలు అరటిపండ్ల ధరలను ఈ క్రింది విధంగా నిర్ణయించారు: కొబ్బరికాయలు: పరిమాణాన్ని బట్టి రూ. 10, రూ. 20, రూ. 30 గా నిర్ణయించారు. అరటిపండ్లు డజను రూ. 40 గా ఖరారు చేశారు. అధికారులు మాట్లాడుతూ, నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన సామాగ్రిని అందుబాటులో ఉంచాలని దుకాణదారులకు సూచించారు. పండుగ రోజుల్లో ధరల నియంత్రణపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా విద్యార్థులకు పోటీలు

## డీఈఓ వాసుదేవరావు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12:** రాజమండ్రిలోని ఓఎన్ జీసీ కేంద్రీయ విద్యాలయంలో జిల్లాలో గల తొమ్మిదవ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రేరణ పోటీలను జిల్లా విద్యా శాఖ అధికారి కంది వాసుదేవారావు ప్రారంభించారు. ప్రేరణ పోర్టర్ లో రిజిస్టర్ చేసిన విద్యార్థులను ప్రతి స్కూల్ నుంచి ఒక బాలుడు, ఒక బాలికను ఎంపిక చేసి వారిని జిల్లా స్థాయికి పోటీకి పంపించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ వికసిత్ భారత్ - మై కంట్రిబ్యూషన్ టువర్డ్స్ సొసైటీ అండ్ నేషన్ అనే అంశంపై మల్టీ మోడల్ యాక్టివిటీస్ భాగంగా ఎస్సే రైటింగ్ పోయెమ్, స్టోరీ, సాంగ్, డ్రాయింగ్, క్యారికేచర్ లో 15 మంది బాలురు, 15 మంది బాలికలు ఎంపిక చేసి వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ఒక బాలుడు, ఒక బాలిక జిల్లా స్థాయిలో ఎంపిక చేసి ప్రధానమంత్రి చదివిన పాఠశాల వేర్నాకులర్ స్కూల్, వాడ్ నగర్, గుజరాత్ కి ప్రోగ్రామ్ ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీ సుభాషిణి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఇంచార్జ్) కే శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి జీ




శ్రీనివాస్ నెహ్రూ పాల్గొన్నారు.

# బిజెపి బలపరిచిన పృథ్వీరాజ్ ప్యానల్ అభ్యర్థులకు ఓట్లు వేయండి

## న్యాయవాది గాజింగం కు బిజెపి నాయకులు వినతి



**గోకవరం (మనసులో మాట), ఫిబ్రవరి 12 :** ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం బార్ అసోసియేషన్ ఎన్నికలలో బిజెపి బలపరిచిన జనపరెడ్డి పృథ్వీరాజ్ ప్యానల్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని గోకవరం గ్రామానికి చెందిన న్యాయవాది గాజింగం రామ లింగేశ్వర రావు ను జెపి నాయకులు రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట సురేష్, మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన దొర, ఆది విష్ణు తదితర్లు అభ్యర్థించారు

# అనాథ చిన్నారులకు అండగా ప్రభుత్వం



**పిఠాపురం, మనసులో మాట ఫిబ్రవరి 12 :**పిఠాపురం నియోజకవర్గం మాదాపురం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇరువురు చిన్నారులకు ప్రభుత్వం అండగా నిలిచింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్నారుల దుస్థితిని తెలుసుకొని, వారికి తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పందించి, చిన్నారులకు ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఈ క్రమంలో గురువారం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.వి. గోపాలకృష్ణ చేతుల మీదుగా చిన్నారులు కరణం సత్య, చంటిలకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న చిన్నారులను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా యుద్ధప్రాతిపదికన ఈ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బిడ్డల భవిష్యత్తుకు ఈ స్థలం భరోసాగా నిలుస్తుందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ చిన్నారులపై చూపిన చొరవ పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష....




**మండపేట (మనసులో మాట) ఫిబ్రవరి 12 :** మండపేట మండలం ఏడిద శ్రీ సంగమేశ్వర స్వామి వారి ఆలయం నిర్వహించే శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు రూరల్ సి ఐ దొర రాజు గురువారం సమీక్షించారు. మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు కల్పించేందుకు ఆలయ కమిటీ సంబంధిత శాఖలతో సి ఐ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నాన ఘాట్లు పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రూరల్ సి ఐ దొర రాజు పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కు పలువురి పరామర్శలు..



**మండపేట మనసులో మాట ఫిబ్రవరి 12 :** సోదర వియోగంతో బాధపడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను మాజీ మంత్రులు తోట నరసింహం, కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత, మాజీ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ తుమ్మల బాబు, పశ్చిమగోదావరి జిల్లా డిసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు తదితరులు గురువారం పరామర్శించారు. తోట త్రిమూర్తులు సోదరుడు తోట సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో త్రిమూర్తులను పరామర్శించడానికి రాష్ట్రం నలుమూలల నుండి నాయకులు కార్యకర్తలు వెంకటాయపాలెం గ్రామం తరలివస్తున్నారు. సోదరుని నివాసంలో తోట త్రిమూర్తులు ఉండి తనను పరామర్శించడానికి వచ్చిన కార్యకర్తలను నాయకులకు కలుసుకున్నారు. తోటను పరామర్శించిన వారిలో కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసు, కాకినాడ పురపాలక సంఘం మాజీ మేయర్ సుంకర పావని, అమలాపురం వైసిపి పార్టీ ఇంచార్జ్ శ్రీకాంత్ పినిపే శ్రీకాంత్, అనపర్తి జడ్పీటీసీ వెంకట రెడ్డి, వైసీపీ నాయకులు నేమాని రాజశేఖర్, మేక శ్రీనివాస్, పర్వత ప్రసాద్, కాకినాడ మున్సిపల్ కార్పొరేటర్ రాజవరపు కృష్ణ తదితరులు పరామర్శించారు.

# కార్మిక హక్కుల కోసం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం



**ఏలేశ్వరం (మనసులో మాట ) ఫిబ్రవరి 12 :** కార్మిక హక్కుల పరిష్కారాని కోసం గురువారం చేసిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఏలేశ్వరంలో విజయవంతమైంది. సమ్మెలో భాగంగా సిఐటియు అనుబంధ అంగన్వాడి, ఆశ, వి ఏ ఓ, ఉపాధి కూలీలు, డ్వాక్రా యానిమేటర్లు, భవన నిర్మాణ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మిక సంఘాలు సభ్యులు 600 మంది పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా ఏలేశ్వరంలో భారీ ర్యాలీ నిర్వహించి, బాలాజీ చౌక్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సిఐటియు నాయకులు కాకరపల్లి సునీత, పిల్ల రాంబాబు, గంగ భవాని, గుర్రం వీరబాబు, ఎన్ అమరావతి, రౌతు సత్యనారాయణ, మాసా రామారావు, జి రాజేశ్వరి, అడపా శివ, యుటిఎఫ్ నాయకులు మెతకాని రాంబాబు, జట్ల సోమరాజు, ఏఐసీసీటియు జిల్లా అధ్యక్షుడు ఏగుపాటి అర్జున్ రావు ఉన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 పేజీ : 14

# పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకం

- ఏకాత్మ మానవ వాదం సిద్ధాంతంతో దేశం స్వావలంబన
- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సువాసిని ఆనంద్




**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** పండిట్ దేన దయాల్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవ వాద సిద్ధాంతం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు.అనకాపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో సమర్పణ దివస్ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధికారం ప్రతినిధిగా డాక్టర్ సుహాసిని ఆనంద్ హాజరయ్యారు. పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ భారతీయ రాజకీయ నాయకులు, తత్వవేత్త, సిద్ధాంతకర్త, జనసంఘ వ్యవస్థాపకులలో అగ్రగన్యుడు, బిజెపి సిద్ధాంతాలకు దార్శనికుడు అన్నిటికీ మించి స్వాతంత్ర్య సమరయోధుడని ఆమె కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర ప్రేరణ అని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన ఆలోచనలు బిజెపి పార్టీ సిద్ధాంతాలకు పునాది అన్నారు. ఆయన సృష్టించిన ఏకాత్మ మానవ వాదం సిద్ధాంతం గురించి ప్రజలలో ప్రచారం చేసి అవగాహన, చైతన్యం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు మాట్లాడుతూ 1951లో భారతీయ జనసంఘను స్థాపించడంలో కీలకపాత్ర వహించి సంస్కృతి ఆధారంగా దేశం అభివృద్ధి చెందాలని స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని ఇరగగా ప్రచారం చేశారన్నారు. ఆయన కృషితో నేడు బిజెపి పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరి ంచడానికి ప్రధాన కారకుడు దీన దయాల్ ఉపాధ్యాయ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు బొడ్డేడ నాగేశ్వరరావు, బి రత్న భరత్, గొర్లి రామునాయుడు, సీనియర్ నాయకులు పొనగంటి అప్పారావు, బి వి ఎస్ వర్మ, పాకలపాటి రవిరాజు, పట్టాభి ప్రసాద్, ఒరుగంటి నాగమణి, గంగుపాము నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు వియ్యపు నర్సింగ్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అడ్డురోడ్డులో కదంతొక్కిన కార్మికులు-కార్మిక వ్యతిరేకవిధానాలురద్దుకు డిమాండ్



**ఎస్. రాయవరం, ఫిబ్రవరి 12,(మనసులో మాట) :** కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే రద్దు చేసి, కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డు పైవంతెన నుండి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ఎత్తున కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ రంగంతో సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే విధంగా లేబర్ కోడ్స్ అమలు చేయడం దుర్మార్గమని విమర్శించారు. పెరిగిన ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కార్మికులు, పేద ప్రజల జీవనం దుర్భరమైందని అన్నారు. కనీస వేతనం రూ. 26,000 తక్షణమే అమలు చేయాలని, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి రద్దు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు సోమనాథ కమిటీ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దొరబాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తీసుకు రావాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని అన్నారు. అంగన్ వాడీ, ఆశా, మిడేమీల్, ఐకెపి, ఆర్డబ్ల్యూఎస్, ఆటో కార్మికులు వంటి వర్గాలకు సంక్షేమ పథకాలు పూర్తిగా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుఎం. సత్యనారాయణ, రూపాదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనబాల రాజేష్,వెలుగుల అర్జున్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్, ఐకెపి, ఆటో, ఆర్డబ్ల్యూఎస్ , పంచాయితీ రాజ్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను ప్రదర్శించారు. ప్రభుత్వం, కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సంఘాలు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు.

# కదంతొక్కిన కర్షక, కార్మికులు-ఎరుపెక్కిన అనకాపల్లి

- వేలాది మంది ప్లే కార్డులు, జెండా లతో నిరసన ర్యాలీ
- కర్షక, కార్మిక నినాదాలతో దద్దరిల్లిన పురవీదులు




**అనకాపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా అనకాపల్లి లో గురువారం వేలాదిగా కర్షక, కార్మికులు ఆందోళన చేపట్టి ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కర్షక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళన చేపట్టారు. ముందుగా అనకాపల్లి సిఐటియు కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్, పెరుగు బజార్ (చిన్న రోడ్ల జంక్షన్) వరకు, తిరిగి ఎన్టీఆర్ స్టేడియం కు వేలాది మందితో ర్యాలీ జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ప్లే కార్డు లు చేతపట్టుకొని నినదించారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ జరిగింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, లేబర్ యాక్టులకు నిరసనగా కార్మిక - రైతు సంఘాలు ఈ సమ్మె కు మద్దతు ప్రకటించాయి. బ్యాంకులు కూడా సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు కె. లోకనాధం మాట్లాడుతూ భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ నేడు భారత్ బంద్ చేపట్టడం జరిగిందన్నారు. రెండు దేశాల వాణిజ్య ఒప్పందం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది భారత రైతుల పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తపరిచారు. అమెరికా నేర్పరితనానికి భారత ప్రభుత్వం లొంగిపోయిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరి స్తుందని, నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ - చట్టం- 2025, వీబీజి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ ఐసీలో వంద శాతం విదేశీ పెట్టు బడులకు అనుమతించడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు ఇరవై ఆరువేలరూపాయలు ఇవ్వాలని, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, బేవరేజ్ కార్మికులకు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం లోను, జీవీఎంసీ లో పనిచేసే డైలీ వెజ్ కార్మికులకు కనీస వేతనం ఆరువందల ఏభై రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడి, ఆశ, ఐకెపి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలన్నారు. స్కూల్స్ స్లిప్పర్స్, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం పన్నెండు వేల రూపాయలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఎఐటియుసి అనకాపల్లి కార్యదర్శి వై.ఎన్.భద్రం మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం కార్మికులుకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఆటో కార్మికులకు సమగ్ర చట్టం చేయ్యాలన్నారు. కాగా ఈ సమ్మెకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నాయి, ఆర్ టి సి, నాయుకులు సంఘీబావం తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఐద్వా జిల్లా కార్యదర్శి డి. డి. వరలక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్ కాళ్ళ తేలయ్యబాబు, అంగన్వాడీ వరలక్ష్మి, తనుజ, రామలక్షి, ఆశ శాంతి, సూర్యకళ, పార్వతి, మూఠా కార్మికులు భీశెట్టి అప్పారావు, సురేష్, రమణ, కోండలరావు, మజ్జి శంకరరావు, వారాది సత్యనారాయణ, రూప, అజయ్, సంతోష్,బి. ఉమామహేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, ఎఐటియు జిల్లా అద్యక్షులు పెంటకోట సత్యనారాయణ, నాయుకులు వియ్యపురాజు, తాకాశి వెంకటేశ్వరరావు, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు

# సంఘటిత పోరాటమే మార్గం - కార్మికులకు శిక్ష, యజమానులకు రక్ష లేబర్ కోడ్స్



- అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులు ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు.

**హుకుంపేట ఫిబ్రవరి 12 మనసులో మాట :** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం సిఐటియు పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మె సందర్భంగా కార్మికులు భారీగా ఆందోళన నిర్వహించారు. అనంతరం పెట్రోల్ బంక్ నుండి బజారు వరకు ర్యాలీ నిర్వహించి తమ సమస్యలు, డిమాండ్లపై నినాదాలు చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నిర్వహించిన ఈ సమ్మెలో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆశ వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, వెలుగు వీవోఏలు, అంగన్వాడి సిబ్బందిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే చట్టబద్ధమైన అన్ని రకాల సెలవులు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సభలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. హైమావతి, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావు, సిపిఎం మండల కార్యదర్శి వి. లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని విమర్శించారు. పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచుతూ, ఓవర్‌టైమ్‌కు సరైన పారితోషికం చెల్లించకుండా కార్మిక హక్కులను హరించిందన్నారు. 'ఒక దేశం--ఒక వేతనం' పేరుతో రోజుకు రూ.178 జాతీయ కనీస వేతనం నిర్ణయించడం వల్ల వేతనాలు పెరగకుండా తగ్గే ప్రమాదం ఉందన్నారు. యూనియన్ నమోదు ప్రక్రియలో కూడా మార్పులు చేసి, ముందుగా 7 మంది కార్మికులతో నమోదు చేసుకునే అవకాశం ఉండగా, ఇప్పుడు కనీసం 100 మంది లేదా 10 శాతం కార్మికులు ఉండాలని నిబంధనలు విధించడం కార్మిక వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని, ప్రజలు ధరల భారంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను అదుపు చేయకుండా మద్యం ధరలు తగ్గించడం ద్వారా ఖజానా నింపుకోవడంపైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ఇస్తూ, కార్మికుల హక్కులను హరిస్తున్నారని పేర్కొన్నారు. 20 ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించకపోవడం, కనీస వేతనం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. 24 గంటలు విధులు నిర్వర్తించాల్సి వస్తున్నప్పటికీ చట్టబద్ధమైన సెలవులు, భద్రతా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపాలని నాయకులు డిమాండ్ చేశారు. సంఘటిత పోరాటంతోనే హక్కులు సాధ్యమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి. అప్పలకొండ, కె. అప్పారావు, కృష్ణమూర్తి, అంగన్వాడి యూనియన్ నాయకురాలు కొండమ్మ, వెలుగు వీవోఏ పోతురాజు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికకు వెళ్ళే రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం



**గొలుగొండ, ఫిబ్రవరి 12,(మనసులో మాట):** చీడిగుమ్మల పంచాయతీ యరకంపేట గ్రామం స్మశానం రోడ్డుఎంపీపీ నిధులు నాలుగు లక్షల ముప్పై వేలు మంజూరైంది. ఈ మేరకు గురువారం పనులు ప్రారంభమయ్యాయి. గొలుగొండ జడ్పీటీసీ సుర్ల గిరిబాబు ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు సర్పంచ్ కాపరపు చిన్నబ్బాయి ఉపసర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ 10 వార్డ్ నెంబర్ బర్ల అప్పలనాయుడు 11 వార్డ్ మెంబర్ గజ్జి రమణ యస్సార్ సీపీ పార్టీ ఆధ్వర్యంలో యరకంపేట పార్టీ అధ్యక్షులు బోడకుర్తి నారాయణ మూర్తి పార్టీ కార్యకర్తలు సహకారం తో స్మశానం కి వెళ్లే దారి సిమెంట్ రోడ్డు వేయడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



**గొలుగొండ, ఫిబ్రవరి 12(మనసులో మాట):** గొలుగొండ మండలంలో దారమఠం శివాలయం లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహిం చనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను గురువారం అధికారులు పరిశీ లించారు. తహసిల్దార్ నూకరాజు ఎస్సై రామారావు సర్పంచ్ గెద్దం అదిలక్షీ ఆనంద్ దేవాదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను సందర్శించారు.మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు పారిశుధ్యం భద్రత ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాల్లో ప్రత్యేక చర్యలుతీసుకుంటున్నామని తాసిల్దార్ నూకరాజు పేర్కొన్నారు. ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహిం చేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు

# వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా 'సీతబాబు'



**కోటవురట్ల:** వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా కోటవురట్ల మండలం తంగేడు రాజుల కుటుంబానికి చెందిన ఆర్.ఎస్.దత్తుడు సీతబాబు నియమితులయ్యారు.వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. గురువారం తంగేడు గ్రామంలో ఆయనకు పార్టీ కార్యకర్తలు నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తిరుపతి లడ్డులో కల్తీ జరిగిందంటూ కూటమి నాయకులు చేస్తున్న విష ప్రచారాన్ని అందరూ ఖండించాలన్నారు. తిరుపతి వెంకటేశ్వర స్వామిని రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుంచి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపు కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఇంటి పైన సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవాలి

ఏఈ శ్రీనివాసరావు



**రావికమతం ఫిబ్రవరి 12( మనసులో మాట):** ప్రతి ఒక్క ఇంటి యజమాని సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవాలని మండల ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు కోరారు. మండలంలో గుడ్డిప గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాను రాను జల విద్యుత్ అణు విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోతుంది అన్నారు. భవిష్యత్ తరాలకు వెలుగులు నిలుచుటకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తికి గృహ యజమానులకు భారీగా రాయితీలు ప్రకటించిందని చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి వలన సంబంధిత ఇంటి యజమాని ఉపయోగించే విద్యుత్ అవసరాలు తీస్తుందని వివరించారు. ఇంకనూ మిగిలిపోయిన విద్యుత్తును తాము కొనుగోడు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు, వీఆర్వో బంటు బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రేషన్ 28 చివరి తేదీ

**కె కోటపాడు, ఫిబ్రవరి 12 ( మనసులో మాట ) :** కేంద్ర ప్రభుత్వం రైతు అనుసంధానం ( ఫార్మర్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ) ప్రక్రియ మొదలైందని మండల వ్యవసాయ శాఖ అధికారి సోమశేఖర్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రిందటి సంవత్సరము అనగా - 2025 ఫిబ్రవరి నెలలో సెంట్రల్ గవర్నమెంట్ వారు ఫార్మర్ రిజిస్ట్రీ అను ఆన్లైన్ రైతు అనుసంధానము ప్రక్రియ ను మొదలుపెట్టారు . ఇందు ప్రతి రైతుకు కూడా వారు పేరు మీద భూమి ఉన్నదో - వాళ్లు కచ్చితంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రీ నందు ఆన్లైన్ ' ఫార్మర్ రిజిస్ట్రేషన్ ' అనేది చేసుకోవాలి అని తెలిపారు . ప్రతి రైతుకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాక 11 నెంబర్లు కలిగిన రిజిస్ట్రేషన్ ఐడి అనే ఒక నెంబర్ జనరేట్ అవుతుంది. కావున డ్రైవ్ మోడ్లో ఈ కార్యక్రమమును చేసి రైతుల సహకారము తో ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనే కార్యక్రమం కె కోటపాడు మండలానికి సంబంధించి 90% రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఇంకా 10% శాతం రైతులు అనగా 1444 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఉండిపోవడం జరిగింది. ఇందులో ముఖ్యంగా - కె కోటపాడు మండలంలో భూమి ఉండి బయట గ్రామాల్లో నివసిస్తున్న వాళ్ళు ఎక్కువమంది ఉన్నారు. అలాగే మండలం లో ఉన్న ప్రక్క ప్రక్క గ్రామాల్లో ఉండి కూడా రిజిస్ట్రేషన్ చేసుకోలేని వాళ్ళు కొద్దిమంది ఉన్నారు. వీళ్ళందరు కేంద్ర ప్రభుత్వం వారు రైతు లకు అందచేసే పెట్టుబడి సహాయము అయినా లి'పిఎం కిసాన్' పధకం క్రింద 6000 రూపాయల ను పొందాలంటే కచ్చితంగా




ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. అదేవిధంగా వచ్చే సంవత్సరం నుండి పంటల బీమా మరియు ఎరువులు కూడా ఈ ఫార్మర్ రిజిస్ట్రీకి లింక్ చేయబడతాయని సోమశేఖర్ అన్నారు . కావున భూమి ఉన్న రైతులు ఇంకా ఎవరైతే రిజిస్ట్రేషన్ చేసుకోలేదో వాళ్లు మీ గ్రామ రైతుసేవా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ మరియు ఉద్యాన సహాయకుల దగ్గరికి వెళ్లి మీ ఆధార్ కి లింక్ అయిన ఫోన్ నెంబర్, మరియు 1బి మరియు ఆధార్ నెంబరు తీసుకొని వెళ్లవలసిందిగా కోరడమైనది. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 28వ తారీకు ఆఖరి తేదీగా నిర్ణయించడం అయినది కావున అందరూ దయచేసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాల్సిందిగా, భూమి ఉన్న ప్రతి రైతు గ్రహించాలి అని మండల వ్యవసాయాధికారి సోమ శేఖర్ తెలిపారు.

# గుత్తులపుట్టు వారపు సంతను సందర్శించిన జాయింట్ కలెక్టర్



**పాడేరు రూరల్ ఫిబ్రవరి 12 మనుసులో మాట :** పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామంలో గురువారం జరిగిన వారపు సంతను ప్రాజెక్ట్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ ( ఎఫ్ ఏ సి ) తిరుమణి శ్రీ పూజ ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె సంతలో విక్రయానికి వచ్చిన స్థానిక రైతులు, గిరిజనులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో పండే కాఫీ మరియు పిప్పళ్ల (లాంగ్ పెప్పర్) ధరలపై జాయింట్ కలెక్టర్ గారు ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు తమ ఉత్పత్తులను ఏ ధరకు విక్రయిస్తున్నారు, కొనుగోలుదారులు ఎంత చెల్లిస్తున్నారు అనే అంశాలపై రైతులతో స్వయంగా చర్చించారు. మార్కెట్లో దళారుల ప్రమేయం లేకుండా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందో లేదో అని ఆమె ఆరా తీశారు. సంత పర్యటనలో భాగంగా గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు మరియు నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మెడికల్ షాపును సందర్శించి, నిబంధనల మేరకు మందులు విక్రయిస్తున్నారా లేదా అని తనిఖీ చేయడంతో పాటు, గడువు ముగిసిన మందులు అమ్మకూడదని హెచ్చరించారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని మరియు నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గూటులపుట్టులో అర్హత లేని ఆర్.ఎం.పి క్లినిక్ సీజ్

## అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

## పి.ఓ మరియు జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



**పాడేరు రూరల్ ఫిబ్రవరి 12 మనుసులో మాట :** పాడేరు మండలం గూటులపుట్టు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒక ఆర్.ఎం.పి క్లినిక్‌ను పి.ఓ మరియు జాయింట్ కలెక్టర్ ( ఎఫ్ ఏ సి ) తిరుమణి శ్రీపూజ గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా క్లినిక్‌లోని మందులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వైద్యుని అర్హతలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.కనీస వైద్య అర్హతలు లేకుండా, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తనిఖీలో తేలింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న ఇలాంటి నకిలీ క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సదరు క్లినిక్‌ను తక్షణమే సీజ్ చేసి, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

# బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు

## ఎం ఎస్ కె ఎండి పర్వీన్ బాబు ఆధ్వర్యంలో



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** మండలంలో గల చూచుకొండ సచివాలయ ప్రాంగణంలో బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని ఎం ఎస్ కె ఎండి పర్వీన్ బాబు తెలిపారు. బాల్యవివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దడానికి వంద రోజులు కార్యక్రమంలో భాగంగా చూచుకోండ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడం వల్ల బాలికల విద్య కు ఆటంకం ఏర్పడుతుందని, ఆరోగ్యపరంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, బాల్య వివాహాల చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే అన్నపూర్ణ అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు



- అమ్మవారి ని దర్శించుకున్న కార్పొరేషన్ చైర్మెన్ లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ళ సురేంద్ర

**అనకాపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** అనకాపల్లి పట్టణం లోని విజయరామరాజుపేట లో శ్రీ మరిడి మాంబ అమ్మవారి జాతర (పండుగ) మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందు గా మరిడిమాంబ అమ్మవారి ని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ దర్శించు కొని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు, టీడీపీ కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అమ్మవారి ని దర్శించుకున్న మళ్ళ సురేంద్ర దంపతులు...

అనకాపల్లి పట్టణం విజయరామరాజు పేట శ్రీ మరిడితల్లి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర దంపతులు అమ్మవారి ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువలు కప్పి సత్కరించారు. తదనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ఆళ్ళ సత్యనారాయణ, పలకా రాము, బొబ్బిలి అప్పారావు, పలకా సత్యనారాయణ,ఆళ్ల రామచంద్రరావు, పిట్ల బడ్డీస్, పోలవరపు త్రినాథ్, దాడి జగన్,బొబ్బిలి సురేష్, భానుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామీణ రహదారులకు మహర్దశ

- సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కూటమి నేతలు



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ ఆశీస్సులతో మూలపేట పంచాయతీకి ఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ క్రింద 19.70 లక్షలు సిమెంట్ రోడ్లు మంజూరు అయ్యాయి. దీనిలో భాగంగా మూలపేట గ్రామంలో మంజూరైన సిమెంట్ రోడ్లు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు కాండ్రేగుల గాంధీ ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, మండల టిడిపి అధ్యక్షులు పెంటకోట విజయ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఏవి సత్యనారాయణ, జెకె బ్రదర్స్, సర్పంచ్ బి శెట్టి గంగప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూలపేట జనసేన పార్టీ అధ్యక్షులు కాండ్రేగుల గాంధీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలోనే గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టిందని, రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామంలో చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మూలపేట కూటమి నాయకులు, పంచాయతీ వార్డు మెంబర్స్ , ఆడారి కాశీ రావు, సరగడం నాగేశ్వరావు, కాండ్రేగుల ఆదినారాయణ , బి శెట్టి నాగేశ్వరావు, కోయిలాడ సత్యనారాయణ, పంచాయతీ సెక్రెటరీ గంగాధర్ రావు మూలపేట గ్రామ-స్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

# మిషన్ పునర్వ వనం గురించి ప్రజలకు తెలియజేయాలి

## జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి,ఫిబ్రవరి 12 (మనసు లో మాట) :** రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వందల సంవత్సరాల వయస్సు కలిగిన చెట్లకు పునర్ జీవం కలిగించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. అనకాపల్లి నుంచి అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో భాగంగా హరిపాలెం గ్రామంలో వంద సంవత్సరాల పైబడి ఉన్న రావి చెట్టును ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ సహకారంతో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఒక ప్రదేశాన్ని కేటాయించి పునర్వ వనం కల్పించారు.ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాలనే ఆలోచన వచ్చినప్పుడు చెట్లకు జీవం పోయాలనే ఆలోచనతో రూపొందించిన మిషన్ పునర్వ వనం మంచి ఆలోచన అని, ఈ కార్యక్రమం గూర్చి ప్రజలలో అవగాహన కలిగించి గ్రీనరీ పెంచాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలియజేశారు.

# ప్రతి మహిళ అక్షరాస్యులు కావాలి



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం సాయంత్రం 7:30 గంటలకు అక్షరాంధ్రా వయట్లజన విద్య అందిస్తున్న కార్యక్రమం లో భాగాంగా ఎంపీడీవో ఉషారణి , డిప్యూటీ ఎండిఓ సోమరాజు , ఏపీఎం బాల రాజు ఉమ్మలాడ విలేజ్ ని సందర్శిండం జరిగింది, కావున ప్రతి మహిళా అక్షరా స్యులు గా తయారు చెయ్యాలని కలక్టర్ ఆదేశాలు ప్రకారం అందరికి చదవడం రాయడం సంతకాలు నేర్పించాలని వాలంటరీ టీచర్ లకు సూచనలు చేయడం జరిగింది, ఈ నెల చివరి వారంలో మట్నదటి పరీక్ష ఉంటుందని అలాగే మార్చి చివరి వారంలో మెయిన్ పరీక్ష రాయడానికి అందరికి సిద్ధంగా ఉండాలని తెలియజేయడం జరిగింది.

# కరాటే లో బ్లాక్ బెల్ట్ గెలుచుకున్న గణపర్తి ఆడపిల్ల



**మునగపాక , ఫిబ్రవరి 12, మనసులో మాట :** మండలం గణపర్తి గ్రామానికి చెందిన దాడి నవ్యశ్రీ,విశాఖపట్నం కళాభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో తన శిష్యురాలు బ్లాక్ బెల్ట్ సాధించింది అని అన్నపూర్ణ అకాడమీ కోచర్ కరాటే శివ తెలిపారు.మారు మూల గ్రామం నుండి క్రీడా రంగం పట్ల ఆసక్తి చూపడమే కాకుండా,కరాటే బ్లాక్ బెల్ట్ గెలుపొందినందుకు గాను గ్రామం తరుపున పలువురు అభినందనలు తెలిపారు.ప్రస్తుతం ఈమె ఏలూరు శ్రీ సీతారామ గవర్నమెంట్ కాలేజ్ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ లో బి.పి.ఎడ్ టీచర్ ఎడ్యుకేటర్ గా శిక్షణ పొందుతుంది.తమ గణపర్తి గ్రామం తరుపున ఒక ఆడపిల్ల చురుకుగా క్రీడా రంగంలో రాణించినందుకు గాను గణపర్తి పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరుపున అభినందనలు తెలిపారు.

# మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల్లో భద్రత ఏర్పాట్లు

## దేవాలయాలను సందర్శిస్తున్న మునగపాక తహసిల్దార్, ఎస్సై



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** మునగపాక తహసీల్దార్ మరియు మునగపాక ఎస్ ఐ, ఈవో కలిసి నాగులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం అలాగే వాడ్రాపల్లి గ్రామం లోని శ్రీ దక్షిణకాశి విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శి ంచడం జరిగింది. సందర్శన సందర్భ ంగా రాబోయే మహాశివరాత్రి పండుగను పురస్కరిం చుకుని భద్రతా బందోబస్తు మరియు ఇతర ఏర్పాట్లపై సమగ్ర ప్రణాళిక రూపొం దించడం జరిగింది. వాడ్రాపల్లి ఆలయంలో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబడినట్లు తెలియజేశారు. అలాగే నాగులపల్లి ఆలయంలో కూడా రేపటిలోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఈవోతెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడానికి సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# వీ ఆర్ ఓ ల సేవలు అభినందనీయం

**నర్సీపట్నం తహసిల్దార్ లోకవరపు రామారావు.**



**నర్సీపట్నం రూరల్, ఫిబ్రవరి 12, ( మనసులో మాట) :** నర్సీపట్నం విఆర్ఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పదోన్నతి పొందిన ముగ్గురు వీఆర్వోలహొఅభినందన సభను బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ లోకవరపు రామారావు మాట్లాడుతూ..గ్రామ పంచాయతీలు స్థానిక స్వపరిపాలన లో ప్రాథమిక మెట్లుగా ఉంటూ గ్రామీణ అభివృద్ధి, పారిశుద్యం, నీటి సరఫరా వీధి దీపాలు, మరుగుదొడ్ల నిర్వహణ , ప్రజలకు అభివృద్ధి,సంక్షేమ పథకాలను గ్రామసభల ద్వారా తెలియ చేస్తూ , ప్రజలకు చేరువవుతున్న వీఆర్వోల అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం పదోన్నతి పొందిన ముగ్గురు వీఆర్వో లను ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ దేవాడ చిన్నం నాయుడు మాట్లాడుతూ..వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు వైపు నడిపిస్తున్నారని గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ ప్రజలకు సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ శంకర్, అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ శశిధర్, జిల్లా ట్రెజరర్ ఆశ, జిల్లా సెక్రెటరీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ డైరీ ఆర్థిక సహాయంతో పశువులకు ఇన్సూరెన్స్



**మాడుగుల ఫిబ్రవరి 12 (మనసులో మాట)** : మాడుగుల విశాఖ డైరీ పాలకేంద్రం ద్వారా పశువులకు ఇన్సూరెన్స్ గురువారం పాలు సొసైటీ అధ్యక్షులు బండారు వరలక్ష్మి ఆధ్వర్యంలో 120 పశువులకు ఇన్సూరెన్స్ చేయడమైనది, విశాఖ డైరీ పాల కేంద్రం ద్వారా పశువులకి ఇన్సూరెన్స్ రైతు ప్రీమియం 1/3 వావంతు రైతు భరించు పద్ధతిలో ఇన్సూరెన్స్ చేయబడును. పశువు చనిపోయిన 15 రోజులలో క్లయము ఇవ్వబడును విశాఖ డైరీ కి పాలు పోసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు, ఈ కార్యక్రమంలో పాలుసొసైటీ సెక్రటరీ గండి జోగినాయుడు, గండి రవికుమార్ హెల్పర్ మరియు రైతులు పాల్గొన్నారు,

# రోలుగుంట-చోడవరం బి.ఎన్. రోడ్లు శరవేగంతో..

**కూటమి నాయకులు నాణ్యత పరిశీలన.**



**రోలుగుంట మనసులో మాట, ఫిబ్రవరి 12 :** అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో రోలుగుంట నుంచి చోడవరం వరకు బి.ఎన్. రోడ్ల నిర్మాణం శరవేగంతో సాగుతోంది. ఈ పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం రావికమతం మండలం కూటమి నాయకులు రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజల సౌకర్యాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎస్.ఎన్. రాజు నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. జనసేన నియోజకవర్గ ఇంచార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు సహకారంతో అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో పరిశీలన జరిగింది.పాల్గొన్న ముఖ్య నాయకులలో కూటమి సీనియర్ నాయకుడు కోట నేలవేణి గోవింద రావు, బిజెపి మండల అధ్యక్షుడు గూటాల చిన్న, హై స్కూల్ చైర్మన్ దుప్పట్ల శ్రీను కృపారావు ప్రకాష్, జనసేన మండల అధ్యక్షులు, బిజెపి ప్రధాన కార్యదర్శి దంట్ల సత్యనారాయణలు ఉన్నారు. నాయకులు స్థలంలో పనుల తీరును, మెటీరియల్ నాణ్యత, పని నిర్వహణపై చర్చించి అధికారులకు సూచనలు అందించారు. ఈ రోడ్లు పూర్తయితే గ్రామీణ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా, వ్యాపారాలకు ఊతమవుతాయని అంచనా. కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్లో మొదటి స్థానంలో ఉందని నాయకులు స్పష్టం చేశారు

# మాకవరపాలెం 5వ వార్డ్‌లో రూ.30 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మాకవరపాలెం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** మాకవరపాలెం గ్రామంలోని 5వ వార్డ్ రింగ్ రోడ్డులో రుత్తల చిన రాంబాబు మిల్లు దగ్గర నుండి కాలనీలోని కృష్ణ గుడి వరకు రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, నర్సీపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ, మాకవరపాలెం చరిత్రలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి నిధులు గౌరవ శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి స్పీకర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాని, అల్లు రామనాయుడు, అల్లంపల్లి వెంకటరమణ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాడుగుల లో దేశవ్యాప్త సమ్మె విజయవంతం: సిఐటియు



**వి.మాడుగుల ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** మండలం కేంద్రంలో ఫిబ్రవరి 12 గురువారం సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె గాంధీ పార్కు నుంచి మొదలుకొని గెడ్డ బడి మీదుగా మోదమాంబ పాదాల నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వచ్చి ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ వద్ద మానవహారం చేసి సమ్మె కార్మికులందరూ కలిసి విజయవంతం చేశారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మికులకు హాని కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని మహాత్మా గాంధీ పేరును తొలగించడం దారుణమని విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏరద్దు చేయాలని అధిక బిల్లులు ప్రజలపై మాపొద్దని గ్యాస్ సబ్సిడీ ప్రతి నెల అర్హులైన వారందరికీ ఇవ్వాలని జీడి పంటకు కేజీ 200 రూపాయలు మద్దతు ధర ఇవ్వాలని రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని వ్యవసాయ కార్మికులు అనేక కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెను అంగన్వాడిలు. ఆయాలు ఆశలు. విఓఎలు పంచాయతీ కార్మికులు మిడ్డి మిల్స్. శానిటేషన్. ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఉద్యోగులు. వ్యవసాయ కూలీలు రైతులు గిరిజనులు వివిధ.సంఘల సభ్యులు కార్మికులు ప్రజల సమస్యలు పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి. ఇరట.నరసింహమూర్తి. వ్యవసా య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షు రాలు కే భవాని ఆశ అంగన వాడి ఉద్యోగులు ఏఎన్ఎమ్ లు. వివోఏలు. పంచాయతీ కార్మికులు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు స్కూల్లో పనిచేసే కార్మికులకు అనేకమంది ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదని, కనీస వేతనాలు లేవని, పి.ఎఫ్., ఈ.ఎస్.ఐ. సౌకర్యాలు లేవని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవని, యూనిఫారం ఇప్పటివరకు ప్రభుత్వాలు ఇవ్వడం లేదని, సకాలంలో ఇచ్చేటటువంటి జీతాలు కూడా ఇవ్వడం లేదని, మెనూ చార్జీలు నెలల తరబడి సకాలంలో ఇవ్వకపోవడం వలన కుటుంబాలకు ఆర్థిక భారంతో సతమత మవుతున్నారు పుండు మీద రోకలి పోటుగా నాలుగు లేబర్ కోడ్లను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తేవడం, దానిని రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత వేగవంతంగా అమలు చేయడం చాలా దారుణమని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న ప్పటికీ ప్రజలపై భారాలు ఎక్కువవుతున్నాయి కార్మికులు పేదవారు దేశంలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతా ఉన్నారు ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చేసి కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్ప వద్దని కోరారు.ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రతను కల్పించాలని, కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ఆర్ రామలక్ష్మి. కొండాజి.వరలక్ష్మి.పి.చంద్ర. వివోఏలు గొల్లారి జగదీశ్వరి క్లస్టర్ బాధ్యులు కొండాజి. జగదీ. జెయలక్ష్మి.గుణ. పంచాయితీ యూనియన్ ఏలుసూరి ఈశ్వరరావు అప్పారావు. ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు,

# నాతవరంలో జనవాణి కార్యక్రమం -8 వినతులు స్వీకరణ



**నాతవరం, ఫిబ్రవరి 12( మనసులో మాట) :** నాతవరం మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 8 వినతులు అందినట్లు వీరసూర్యచంద్ర తెలిపారు. భూ వివాదాలు, పింఛన్లు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చెర్లోపాలెం గ్రామానికి చెందిన రాజాన పోతురాజు తన కుటుంబానికి సంబంధించిన భూవివాదంపై ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు కుమారుడు రాజాన నాగేశ్వరరావు లక్ష్మీపురం గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 137-1లో 46 సెంట్ల భూమిని తమ నలుగురు అన్నదమ్ములకు తెలియకుండా రహస్యంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, తమను ఇళ్లల్లోకి వెళ్లనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై స్పందించిన వీర సూర్యచంద్ర తహశీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే మండలంలోని ఇతర గ్రామాల నుంచి పింఛన్ల మంజూరు, విద్యుత్ సరఫరా లోపాలు వంటి సమస్యలపై కూడా వినతులు అందినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని అన్నారు. జనవాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేయడం తమ లక్ష్యమని, జనసేన పార్టీ అధ్యక్షుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సూర్యచంద్ర పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ప్రధాన ధ్యేయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఆశ్రమ నిర్మాణం కోసం మల్ల స్వామి చంద్ర నాయుడు దంపతులు విరాళం



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** మళ్ల సోమచంద్ర నాయుడు లక్ష్మి నాగులపల్లి పిఎసిఎస్ సీఈవో మల్ల స్వామి చంద్ర నాయుడు దంపతులు తిమ్మరాజుపేట గ్రామస్తుల సహకారంతో దువ్వాడ రైల్వే స్టేషన్‌కు సుమారు 7 కిలోమీటర్ల దూరంలో నిర్మాణం అవుతున్న గొల్లలపాలెం ఆశ్రమం కోసం, నిన్న అరబుపాలెం అమ్మవారి సమక్షంలో జరిగిన 1980--81 బ్యాచ్ సమావేశంలో ₹10,116/- విరాళం సమర్పించబడింది. నా క్లాస్‌మేట్‌గా మేమిద్దరం కలిసి చదువుకున్న రోజుల్ని గుర్తు చేసుకుంటూ, ఇంత చక్కటి పుణ్య కార్యక్రమంలో భాగస్వాములు కావడం నాకు ఎంతో ఆనందంగా, సంతోషంగా అనిపించింది. నాయుడు గారి దంపతులు ఈ సేవలో భాగస్వాములు కావడం ఎంతో హర్షణీయం శ్రీనివాసరావు తెలిపారు. ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు అయినందుకు ట్రస్ట్ సభ్యుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.ఎప్పుడైనా మీరు నిర్భయంగా, విశ్వాసంతో ఈ ట్రస్ట్ నా క్లాస్‌మేట్ ట్రస్ట్ మా ట్రస్ట్ మన ట్రస్ట్" అని గర్వంగా చెప్పుకోగలరు. ఒక్క రూపాయి కూడా మిస్ యూజ్ కాకుండా, రాబోయే తరాలకు సనాతన ధర్మం, సంస్కారం, విద్య అందించాలనే సంకల్పంతో ఈ నిర్మాణం కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఈ టీంలో ఉన్న అందరూ తమకు తోచిన విధంగా సహాయం చేసి భాగస్వాములు కావాలని వినమ్ర పిలుపునిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

# బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఐదుగురు పట్టివేత

- **ఉత్తమ ఫలితాలనిస్తున్న పోలీసుల డ్రోన్ కెమెరా నిఘానేత్రం**



**నర్సీపట్నం రూరల్, ఫిబ్రవరి 12 , ( మనసులో మాట) :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు తమ సర్కిల్ పరిధిలోని ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పడుతూ అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తున్నారు. గురువారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాసరావు ఆదేశాలతో రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై పి రాజారావు సిబ్బందితో కలిసి నెల్లిమెట్ల, గబ్బాడ, బుచ్చంపేట, ఏటి గైరంపేట ప్రాంతాల పరిధిలో డ్రోన్ కెమెరాల సహాయంతో ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. ఈ సమయంలో నెల్లిమెట్ట జంక్షన్ నుండి బుచ్చంపేట రహదారి శివారు ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురిని డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి, వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ, డ్రోన్ కెమెరా ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం గంజాయి తరలింపుకు ఉపయోగించే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడం, అలాగే ఇతర అసాంఘిక కార్యకలాపాలను వెలికి తీయడమే నన్నారు. అటువంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ పర్యవేక్షణ కార్యక్రమశీ నిరంతరం కొనసాగుతుందని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని రూరల్ సీఐ కోరారు.

# నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపిన శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా విద్యాశాఖ మంత్రిర్యులు శ్రీ నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపిన శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు**



**సబ్బవరం, పిబ్రవరి 12, మనసులో మాట :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పి బి వి ఎస్ ఎన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని, వారికి అండగా నిలిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ విద్యాపట్ల నిబద్ధతకు నిదర్శనం యువ గళం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్న ఆయనపై యువతకు మరియు విద్యార్థులకు విశ్వాసం మరింత పెరిగింది ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో అనేక మంది విద్యార్థులు విద్యను మధ్యలోనే నిలిపి వేయాల్సిన పరిస్థితి నుంచి బయటపడ్డారని, వారి భవిష్యత్తుకు ఈ నిర్ణయం గొప్ప భరోసా కల్పించింది కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లే చేసి చూపిస్తాం దనడానికి ఇది స్పష్టమైన నిదర్శనం ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థులందరి తరఫున విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని శాప్ డైరెక్టర్ పి బి వి ఎస్ ఎన్ రాజు తెలిపారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ప్రజా సమస్యలు పరిష్కారానికి అండగా నిలుస్తున్న జనసేన

- అనకాపల్లి జనసేన ఇంచార్జి భీమరశెట్టి రాంకీ కు వివిధ సమస్యలు పై వినతి



**అనకాపల్లి, ఫిబ్రవరి 12 (మనసు లో మాట) :** అనకాపల్లి రింగ్ రోడ్డు లోని జనసేన కార్యాలయంలో గురువారం పలువురు వివిధ ప్రజా సమస్యల పై అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ కు వినతిపత్రాలు అందజేశారు. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రజలు, కూటమి కార్యకర్తలు నుంచి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన రాంకీ వీటన్నిటిని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంకీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

# రైతులకు అందుబాటులో క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు


- రైతులకు చేరువగా ఆధునిక సాంకేతికత.
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



**పాడేరు ఫిబ్రవరి 12: ( మనసులో మాట ):** వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ, రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ గారు ప్రకటించారు. ఈ రోజుఉదయం తన ఛాంబర్ లో వ్యవసాయ, ఉద్యానవన, ఇందుకు సంబంధించిన శాఖ అధికారంతో కలిసి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ ద్వారా రైతులు వ్యవసాయ ఇతర కార్యక్రమాలకు సంబంధించి తమ పొలాల్లో ఎరువులు, పురుగుమందులను డ్రోన్ల ద్వారా అతి తక్కువ సమయంలో, సమానంగా పిచికారి చేసుకోవచ్చునాని,ఇది నేరుగా మొక్కలపై పడటం వల్ల మందు వృధా కాదని, రైతులకు పని సమయము వృధా కాకుండా పారదర్శకత ఉంటుందని పేర్కొన్నారు. రైతులు సులభమైన బుకింగ్ ఫోన్ ద్వారా చేసుకోవచ్చు అన్నారు. ఫోన్ ద్వారా క్యాబ్‌లను ఎలా బుక్ చేసుకుంటామో, అదే విధంగా రైతులు తమ మొబైల్ యాప్ లేదా కాల్ సెంటర్ ద్వారా డ్రోన్ సేవలను తమకు కావలసిన సమయానికి బుక్ చేసుకోవచ్చునాని, ఇందుకు సమయం, కూలీల ఆదా అవుతుందని, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న కూలీల కొరతను అధిగమించేందుకు ఈ సాంకేతికత ఎంతగానో దోహదపడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని పూర్తి చేయడం ద్వారా రైతులకు సమయం, శ్రమ రెండు ఆదా అవుతుందని తెలిపారు. పెట్టుబడి ఖర్చు తగ్గుదల డ్రోన్ల వినియోగం వల్ల ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గడమే కాకుండా, ఆరోగ్యపరంగా కూడా పిచికారి చేసే వారికి ఎటువంటి ప్రమాదం ఉండదని తెలిపారు. రైతులం దరూ ఈ ఆధునిక సాంకే తికతను అంది పుచ్చుకుని తక్కువ ఖర్చుతో అధిక లాభాలు గడించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిఎస్ బి ఎస్ నందు, ఉద్యానవన శాఖ అధికారి కే బాలకర్ణ, స్పైసెస్ బోర్డు అధికారి కళ్యాణి, అసిస్టెంట్ డైరెక్టర్ కాఫీ విభాగ అధికారి బూంజు బాబు, సాంకేతిక నిపుణులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శివరాత్రి... బందోబస్త్ పై అప్రమత్తం గా...ఉండాలి

## విశాఖపట్నం రేంజ్ ఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి



**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట): ఫిబ్రవరి:12:** విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి విశాఖపట్నం రేంజ్ పరిధి లో గల అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విజయనగరం , పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా ల యస్.పి లతో పాటు ఏడ్ ఏ స్పీ,డి.యస్.పి, అధికార్లతో పాటు వీడియొ కాన్ఫరెన్స్ ద్వారా మహాశివరాత్రి బందోబస్తు, చీణూా చట్టం, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా మరియు లా అండ్ ఆర్డర్ వాటిపై సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

### మహా శివరాత్రి బందోబస్త్ ఏర్పాట్లు :

మహాశివరాత్రి సందర్భంగా అన్ని శైవ క్షేత్రాలులలో భక్తులు రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఆయా జిల్లాల్లో ముఖ్య పుణ్యక్షేత్రాలను సందర్శించి, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో క్యూ లైన్ లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ప్రయాణ మార్గాలు, పార్కింగ్ లను గుర్తించి తగు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. క్యూలైన్ వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేస్తూ, వృద్ధులు , స్త్రీలు , పిల్లలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటులను అధికారుల సమన్వయంతో చేయాల్సి ఉంటుందని ఆదేశించారు.

### ఎన్ డి పి ఎస్ సమీక్ష:

ఒడిషా రాష్ట్రం నుండి మన ప్రాంతాలగుండా జరగుతున్న గంజాయి అక్రమ రవాణా ఒడిషా రాష్ట్రం సరిహద్దు గల మన రేంజ్ పరిధిలో ఉన్న అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిలాలు అడ్డుకట్ట వేయటానికి పటిష్టమైన ప్రాణాళికతో అరికట్టే విదంగా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి రేంజ్ పరిధిలో నివసిస్తూ గంజాయి అక్రమ రవాణా వ్యవస్థ ముఠా లను ఛేదించడానికి సమగ్రమైన ప్రణాళికా రూపొందించి వాటిని ఛేదించమని జిల్లా ాణూా లకు అడిషనల్ ా ా లకు తగిన ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. గంజాయితో పట్టుబడిన కేసుల్లో పటిష్టమైన దర్యాప్తు జరిపి నిందితులపై తగిన సాక్షాదారాలతో కోర్టులో చార్జి షీట్లు వేసి సునిశితంగా పర్యవేక్షించడం వల్ల జూన్ 2024 నుండి ఇప్పటివరకు మొత్తం 52 కేసుల్లో 98 మంది నేరస్తులకు కోర్టులు శిక్షలు పడ్డాయి. నేరస్తులకు కఠిన కారాగార శిక్ష పడేలా దర్యాప్తును అత్యంత పకడ్బందీగా నిర్వహించి కృషి చేసిన దర్యాప్తు అధికారులకు రివార్డ్ లు (గుడ్ సర్విస్ ఎంట్రీ) ఇవ్వడం జరిగినది. కేసులను ఛేదించే విధంగా మరియు గంజాయి రవాణా అరికట్టడం గురించి అంతరాష్ట్ర అధికారులతో ప్రతినెలా సమన్వయ సమావేశం నిర్వహించడం జరుగుతుంది. గంజాయి కేసులో నిందితులుగా ఉండి తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేయమని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమైనది.అక్రమ గంజాయి రవాణా వ్యాపారం చేసే 14 మంది నేరస్తులకి చెందిన 9,19,17,290/- రూపాయల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం జరిగినది. గంజాయి అక్రమ రవాణాలో పాల్గొంటున్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి, ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. పదే పదే నేరాలకు పాల్పడుతున్న వారిపై 1602 మంది గంజాయి నేరస్తుల కదలికల మీద నిఘా కోసం హిస్టరీ షీట్స్ తెరవడం జరిగినది. మరియు 92 మంది ముద్దాయి ల మీద ాు చీణూా చట్టం ప్రయోగించడానికి ప్రతిపాదించడం జరిగినది. 64 ప్రత్యేక బృందాలు గా ఏర్పడి 447 మంది పరారీలో ఉన్న నేరస్థులను మరియు నాన్ బెయిల్ బుల్ వారెంట్స్ పెండింగ్ లో ఉన్న 332 ముద్దాయి లను పట్టుకొని కోర్టు లో ప్రవేశ పెట్టడం జరిగినది. సైబర్ నేరాల కేసులను సమీక్షించి బాధితులు పోగొట్టుకొని, బ్యాంకుల్లో ఫ్రీజ్ అయిన మొత్తాన్ని ప్రత్యేక చొరవ చూపించి తిరిగి బాధితులకు సంబంధిత కోర్టుల అనుమతి ద్వారా ఆలస్యం చేయకుండా అందేటట్లు చూడాలని ఆదేశించినారు. డిజిటల్ అరెస్ట్ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ట్రాఫిక్ చలానా, ఎస్బిఐ యోనో, వాలంటైన్స్ డే సర్ప్రైస్ వంటి ఏ.పీ.కె. ఫైల్స్ ద్వారా జరుగుతున్న మోసాల పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని, ఒకవేళ సైబర్ మోసం జరిగినట్లు తెలిసిన తక్షణమే సైబర్ పోర్టల్ లో గాని, హెల్ప్ లైన్ 1930 గాని కంప్లైంట్ చేస్తే పోగొట్టుకున్న మొత్తాన్ని ఫ్రీజ్ చేయడానికి అవకాశం కలదు అనే విషయంపై విస్తృత ప్రచారము సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్స్ ద్వారా అన్ని వర్గాల వారికి చేరాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్య ప్రచారాలు చేయరాదని, అభ్యంతరకర, అసభ్య పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరచూ పోస్టులు పెట్టిన 11 మందిని మరియు ఫేక్ అకౌంట్స్ ఐడెంటిఫై చేయడమైనదని, వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు ఇప్పటికే నలుగురి పై హిస్టరీ షీట్స్ ఓపెన్ చేయడమైనదని తెలియజేసినారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటూ, డ్రంకెన్ డ్రైవ్ పై కటినంగా వ్యవహరించాలని ఆదేశించడం అయింది. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ ని పెంచటంతో పాటు పాతనేరస్తులు అంతర్రాష్ట్ర ముఠా కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని కోరారు ఈవ్ టీజింగ్, పబ్లిక్ డ్రింకింగ్ వంటి నేరాలను సీసీ కెమెరాలు డ్రోన్ కెమెరాలను సమర్థంగా ఉపయోగించి పట్టుకోవాలని ఆదేశించారు.

# రైతు, కార్మిక దేశవ్యాప్త సమ్మె సందర్భంగా భారీ ర్యాలీ

## సిఐటియు




**అచ్యుతాపురం ఫిబ్రవరి 12 మనసులో మాట :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ లు, రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఈరోజు లేబర్ కోడ్ లు వల్ల కార్మికులకు ఉరి అనే వినూత్న కార్యక్రమం నిర్వహించి అచ్చుతాపురంలో భారీ ర్యాలీ , సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కౌలు రైతు సంఘం నాయకులు కే రామ సదాశివరావు, మండల కన్వీనర్ కే సోము నాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ లు రద్దయ్యేంతవరకు పోరాడుతామని కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని రైతులు పండించే పంటలుకు గిట్టుబాటు ధర కల్పించి నూతన విద్యుత్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు నారాయణమ్మ వరలక్ష్మి సత్యవతి ,ఆశా యూనియన్ నాయకులు ఉమ్మడి దేవుడమ్మ మంగమ్మ ,వీఆర్ఏ నాయకులు శివలింగ కృష్ణ గాలి పరదేశి నాయుడు, ప్రైవేట్ స్కూల్స్ నాయకులు బొడ్డెడ రామ్కుమార్, కౌలు రైతు సంఘం నాయకులు శరగడం రామనాయుడు, ఆటో యూనియన్ నాయకులు కర్రినాయుడు తట్టా రాజు ,ఐకెపి నాయకులు లావణ్య దేవి, పంచాయతీ కార్మికులు శ్రీరాములు నాగమణి ,ఎస్ ఈ జడ్ కార్మికులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీలు



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** మండల కేంద్రం మునగపాక అనకాపల్లి పూడిమడక రోడ్లు స్థానిక పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు నిబంధనలను అధిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానికే ఎస్సై పి ప్రసాదరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా వాహనదారుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయాలని, వాహనదారులతో ప్రసాదరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయం కావడం వల్లే ఎక్కువ మంది చనిపోతున్నారని, కేవలం జరిమానాల భయంతో కాకుండా సొంత రక్షణ కోసమే హెల్మెట్లు ధరించాలని ఆయన సూచించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్ సి, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసే వారిపై 50 మంది వాహనాలను తనిఖీలు నిర్వహించి 45 మందికి అపరాధ రుసుము విధించామని ప్రసాదరావు తెలిపారు. ప్రమాదాల శాతం తగ్గించేందుకే ఇలాంటి తనిఖీలు అవగాహన కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు.

# దేశవ్యాప్త సమ్మె విజయవంతం.



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 12, (మనసులో మాట):** నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలంటూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వామపక్షాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. సమ్మె సందర్భంగా మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బీహార్ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని గ్యారెంటీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన, వైసిపి పార్టీలు పార్లమెంట్లో లేబర్ కోడ్లకు అనుకూలంగా ఓటు వేశారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.వి.రమణ అందించిన సేవలు చిరస్మరణీయం



**మునగపాక, ఫిబ్రవరి 12, మనసులో మాట :** నివాళులర్పిస్తున్న తిమ్మరాజుపేట గ్రామస్తులు మండలంలో గల మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్.వి.రమణ గ్రామానికి అందించిన సేవలు శిరస్మరణీయంగా నిలుస్తాయని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు గుర్తు చేశారు. 23 సంవత్సరాలుగా ఆయన వర్ధంతి వేడుకలను గ్రామస్తులు ఎంత వేడుకగా నిర్ణయించుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్వి రమణ కుమారుడు ప్రస్తుతం డిఎల్డిఓ గా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి రమణ భార్య కుటుంబ సభ్యులు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము దంపతులు, బివి రమణ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గురుకులం ప్రహరి గోడలు నాణ్యత లోపం

## పట్టించుకోని అధికారులు...



**పెదబయలు ఫిబ్రవరి 12 మనసులో మాట :** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం లో సీతగుంట పంచాయతీ రోగులపేట గురుకుల కళాశాల పాఠశాల చుట్టుపక్కల ప్రహరి గత నెల నుండి ప్రారంభించారు. చుట్టుపక్కల కాంట్రాక్టు గుత్తేదారులు సిమెంటు ఇసుక మెటీరియల్ రోడ్డుకి ఇరువైపులా ప్రహరి నీరు కూడా వెయ్యని దాఖలాలు లేదని ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు తో ప్రహరి నిర్మిస్తున్నప్పటికీ కనీస నాణ్యత లేదని ఎవరి ఇష్టం వాళ్ళదే నిర్మించు కుంటూ ప్రజాప్రతి నిధులుకు కూడా తెలియ కుండానే నిర్మిస్తు న్నారు.నీటి సదుపాయంతో చేయకుండా నాణ్యత ప్రమాణాలు లోపిస్తూ ప్రహరి గోడలు కేవలం సిమెంట్ ఇసుకతో పూర్తిగా కంకర నిర్మాణం లేకుండానే వాటరింగ్ సదుపాయం లేదని చుట్టుపక్కల వాసులు అంటున్నారు. ఇలా అయితే గోడలు పూర్తిస్థాయిగా ఉండదని నిర్మించిన కొద్ది రోజులకే కూలిపోయే ప్రమాదం ఉందని, ఒక కోటి రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపణ ఎప్పటికైనా స్పందించి మండల సంబంధిత అధికారులు తక్షణమే చొరవ చూపించి నాణ్యతాలు పూర్తిస్థాయిగా జరిగేలా చర్యలు చేపట్టాలని చుట్టుపక్కల వాసులు కోరుతున్నారు

# వైసీపి రాష్ట్ర ప్రచార విభాగం సెక్రటరీగా కాపు శెట్టి శేషుబాబు



**సబ్బవరం, పిబ్రవరి 12, మనసులో మాట:** రాష్ట్ర వైఎస్ఆర్సిపి ప్రచార విభాగం సెక్రటరీగా పెందుర్తి నియోజకవర్గం, ఆసకపల్లి గ్రామానికి చెందిన మాజీ ఆర్ఇసిఎస్ వైస్ చైర్మన్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుండి తనకు నియామక పత్రం అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రచార విభాగం సెక్రటరీగా పదవి ఇచ్చినందుకు తాను శక్తివంచన లేకుండా వైఎస్ఆర్సిపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా వైసీపీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ కు,మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కు, పెందుర్తి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు, ఎంపీపీ భోకం సూర్య కుమారి, గండి రవి కుమార్ కు నియోజవర్గం వైసీపీ నేతలకు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ సర్పంచ్ బూడి వెంకునాయుడుకు ఘన నివాళులు



**దేవరాపల్లి, ఫిబ్రవరి 12, (మనసులో మాట)** : తారువ మాజీ సర్పంచ్ స్వర్గీయ బూడి వెంకునాయుడు 20వ వర్ధంతి కార్యక్రమాన్ని తారువలో గురువారం అతని కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకునాయుడు చిత్రపటం వద్ద ఆయన తనయుడు మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు, వైఎస్సార్సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ తదితర కుటుంబ సభ్యులు నివాళులర్పించి, పుష్పాంజలి ఘటించారు. స్థానిక గ్రామ పెద్దలు, ప్రజలు ఘనంగా నివాళులర్పించి, గ్రామాభివృద్ధికి సుధీర్ఘ కాలం పాటు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గ్రామస్తులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి మహలక్ష్మీ నాయుడు, డోకల ఎరుకునాయుడు, బవిరిశెట్టి సతీష్, వర్రి గోవింద, కొమ్మనాపల్లి ప్రసాద్, చొప్పా శ్రీను, రెడ్డి అచ్యుతరావు, పెనగంటి సన్యాశినాయుడు తదితర్లు పాల్గొన్నారు.

# మండలానికి మరో మద్యం దుఖాణం

## ఎక్సైజ్ సిఐ పాపునాయుడు



**చోడవరం, ఫిబ్రవరి 12(మనసులో మాట ):** మండల పరిధిలో అదనంగా మరో మద్యం దుఖాణం ఏర్పాటు నకు ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసిందని దీని కోసం ధరఖాస్తులు కోరుతున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.వి.పాపునాయుడు తెలిపారు . కొత్త గా మంజూరు చేయనున్న దుఖాణాన్ని ఈ నెల 23 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు నిర్వహించడానికి అనుమతి ఉంటుందని అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ సుధీర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకుని ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5గంటల లోగా నిబంధనలకు లోబడి సబ్మిట్ చేసుకోవలసిందిగా ఆయన వివరించారు .23వ తేదీన ఉదయం 8 గంటలకు లాటరీ పద్దతిలో లైసెన్స్ ధరఖాస్తుదారు ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు .


# బవులవాడ లో ఘనంగా దుర్గాలమ్మ జాతర మహోత్సవం

## అమ్మవారి ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్



**అనకాపల్లి, ఫిబ్రవరి 12 (మనసు లో మాట)** : అనకాపల్లి మండలం బవులవాడ లోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందు గా మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుముందు డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, తెలుగుదేశం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు నాగజగదీష్ కు స్వాగతం పలికి శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి భోగలింగేశ్వర స్వామి దేవస్థాన చైర్మెన్ కాండ్రేగుల సత్యనారాయణ, కూటమి నాయకులు బోడి వెంకటరావు, చెక్కల శ్రీను, కోట్ని ఈశ్వరరావు, రేబాక ఈశ్వరరావు, కూటమి పార్టీ ల నాయకులు పాల్గొన్నారు.

# అమరావతిలో రాష్ట్ర రహదారుల మంత్రిని కలిసిన ప్రగడ



**అచ్చుతాపురం ఫిబ్రవరి 12 మనసులో మాట :** అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారులు మరియు భవనాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు మరియు డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్రంలో ఏపీ ఆర్ డి సి ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారులు నిర్మాణం మరియు చేపట్టబోవు రహదారుల కోసం చర్చించడం జరిగింది. అనంతరం అనకాపల్లి జిల్లాలో ఉన్న రహదారుల మ-రమ్మత్తుల పనుల కోసం ప్రత్యేకంగా చర్చించారు.

# విద్యార్థుల నడత పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలి

## ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్



**చోడవరం, ఫిబ్రవరి 12 (మనసులో మాట ):** విధ్యార్థుల చదువు పట్ల గాకుండా వారి నడత, అలవాట్లు పట్ల కూడా తల్లి దండ్రులు దృష్టి పెట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ సూచించారు . గురువారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు . విద్యార్థుల ప్రగతిని ఏ రోజైనా వచ్చి తెలుసుకో వచ్చిన అందుకు అధ్యాపకులు అందుబాటులో ఉంటారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఐవివి సత్యవతి మాట్లాడుతూ ఇటువంటి సమావేశాల ద్వారా తమ విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ కు అవకాశాలు మెరుగుపరచు కో వచ్చిన సూచించారు . తల్లిదండ్రులు రవి గణేష్, ఎం.గాయత్రి సమావేశం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు

# లేబర్ కోడ్ లు రద్దు చేయాలి-దేశవ్యాప్త సమ్మెలో సీఐటీయూ డిమాండ్




**కొయ్యూరు ఫిబ్రవరి 12 (మనసులో మాట):** ఈరోజు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కార్యక్రమం జరిగింది. ఈ సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్, ఆశా వర్కర్స్, సీహెచ్‌డబ్ల్యూ, మిడ్ డే మీల్స్ సిబ్బంది,వీఓఏ లు తదితర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమ్మె సందర్భంగా ముందుగా ర్యాలీ నిర్వహించగా, అనంతరం సభ జరిగింది.ఈ సభను ఉద్దేశించి సీఐటీయూ నాయకులు ఎస్. సూరిబాబు మాట్లాడుతూ, కార్మికులకు నష్టదాయకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు.లేబర్ కోడ్ల అమలుతో కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారిందని, కార్మికు లకు సమ్మె, ధర్నాలు, నిరసనలు తెలిపే హక్కు కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. లేబర్ కోడ్లు అమలైతే కార్మిక వర్గాన్ని మరింత దోచుకునే అవకాశం పెరుగుతుందని పేర్కొన్నారు.అలాగే స్కీం వర్కర్లైన అంగన్వాడీ, ఆశా, సీహెచ్‌డబ్ల్యూ, మిడ్‌డే మీల్స్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించి తక్కువ వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు.కనీస వేతనాలు అమలు చేయడం లేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు.సుప్రీంకోర్టు, అంతర్జాతీయ లేబర్ కోర్టు, ఆర్థిక కమిటీ ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. స్కీం వం-ర్కర్లందరికీ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, జీతంలో సగం రిటైర్మెంట్ పెన్షన్‌గా ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని స్కీం వర్కర్లకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీహెచ్‌డబ్ల్యూ ఉద్యోగులను ఆశా వం-ర్కర్లుగా మార్చాలని కోరారు.మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరును మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం తీసుకొచ్చిన జాతిపిత గాంధీ పేరు తొలగిం చడాన్ని ఖండిస్తున్నామన్నారు.ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కొత్త చట్టం తెచ్చారని, ప్రజలంతా చైతన్యవంతమై ఆ చట్టాన్ని రద్దు చేయించాలని పిలుపునిచ్చారు. పాత చట్టాన్ని కొనసాగించాలని, లేకపోతే ప్రజలు పని హక్కు కోల్పోతారని హెచ్చరించారు. కార్మికులు, రైతులు ఐక్యమై పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తులబడ ప్రసాద్, బొంజన్న, అంగన్వాడీ నాయకులు అచ్చియమ్మ, ముత్యాలమ్మ,అన్నపూర్ణ, మని, ఆశా నాయకురాలు అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పేరుతో దోపిడీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- హ్యూమన్ రైట్స్ కమిషను, ఆర్.టి.ఐ. అధికారుల పేరుతో దోపిడీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్.




**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట ):ఫిబ్రవరి 12:** ఇటీవల కొంతమంది వ్యక్తులు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషను, ఆర్.టి.ఐ. అధికారుల పేరుతో అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వ్యక్తుల గురించిన సమాచారం అందిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని, రౌడీ షీట్స్ తెరుస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఫిబ్రబరి 12న తీవ్రంగా హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - జాతీయ హ్యూమన్ రైట్స్ కమీషన్ గ్రామస్థాయిలో ఎవ్వరిని సభ్యులగా నియమించదన్నారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషను తమని సభ్యులుగా నియమించిందని, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని అమాయక ప్రజలను మభ్యపెట్టి, బలవంతంగా వారి నుండి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. అదే విధంగా మరికొంతమంది రైట్ టూ ఇన్ఫర్మేషన్ (ఆర్.టి.ఐ) అధికారుల పేరుతో గ్రామ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం లేదా చీ=జ, ూ=జ లేదా =× విభాగాలకు చెందిన అధికారులు ప్రైవేట్ వ్యక్తులను గ్రామ స్థాయిలో కార్యకర్తలుగా నియమించదన్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమైన చర్యలని, ఎవరైనా వ్యక్తులు చీ=జ, ూ=జ సభ్యులని గాని, =× అధికారులమని గాని గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయానికి గురిచేసి, ప్రజల నుండి డబ్బులు వసూళ్లకు పాల్పడితే డయల్ 100/112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విజ్ఞప్తి చేశారు. అటువంటి వ్యక్తులపై స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు అందితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారిపై నిఘా పెట్టేందుకు రౌడీ షీట్స్ తెరవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు.

# మోడీ నుండి కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పోరాటం

- 4 లేబర్ కోడ్లు అమలు జరిగితే మరో చికాగో పోరాటం తప్పదు.
- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు.
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రామకృష్ణ.




**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట): ఫిబ్రవరి 12:** కేంద్రంలో మోడీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి భారత దేశాన్ని కేవలం ఇద్దరు గుజరాతీయులు అదానీ, అంబానీల శ్రేయస్సు కోసం మాత్రమే పరిపాలన ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రామకృష్ణ లు విమర్శించారు.గురువారం ఉదయం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ కేంద్ర కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా సంఘాల పిలుపు మేరకు విజయనగరంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి గంట స్థంభం, కె. పి టెంపుల్, స్టేట్ బ్యాంక్ దగ్గర ఉన్న గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ముగింపు సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సమ్మెకు ముఖ్య అతిథిలుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రామకృష్ణ లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత 44 కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా చట్టాల్లో మార్పులు చేసి వేతన జీవులను కార్పొరేట్, పారిశ్రామికవేత్తలకు బానిసలుగా చేయడానికి దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలంలో ఎందరో కార్మికులు ప్రాణాలు త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కుని సైతం పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. 73 షెడ్యూల్లోని కార్మికులు మునిసిపల్ అంగన్వాడి ఆశా తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక చిరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీరి సమస్యలపై నిరసన తెలుపుకొనే అవకాశం కోల్పోతారన్నారు. ఇది ఒక రకంగా దేశంలో నిర్బంధ నిరంకుశ విధానాలను అవలంభించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లోడింగు అన్లోడింగ్, కాల్ గ్యాస్ డెలివరి బాయ్స్, ఆటో, హమాలి, వీధివిక్రయ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా అప్పచెపుతూ ఆదాని అంబానీ వర్గాల వారికి పన్నులు తగ్గిస్తూ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన మోడీ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈరోజున జరిగిన సమ్మె ద్వారా మోడీ ప్రభువ్వానికి ఒక హెచ్చరిక అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కార్మిక హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న కార్పొరేట్ వర్గాల తీరుపై ఉద్యమించడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయని అందులో భాగంగానే డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా దేశంలో అసమానతలు, పేదరికం పెరిగిపోతున్నాయని, పేదల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండగా ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని ప్రయత్నిస్తు న్నారన్నారు. అదే జరిగితే కార్మికులు కట్టు బానిసలుగా మారిపోతారని అన్నారు. కార్మికులకు సంఘాలు పెట్టుకునే హక్కు,సమ్మె హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే సాంకేతికత పేరుతో కార్మికవర్గం పై ఒత్తిడి పెంచుతున్నారని ఎనిమిది గంటల పని విధానం కుంటుపడుతోందన్నారు. పనిగంటలు పెంచడంతోపాటు వర్క్ ఫ్రం హోం లో పేరుతో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్మిక వర్గ హక్కులపై నిరంకుశ దాడులకు పాల్పడుతున్న పాలకవర్గాల తీరును ప్రతిఘటించడం కోసం కార్మిక,ఉద్యోగ వర్గాలు ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రైతాంగ హక్కులపై ప్రయోగించడానికి మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చారని రైతు సంఘాల సుదీర్ఘ సమరసిల పోరాటాల ఫలితంగా కేంద్రం దిగివచ్చి వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది అన్నారు. పంటల గిట్టుబాటు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని రైతాంగం డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఈ రకమైన వైఖరిని అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ప్రజలను మోసగించే చర్యలకు పాల్పడుతుందన్నారు. సమస్యల నుండి ప్రజల దృష్టిని మరలించడం కోసం మతతత్వ రాజకీయాలకు మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల పరం చేసి కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కార్మిక వర్గం ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం ముగింపు సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎ.ఐ.వై.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, జిల్లా ఉపాధ్యక్షుడు వెలగాడ రాజేష్, ఎ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా నాయకులు సుమన్, ఎ. చరణ్, బ్యాంక్ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ, ఎఐబిఇఎ జిల్లా అధ్యక్షుడు బి.వి ప్రసాద్, కార్యదర్శి కె. మురళి శ్రీనివాస్, రవికుమార్, శ్రావణ్, ఏఐటీయూసీ నాయకులు ఆల్తి మారయ్య, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఏ.రాములు, విజయనగరం పట్టణంలో పి.డబ్ల్యూ మార్కెట్ కార్మికులు, కాల్ గ్యాస్ కార్మికులు, డాల్ మిల్స్ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, టింబర్ మార్కెట్ కార్మికులు, డిసిఎంఎస్ కార్మికులు, మహేశ్వరి ఫ్లోర్ మిల్, ట్రాన్స్పోర్ట్ కార్మికులు, సిమెంట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వాల నుంచి ఎలాంటి భద్రత లేకపోయిన పీడిత ప్రజల కోసం నిలబడుతున్న జర్నలిస్టు కార్మికులు ఈ రోజు జరిగిన కార్మికవర్గ సమ్మె పోరాటాన్ని అధికారంతో కళ్ళు మూసుకుని చలనం లేకుండా ఉన్న ప్రభుత్వ పాలకుల కళ్ళకి కనిపించేట్టు, వారి చెవులకి పట్టిన తుప్పుని వదలగొట్టడానికి పదునెక్కిన కలంతో, ఎరుపెక్కిన కేమెరా కళ్ళతో కార్మికులలో కలిసి అడుగులేసిన జర్నలిస్టు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

# కాశీపురంలో అక్షరాంధ్ర కార్యక్రమంపై అవగాహన

**దేవరాపల్లి, ఫిబ్రవరి 12, (మనసులో మాట) :** మండలంలోని కాశీపురం గ్రామంలో గురువారం అక్షరాంధ్ర కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం. వి. సువర్ణరాజు మాట్లాడుతూ..మహిళల విద్య కుటుంబాభివృద్ధికి మూలస్థంభమని పేర్కొన్నారు. కనీస చదువు, రాత, లెక్కలపై అవగాహన కలిగి ఉంటే మహిళలు స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదుగుతారని వివరించారు. బస్సుల పేర్లు చదవడం నుంచి బ్యాంకులలో వోచర్లు నింపడం వరకు విద్య అవసరమని ఆయన ఉదహరించారు. ప్రభుత్వం డ్వాక్రా సమూహాలకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలంటే చదువు తప్పనిసరి అని చెప్పారు. ప్రతి మహిళ చదువుకుంటే కుటుంబం ఆర్థికంగా బలపడటమే కాక గ్రామ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ప్రభాకర్, స్వచ్ఛ భారత్ మండల సమన్వయకర్త విపివి త్రినాథ్, వెలుగు సిఆర్పి పైడిబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# వైభవంగా యూనియన్ బ్యాంక్ 'కార్ కార్నివాల్'




**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి (మనసులోమాట )::ఫిబ్రవరి 12:** లియూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయనగరం రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో గురువారం కంటోన్మెంట్ శాఖ (=ఁదీ జంక్షన్) వద్ద నిర్వహించిన 'కార్ కార్నివాల్'(కార్ లోన్ మేళా) అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్ కె దాస్, రీజినల్ మేనేజర్ శ జితేంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి అధికారి కంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా జరిగిన సభలో జనరల్ మేనేజర్ దాస్ మాట్లాడుతూ, సామాన్యుల కు కూడా కారు కలని నిజం చేసేలా యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో వాహన రుణాలను అందిస్తోందని, ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన రుణాలను మంజూరు చేయడమే మా లక్ష్యమని, తెలిపారు. రీజినల్ మేనేజర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ అందిస్తున్న వాహన రుణ సదుపాయాన్ని ప్రజలు విస్తృతంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ వేదికగా కొత్తగా వాహన రుణాలు పొందిన పలువురు ఖాతాదారులకు బ్యాంక్ జనరల్ మేనేజర్ రీజినల్ మేనేజర్ స్వయంగా ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను మరియు కారు తాళాలను అందజేశారు. కారు కీలు అందుకున్న ఖాతాదారులు బ్యాంక్ అందిస్తున్న వేగవంతమైన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథులు: ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ బ్యాంకు శాఖల మేనేజర్స్ మరియు రీజినల్ ఆఫీసు ఉన్నత అధికారులు చీఫ్ మేనేజర్స్ పార్థసారథి, మనిష్ కుమార్ సాగర్, ప్రియంవద శ్రీ పృథ్వీ లక్ష్మి ప్రియ, సౌమ్య కాంత దాస్ వివిధ విభాగాల ఉన్నతాధికారులు, బ్యాంక్ సిబ్బంది,వాహన డీలర్లు మరియు పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.కార్యక్రమ చివరలో బ్యాంక్ మేనేజర్ పి.ఎస్. మల్లేశ్వర రావు విచ్చేసిన అతిథులకు మరియు ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేశవ్యాప్త సమ్మె రాంబిల్లిలో విజయవంతం

**సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు ఆధ్వర్యంలో**

**రాంబిల్లి ఫిబ్రవరి 12 (మనస్సులో మాట) :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం రాంబిల్లి మండలంలోని వాడను నరసాపురం వద్ద నేవెల్ గేటు ముందు కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకోను నిర్వహించారు. ఈ కార్యక్రమం సిపిఎం మండల కార్యదర్శి జి దేముడు నాయుడు ఆధ్వర్యంలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవుడు నాయుడు మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్ రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 పెంచాలని, కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని, స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, మహాత్మ జాతీయ




గ్రామీణ ఉపాధి పథకం పాత చట్టాన్ని కొనసాగించాలని, స్థానికులకు ఎస్సీ జడ్, ఎన్ ఏ ఓ బి లలో మొదట ప్రాధాన్యతగా ఉపాధి కల్పించాలని, ఫార్మా కంపెనీలో ప్రమాదాలపై తగు చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి దేమున్నాయుడు ఆధ్వర్యంలో రాంబిల్లి సెంటర్లో రాస్తారోకో మానవహారం చేసి, సెంటర్ నుండి రాంబిల్లి తహసిల్దార్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు మండల కన్వీనర్, చందక రామకృష్ణ, నాయకులు వై రాము, సిహెచ్ శివాజీ, బి భాస్కరరావు, ఐద్వా జిల్లా నాయకులు ఐద్వ మండల కార్యదర్శి, సిహెచ్ మంగతాయారు, రైతు నాయకుడు సమ్మెట్ల రాము అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, శానిటేషన్, ముఠా, ఆటో, భవన నిర్మాణ, లారీ డ్రైవర్స్, ఎస్సీ జడ్, ఎన్ ఏ ఓ బి రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# దేవరాపల్లిలో దేశవ్యాప్త సమ్మె విజయవంతం




**దేవరాపల్లి, ఫిబ్రవరి 12, (మనసులో మాట) :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, ఉపాధి గ్యారెంటీ చట్టం రద్దు, పనిగంటలు పెంపు వంటి వాటికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం నుండి కాలేజీ మీదుగా రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్లు జంక్షన్ లో మానవహారం చేపట్టిన అనంతరం సిఐటియు మండల కార్యదర్శి బిటి దొర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న తదితరులు మట్లాడారు. నాలుగు లేబర్ కోడ్ లు వల్ల కార్మికులకు ఉరి తప్పదని తెలిపారు విటిని రద్దు చేసెంత వరకు పోరాడు తామని అన్నారు కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని రైతులు పండించే పంటలుకు గిట్టుబాటు ధర కల్పించి నూతన విద్యుత్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు మహాత్మగాంది జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కోనసాగించాలని కొత్తగా తీసుకు వచ్చిన విబిజీరామ్ పథకాన్ని రద్దు చేయాలని ఉపాధి కి బడ్జెట్ లో లక్ష కోట్లు కేటాయించాలని స్కీమ్ వర్క్ కు కనీస వేతనాలు పెంచాలని 12 గంటలు పనివిదానం రద్దు చేయాలని కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో కె సూరిబాబు, జి. రాము, సృజన, జి. వెంకటి, యస్. పద్మ, జి వరలక్ష్మి, వి. గౌరి, సన్యాసమ్మ, జయలక్ష్మి, కోమలి, పద్మ, సిహెచ్. జ్యోతి, క్రిష్ణవేణి, రమణమ్మ, కమల, పి ఈశ్వరమ్మ, అవతారం, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# తిలో పిడికెడు..తలో పాపం....గిరిజన ఉద్యోగ రిజర్వేషన్ల కథాకమామిషు


**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి: (మనసులో మాట): ఫిబ్రవరి 12:** అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో గిరిజన ఉద్యోగాల విషయమై ప్రశ్నలు సంధించగా..వాటికి ససమాధానం మంత్రి సంధ్యారాణి ఇచ్చారు. అయితే ఇదే విషయమై గిరిజన సంఘాలు వివిధ సందర్భాలలో ఉద్యమాలు చేశారు. చివరకు న్యాయస్థానాల్లో కేసులు దాఖలా చేశారు. ఈ విషయమయి.."మనసులో మాట" బుధవారం ఒక కథనాన్ని ప్రచురించింది. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీలపై చిర్రి బాలరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సంధ్యారాణి సమాధానం ఇస్తూ....జనవరి 1వ తేదీ 2000 సంవత్సరంలో జీవో నెం.3 ప్రకారం గతంలో గిరిజన ఉద్యోగులను కేవలం గిరిజన ప్రాంతాల్లోనే నియమించడం లేదా బదిలీ చేయడం జరిగేది. అయితే సదరు జీవోను గత ప్రభుత్వం జగన్ రెడ్డి సర్కారు దీనిపై దృష్టి సారించకపోవడం వల్ల గౌరవ సుప్రీంకోర్టు 2020లో కొట్టివేసిన తరువాత గిరిజన ఉద్యోగుల బదిలీలు మరియు నియామకాలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి గిరిజన మరియు గిరిజనేతర ప్రాంతాలకు కూడా నిర్వహించబడుతున్నాయి.గిరిజనులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే జీవో నెంబర్ 3 ని చంద్రబాబు నాయుడు తీసుకొస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వంలో రద్దు చేయబడింది .షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో స్థానిక షెడ్యూల్డ్ తెగలకు వంద శాతం రిజర్వేషన్ కల్పిస్తూ..జనవరి 10వ తేదీ 2000 తేదీ గల జీవో 3ను చేబ్రోలు లీలా ప్రసాదరావు వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2020 లో రద్దు చేసింది.40 లక్షల మంది గిరిజనులు ఈ జీవో.3 కి ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారు.. నందమూరి తారక రామారావు పాలనలో 1986 నవంబర11-తేదీన జారీ చేసిన జి.ఎం.ఎస్. నం. 275 ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని అన్ని ఉపాధ్యాయ పదవులను ఎస్.టి.లకు కేటాయించారు. 10-01-2000 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ 5(1) ప్రకారం స్థానిక ఎస్.టి.లకు 100% రిజర్వేషన్ కల్పిస్తూ జి.ఎం.ఎస్. నం. 3 జారీ చేశారు.గత జగన్ ప్రభుత్వం కోర్టు కేసుల పరిష్కారంలో తగిన చొరవ తీసుకోకపోవడం వల్ల జీవో నం.3 రద్దుకు దారి తీసిందని మంత్రి విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 మరియు 16(4) ప్రకారం 100% రిజర్వేషన్ అనుమతించబడదని, 50% పరిమితిని మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. 5వ షెడ్యూల్ 5(1) ప్రకారం గవర్నర్కు ఉన్న అధికారాలు కొత్త




చట్టాలను రూపొందించే వరకు విస్తరించవు. 1986 నుండి జరిగిన నియామకాలను కోర్టు షరతులతో సమర్థించింది. అయితే భవిష్యత్తులో రిజర్వేషన్ పరిమితులను ఉల్లంఘించరాదని హెచ్చరిం చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు జీవో నో 3 పునరుద్ధరణపై ప్రజా సంప్రదింపులు నిర్వహించబడ్డాయి.. వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, యూనియన్లు, న్యాయవాదులు మరియు మీడియా ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించబడి, ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. 100% రిజర్వేషన్ పునరుద్ధరణకు పరిష్కారాలపై చర్చించేందుకు గిరిజన ప్రతినిధులతో ఒక మేదోమథన సమావేశం నిర్వహించాలనే ప్రణాళిక ఉంది అని చెప్పారు.

# ఘనంగా విజయరామరాజుపేట మైడిమాంబ అమ్మవారు పండుగ

**అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణం, విజయరామరాజుపేట లో వేంచేసి ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు అలంకరణలు, బాణాసంచా వెలుగులు, సాంస్కృతిక కార్యక్ర మాలలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం నకు శాసన మండలి మాజీ సభ్యులు, జిల్లా టిడిపి పార్టీ మాజీ అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారిని మరిడిమాంబ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం మండపంలో నాగ జగదీష్ ను శాలువాతో సత్కరించి మరియు తెలుగుదేశం నాయ కులకు కూడా కండువాలతో సత్కరించారు. ఈ సందర్భం గా భక్తులకు ప్రసాదాన్ని నాగ నాగ జగదీశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోడి వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, బొబ్బిలి సురేష్, కొయిలాడ



గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును కలిసిన నర్సీపట్నం జనసేన నాయకులు



**నర్సీపట్నం , ఫిబ్రవరి 12, ( మనసులో మాట) :** ఎం ఎల్ సి కొణిదెల నాగబాబు ను నర్సీపట్నం జనసేన నాయకులు గురువారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా అప్పన ఎన్ ఎస్ జి దొరబాబు నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీ లో చేస్తున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. నియోజకవర్గానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన అంశాలపై నాగబాబు తో చర్చించారు. నాయకులు లేవనెత్తిన కొన్ని సమస్యలపై నాగబాబు సానుకూలంగా స్పందించారని దొరబాబు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అందుబాటులో ఉండడానికి ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని సెలెక్ట్ చేసుకొని అక్కడ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశానని, త్వరలో ఉత్తరాంధ్ర లో అన్ని నియోజవర్గాలని పర్యటిస్తానని, పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వాలు మరింత వృద్ధి పథంలో కొనసాగించాలని నాగబాబు సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ జనసేన పార్టీ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

# కాలేజీ విద్యార్థుల తో సమావేశాలు నిర్వహించాలి

**లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి**



**ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి:(మనసులోమాట:):ఫిబ్రవరి 12:** విజయనగరం జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కాలేజీ లో చదువుతున్న విద్యార్థుల తో పోలీసులు, జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించవలసిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు.గురువారం ఎస్పీని కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ,పట్టణప్రాంతాల్లో గంజాయి, మద్యం వినియోగం విపరీతంగా పెరిగి అరాచకాలు సృష్టించ బడుతున్నాయని పేరుకు చదువుకుంటున్నా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పెద్దలు, సమాజంపై గౌరవం కనిపించటం లేదని ముఖ్యంగా మైనర్ యువత సెల్ ఫోన్ లకు చిక్కిపోయారని మోటార్ బైక్ లను విచ్చలవిడిగా నడిపి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు, గంజాయి అరికట్టేందుకు జిల్లా పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారని కొన్ని చోట్ల చాక్లెట్లు,సిగరెట్లు రూపంలో కాలేజీలు, స్కూళ్లు పరిసరాల్లో అమ్ముతున్నారనే మాటలు వినిపిస్తున్నాయని వాటిని అరికట్టేందుకు సర్కారు దృష్టి సారించాలని కోరామని భీశెట్టి అన్నారు,చదువుకుంటున్న విద్యార్థులు వ్యక్తులను,వ్యవస్థను గౌరవించక పోతే జరిగే ప్రమాదాలను పోలీసులు చెపితేనే యువతకు అర్థం అవుతుందని అందుకే ఎస్పీ ని కోరామని,జిల్లా లో శాంతిభద్రతల పర్యవేక్షణ లో ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేక చర్యలు చేపట్టారని ఆయన అన్నారు.

# అక్షరాంధ్ర కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**- వేలిముద్రలకు స్వస్తి చెప్పండి**



**హుకుంపేట, ఫిబ్రవరి 12 (మనుసులో మాట) :** నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారితే వారి జీవితంలో కొత్త వెలుగు వెలుగుతుందని స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు శాఖ జిల్లా నోడల్ అధికారి పి.ఎస్. కుమార్ పేర్కొన్నారు. గురువారం రాత్రి హుకుంపేట మండలం కొంతిలి గ్రామంలోని అక్షరాంధ్ర కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అక్షరాలు నేర్చుకుంటున్న మహిళలతో మాట్లాడి, వారి చదువు పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా కుటుంబ, సమాజ ప్రగతికి కూడా దోహదపడుతుందని అన్నారు. ప్రతి మహిళా స్వయం ప్రతిభతో సంతకం చేయగలగాలి, అధికార కార్యాలయాల్లో వేలిముద్రలపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించగలగాలని సూచించారు. అక్షరాస్యత ఆత్మవిశ్వాసాన్ని పెంచి, హక్కులపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. అల్లూరి జిల్లా పరిధిలో ఎంపిక చేసిన 10 మండలాల్లో సుమారు 85 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, ప్రతి 10 మందికి ఒక వాలంటీర్‌ను జిల్లా కలెక్టర్ నియమించారని చెప్పారు. వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పాఠాలు బోధిస్తున్నారని వివరించారు. అక్షరాంధ్ర కేంద్రాలను సద్వినియోగం చేసుకుని అందరూ చదువులో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
ఆదివారం 2 నవంబర్ 2025



# గర్భధారణ పూర్వ, ప్రసవానికి ముందు లింగ నిర్ధారణ నిషేధ చట్టం అవుతుంది

**ఆర్డీవో మహేష్.**




**ధర్మవరం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** గర్భధారణ పూర్వా, ప్రశవానికి ముందు లింగ నిర్ధారణ చేయడం నిషేధ చట్టం అవుతుందని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేష్ ఆధ్వర్యంలో వైద్యులకు సిబ్బందికి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ భారతదేశంలో ఆడపిల్లల భ్రూణ హత్యలను నిరోధించడానికి లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి రూపొందించబడిన కీలకమైన చట్టం అని, ఇది అల్ట్రాసౌండ్ లేదా ఇతర పద్ధతుల ద్వారా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధిస్తుంది అన్నారు. నేరానికి పాల్పడిన వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తుంది అని తెలిపారు. అనంతరం పిసిపిఎన్డిటి చట్టం యొక్క ముఖ్య అంశాలు వారి వివరించారు.లింగ ఎంపిక, ప్రసవానికి ముందు లేదా గర్భధారణకు ముందు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం అన్నారు. ఈ చట్టం అల్ట్రాసోనోగ్రఫీ క్లినిక్‌లకు వర్తిస్తుంది అని తెలిపారు.క్లినిక్‌లు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందాలి అని రికార్డులను పక్కాగా నిర్వహించాలి అని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసే డాక్టర్లు లేదా సిబ్బందికి జైలు శిక్ష ,భారీ జరిమానా విధించబడుతుంది అని తెలిపారు.లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, దీనికి పాల్పడే వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ చట్టం ఆడపిల్లల హక్కులను కాపాడడంలో లింగ అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ చెన్నారెడ్డి డాక్టర్ నజీర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రావణి, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డిస్టిక్ హెల్త్ ఎడ్యుకేటర్ రామ్ లక్ష్మి , ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు పాల్గొన్నారు

# కంటిపట్ల విద్యార్థులు జాగ్రత్తలు వహించాలి

**ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప.**



**ధర్మవరం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** కంటిపట్ల విద్యార్థులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో గల ఎస్పీసీఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కంటి పరీక్షలలో 22 మంది పిల్లలకు కంటి దోషం ఉన్నందున, వారందరికీ పాఠశాల హెడ్మాస్టర్ పద్మావతి చేతుల మీదుగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణ, సురేష్, భాస్కర్, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ డి టి పరిరక్షణకు అఖిలపక్ష ఏకాభిప్రాయం

- రాస్తారోకో జాతీయ రహదారి దిగ్బంధం
- ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద ధర్నాకు పిలుపు




**అనంతపురం, ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) పరిరక్షణ కోసం అఖిలపక్ష నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.అవసరమైతే రాస్తారోకో, జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్డీటీకి ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) అనుమతి మంజూరు అయ్యే వరకు పోరాటం ఆగదని నాయకులు ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అవసరమైతే జాతీయ స్థాయిలో ప్రజాప్రతినిధులు, కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించి ఉద్యమాన్ని దేశ రాజధానికి తీసుకెళ్తామని జేఏసీ నాయకులు సాకే హరి, దశగానిపల్లి కుళ్లాయప్ప తెలిపారు. నాయకులు మాట్లాడుతూ, ఆర్డీటీ గత మూడు దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం, విద్యా సహాయం, వికలాంగుల పునరావాసం, ఆరోగ్య శిబిరాలు, కరువు నివారణ చర్యలు, తాగునీటి సదుపాయాలు వంటి అనేక సేవలను అందించిందని గుర్తుచేశారు. వేలాది పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించి సామాజిక మార్పుకు దోహదపడిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీడీపీ, వైఎస్సార్సీపీ, బీఎస్పీ, సీపీఎం (ఎంఎల్), ఎస్సీ జనసంఘం, ఎస్సీ--ఎస్టీ జేఏసీ, వెనుకబడిన తరగతుల సంఘం, పూసల సంఘం తదితర ప్రజా, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా అఖిలపక్ష తరఫున ఎస్సీ జనసంఘం రాష్ట్ర ఇన్‌చార్జి రామ్ ప్రసాద్, బీఎస్పీ ధర్మవరం ఇన్‌చార్జి సాకే వినయ్ కుమార్ హాజరయ్యారు. బేడ బుడగ జంగం శిరసాలా అంజి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ఎం.ఎం.డి బాషా, ఐఎమ్‌డి ఇమామ్, హనుమంతు, చౌదరి, డిస్కవర్ అనిల్ కుమార్ రెడ్డి, రామకృష్ణ, ఆర్డీటీ మాజీ ఉద్యోగులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు.**




**ధర్మవరం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు ఊడెగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇకనైనా మార్పు తెచ్చుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి వెన-ంవెంటనే కృషి చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు.పట్టణంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కళాజ్యోతి సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేతి వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమణ, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్,మీటర్ రీడర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, శ్రీనివాసులు, ఎలక్ట్రిషన్స్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు,లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, మహిళా సమైక్య నాయకులు లలితమ్మ తదితరులు పాల్గొని నిరసనను తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేటు, ప్రైవేటు కొమ్ముగాస్తు కార్మిక లోకాన్ని మరింత బానిసలుగా మార్చే కుట్రకు తెరలేపారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లు ను తెచ్చి కార్పొరేట్ ప్రైవేటు వ్యక్తులకు ఊడిగం చేసే పద్ధతుల్లో మోడీ ప్రభుత్వం అవలంబిస్తుందన్నారు. ఇప్పటికే అనేక రంగాలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ చేతుల్లో పెడుతున్నారని, కార్పొరేట్ లో లక్షల కోట్లకు అధిపతి అవుతున్నారే తప్ప ,కార్మికులు కార్మికులుగానే ఉంటున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం 26,000 రూపాయలు ఇవ్వాలని ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం కూడా అమలు పరచకుండా ఉండడం ఎంతవరకు సమంజసమని వారి ప్రశ్నించారు. వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అదేవిధంగా ఎనిమిది గంటల పని దినాలు ఉంటే దాన్ని 12 గంటలు పనులు చేసుకునే విధంగా చట్టాన్ని తీసుకొచ్చి కార్మికుల శ్రమ దోపిడికి కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని వారు దుయ్యబట్టారు.ఈ రాష్ట్రంలో సంఘటిత అసంఘటిత కార్మికులు సమస్యలు ఏమాత్రం కూడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోని పాపను పోలేదని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉన్నటువంటి కాంట్రాక్ట్ ఔర్సోర్సింగ్ కార్మికుల రెగ్యులర్ చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే ప్రభుత్వాలు ఏమాత్రం కూడా పట్టించుకోలేదని విమర్శించారు.


# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా ధర్మవరంలో భారీ ర్యాలీ ప్రదర్శన




**సిఐటియు.**

**ధర్మవరం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన నాలుగు 4 లేబర్ కోడ్లు, రద్దు చేయాలని. 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని, సిఐటియు ఇతర 12 ప్రజా సంఘాలు కలిపి తలపెట్టిన జాతీయ సమ్మెనుధర్మవరం ప్రాంతంలో సిఐటియు, ఏపీ రైతు సంఘం, ఏపీ చేనేతకార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల కార్మికులు భారీగా పాల్గొని ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ అయుబ్ ఖాన్,ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు భాషా, రైతు సంఘం నాయకులు ఏ మారుతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నామాల నాగార్జున, పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేష్ మాట్లాడుతూ నూతన ఉపాధిచట్టం (జి వి బి రామ్ జి) పథకాన్ని రద్దు చేయాలని ,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును కొనసాగించాలని , ఉపాధి హామీ పథకం సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని ,రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ 20.000/- రూపాయలు ఇవ్వాలని, అన్నిపంటలకు గిట్టుబాటుధరలుకల్పించాలని,అంగన్వాడి ,ఆశ, మిడ్ డే మీల్స్ ,వివో ఏ, ఆర్పి సమగ్ర శిక్ష నేషనల్ హెల్త్, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ రంగ ఉద్యోగులుగా గుర్తించాలని, బిల్డింగ్ ,ముఠా, ఆటో, ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ కు, పిఎస్, ఈ ఎస్ ఐ ఇన్సూరెన్స్ తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ముఖ్యంగా కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, జేవీ, రమణ, ఎస్, రఫీ. షేక్షావలి, అంగన్వాడీ నాయకులు చంద్రకళ ,దీన, అరుణ ,పోతక్క, సరస్వతి మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎం బాబు ముకుంద లక్ష్మీ ఓబులేసు ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ కార్మిక నాయకులు బొగ్గు నాగరాజు విద్యార్థి సంఘ నాయకులు నిరంజన్ అమన్,బత్తలపల్లి, సికేపల్లి ,కనగానపల్లి, రామగిరి మండల అంగన్వాడి వర్కర్స్, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**పెనుమూరు, ఫిబ్రవరి 12 ( మనసులో మాట) :** శ్రీ కమలాంబిక దేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజా రోహణముతో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వాచనం, నవగ్రహ హోమం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం మేళ తాళాల మధ్య శాస్త్రక్తంగా ధ్వజ రోహణం చేపట్టారు. బుధవారం వేడుకలకు జయ రామ నాయుడు, లంకిపల్లె ఈశ్వర ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి నాయుడు, రుద్రయ్య నాయుడు, మొరుం నాగేశ్వరరావు, జిల్లేడు రామమూర్తి, వీరపల్లె హరిబాబు నాయుడు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ యాక్ట్ కు వ్యతిరేకంగా ఎర్రబ్యాడ్జీలతో నిరసన..

**ఆర్టీసీ కార్మికులు.**




**ధర్మవరం ఫిబ్రవరి 12 (మనసులో మాట) :** రాష్ట్ర కమిటీ పిలుపుతో ధర్మవరం డిపోలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక కర్షక ఉద్యోగుల లేబర్ యాక్ట్ కు వ్యతిరేకంగా ఎర్రబాద్యులతో ఆర్టీసీ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ నాయకులు బుల్లె ఆదినారాయణ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ యాక్ట్ ను వెంటనే రద్దు చేయాలని లేనియెడల భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం అవుతుందని వారు హెచ్చరించారు. ఏలు గడిచిన ఆర్టీసీ కార్మికుల సమస్యలు తీరటం లేదని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు ఆపమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ముస్తాఫా, కార్యదర్శి తిరుమలేష్, సిస్టం సూపర్వైజర్ సుధాకర్, గ్యారేజీ కార్యదర్శి మల్లికార్జున,, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, నాయకులు జి ఎన్ స్వామి, నజీర్, సాహెబ్ శంకర్, రిటైర్డ్ వెల్ఫేర్ నాయకులు మిలిటరీ నరసింహులు తోపాటు అధిక సంఖ్యలో కార్మిక ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శుక్రవారం 13 ఫిబ్రవరి 2026



# సింగరేణి సీఎండీగా బుద్ధప్రకాశ్ బాధ్యతలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అధికారిక బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్ తెలంగాణ కేడర్‌కు చెందిన బుద్ధ ప్రకాష్ గతంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారు. రవాణా, భూమి రికార్డులు, సామాజిక సంక్షేమంలో విస్తృత అనుభవం ఆయనకు ఉంది. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల కమిషనర్ , ఇన్‌స్పెక్టర్ జనరల్, సర్వే సెటిల్మెంట్లు అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్, భూభారతి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

## కార్మిక చట్టాలకు నిరసనగా

# భారత్ బంద్



- తెలంగాణలో పలుచోట్ల ఆందోళనలు,
- సింగరేణిలో పూర్తిగా నిలిచిన పనులు
- ప్రభుత్వ, ప్రైవేటు సేవలకు అంతరాయం
- రవాణా రంగంలో కొంతమేర ప్రభావం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన భారత్ బంద్ తెలంగాణలో ప్రభావం చూపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కార్మిక సంఘాలు, రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళనలకు దిగడంతో సాధారణ జీవన విధానం కొంత మేర అంతరాయానికి గురైంది. సమ్మె ప్రభావంతో కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో హాజరు తగ్గింది. రవాణా రంగంలో కొంతమేర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో డ్రైవర్లు బస్సులు, ఆటోలు, కార్లను నిలిపివేసి బంద్‌కు మద్దతు ప్రకటించారు. రోడ్డుపై వాహనాలను ఆపడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల ప్రజలు కాలినడకన లేదా ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. సింగరేణి ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనడంతో కొంతమేర పనులు నిలిచిపోయాయి. బ్యాంకింగ్, బీమా, రవాణా రంగాల్లో కూడా సేవలకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా భారత్ బంద్‌కు కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు కార్మికులు, రైతులకు అనుకూలంగా లేవని ఆరోపిస్తూ ఈ సమ్మె చేపట్టినట్లు సంఘాల నేతలు తెలిపారు. ఇప్పటికే జనవరి 9న వివిధ కార్మిక సంఘాలు ఐక్యంగా దేశవ్యాప్త సమ్మె నిర్వహించాలని ప్రకటించాయి. అయితే రాష్ట్రంలో ఎక్కువచోట్ల పరిస్థితి ప్రశాంతంగానే కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. సమ్మె నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

### సింగరేణిలో కార్మిక సమ్మె ప్రభావం

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణి రామగుండం ఏరియాలోని ఆర్జీ-3, ఆర్జీ-2, ఏపీఏ ప్రాంతాల్లో పనులు పూర్తిగా స్థంభించాయి. పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనడంతో భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మెలో బీఎంఎస్ మినహా మిగతా అన్ని కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఉదయం నుంచే కార్మికులు విధులను బహిష్కరించి గనుల వద్ద ఆందోళనలు చేపట్టారు. గోదావరిఖని రెండో బొగ్గు గని ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల హక్కులు దెబ్బతింటాయని, ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న సింగరేణి బ్లాక్‌లను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సమ్మె ప్రభావంతో రామగుండం ఏరియాలో ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయినట్లు సమాచారం. ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



# ఎయిర్‌పోర్టులకు అనుమతులివ్వండి



### మామునూరు పనులు ప్రారంభించండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి సీఎం రేవంత్ వినతి
- కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపనకు ఆహ్వానం
- రక్షణ భూములను బదలాయింపు చేయాలని విన్నపం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు పనులు త్వరగా ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. తెలంగాణ రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు. భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలా బాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సిఎం వెంట ఎంపిలు కడియం కావ్య, మల్లు రవి తదితరులు ఉన్నారు.

### రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ భేటీ

మూసీ పునరుద్ధరణలో భాగంగా హైదరాబాద్‌లో నిర్మించబోతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు హాజరు కావాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. అలాగే ఈ ప్రాజెక్టుకు అవసరమైన రక్షణ భూములను బదలాయించాలని వేడుకున్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలంలో కార్యక్రమం చేపడుతున్నట్లు రక్షణ మంత్రికి సీఎం వివరించారు. 1948 ఫిబ్రవరిలో మహాత్ముని చితభస్మాన్ని ఈసా.. మూసీ సంగమ స్థలిలో నిమజ్జనం చేశారని కేంద్ర మంత్రికి తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు కేంద్ర మంత్రికి వివరించారు. అంతకు ముందు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. రాష్ట్ర రాజకీయాలు, పరిపాలన అంశాలపై పార్టీ పెద్దలతో చర్చించారు. దావోస్ పర్యటన, హార్వర్డ్ శిక్షణ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను వివరించారు. రేవంత్ రెడ్డి కొందరు కేంద్రమంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. పార్లమెంటుకు వెళ్లి ఎంపీలను కలిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు.

# పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

### అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలి

### ముందు జాగ్రత్త చర్యలపై అధికారులతో సీఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** భారీ పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు, కార్మికుల భద్రతకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, చర్యలపై స్పష్టమైన ఒక మాన్యువల్‌ను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన దుర్ఘటనపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కార్మికుల, బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు, కోర్టు కేసుల పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధి కారులతో సీఎస్ సమీక్ష చేశారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మధ్యతర, చిన్నతరహా పరిశ్రమలలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలలో వివిధ విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు రెగ్యులర్ మానిటరింగ్ ఉండే విధంగా అధికారులతో తనిఖీ నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే అన్ని విభాగాల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సి.ఎస్ అన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు, భద్రతా ఆడిట్, అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సి.ఎస్ సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సంజయ్ కుమార్, దాన కిషోర్, ఫైర్ సర్వీస్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్



అథారిటీ కమిషనర్ శశాంక, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ రవి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ హ్యాకథాన్ పోస్టర్, లోగో ఆవిష్కరణ

### గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు మంత్రి వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి12:** హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు పోస్టర్ / లోగోను మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, హ్యాకథాన్ నిర్వహకులు సందీప్ కుమార్ మక్తాలు ఆవిష్కరించారు. ప్రపంచంలోనే మొదటి, అతిపెద్ద స్టేడియం స్థాయి స్పోర్ట్స్ ఇన్నోవేషన్ లీగ్ అయిన స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య, క్రీడా, యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. స్పోర్ట్స్ హ్యాకథాన్ కేవలం ఒక పోటీ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది క్రీడలు మరియు సాంకేతికతను సమన్వయం చేసే విశ్వస్థాయి ఉద్యమమని మంత్రి పేర్కొన్నారు. సంప్రదాయ హ్యాకథాన్‌లకు భిన్నంగా, ప్రొఫెషనల్ స్టేడియంలో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా క్రీడల్లో పాల్గొని, ఆ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని క్రీడలకు సంబంధించిన వాస్తవ సమస్యలకు సృజనాత్మక మరియు ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందిస్తారని తెలిపారు. తెలంగాణలోని అన్ని 33 జిల్లాల నుండి యువత, క్రీడాకారులు, విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు మరియు స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, సుమారు 10,000 మంది పాల్గొనేవారిని సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా, కొంతమంది అంతర్జాతీయ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననుండటం విశేషమన్నారు. ప్రపంచంలోనే మొదటి స్టేడియం స్థాయి స్పోర్ట్స్ హ్యాకథాన్ కావడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించే దిశగా కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ వినూత్న నమూనా ద్వారా తెలంగాణను క్రీడా ఆవిష్కరణల గ్లోబల్ కేంద్రంగా నిలబెట్టడం మా లక్ష్యమని స్పష్టం చేశారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# పార్టీ పెట్టడం పక్కా

## ఉద్యమకారులకు అన్యాయం జరిగింది
## అందుకే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తోంది
## నా పక్కన పైరవీకారులు ఎవరూ లేరు
## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్తుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని, అది 'తెలంగాణ' అస్థిత్వమే ఊపిరిగా పనిచేస్తుందని ఆమె ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో జరిగిన 'ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ'లో పాల్గొన్న ఆమె, తన సొంత తండ్రి కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వంపైనే పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ రాజకీయ వర్గాల్లో కలకలం రేపారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం, న్యాయం జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. "ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి (కేసీఆర్) అధికారం కోల్పోయారు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే ఓడిపోయారు. అప్పట్లో ఎవరిని గెలిపించినా బీఆర్ఎస్‌లోకే వెళ్తారన్న పరిస్థితి ఉండటం వల్ల ప్రజాస్వామ్య విలువలు కనుమరుగయ్యాయి" అని వ్యాఖ్యానించారు. నాడు జయశంకర్ సార్ విగ్రహం పెట్టాలని మంత్రి కేటీఆర్‌ను పదేపదే కోరినా సుప్రీంకోర్టు తీర్పుల సాకుతో పట్టించుకోలేదని, ఆంధ్రా పాలకుల విగ్రహాలు తొలగిస్తారని ఆశించినా అది నెరవేరలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని కూడా ఉద్యమకారులు క్షమించరని కవిత హెచ్చరించారు. ఉద్యమానికి వ్యతిరేకంగా గన్ పట్టుకుని తిరిగిన రేవంత్ రెడ్డికి తెలంగాణ సోయి లేదని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులకు అండగా ఉండాల్సిన ప్రొఫెసర్ కోదండరాం రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తక్షణమే రానున్న బడ్జెట్ సమావేశాల్లో 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు'ను ప్రకటించాలని, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. తన వెంట ఎలాంటి పైరవీకారులు లేరని, కేవలం నిఖార్సైన ఉద్యమకారులే ఉన్నారని కవిత స్పష్టం చేశారు. తాను కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని తేల్చి చెప్పారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ ఫక్తు రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఇకపై కేవలం సాంస్కృతిక సంస్థగా కాకుండా బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారుల వివరాల సేకరణ కోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. ఉద్యమకారుల ఆకాంక్షలే అజెండాగా తమ పార్టీ భవిష్యత్తు కార్యచరణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# కరీంనగర్ బీజేపీదే!

## గెలిచిన తర్వాత కొండగట్టుకు పాదయాత్ర
## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కరీంనగర్, ఫిబ్రవరి 12: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేయబోతోందని, మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశం కరీంనగర్ ఫలితాల వైపు చూస్తోందని, కార్యకర్తల కష్టం వృథా పోదని ఆయన పేర్కొన్నారు. గురువారం కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగవద్దు: బీజేపీకి మెజారిటీ స్థానాలు వస్తున్నాయనే సమాచారంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైందని బండి సంజయ్ విమర్శించారు. "కాంగ్రెస్ నేతలు అప్పుడే ఫోన్లతో ప్రలోభాల స్కెచ్‌కు తెరతీశారు. బీజేపీ అభ్యర్థులను గుంజాలని చూస్తున్నారు, అందరూ జాగ్రత్తగా ఉండండి" అని హెచ్చరించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని, ప్రలోభాలకు లోబడి పార్టీ మారితే కార్యకర్తల ఆగ్రహాన్ని తట్టుకోవడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో చిన్న పొరపాటు జరిగినా నష్టం వాటిల్లుతుందని, ఏజెంట్లు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ.. "ప్రత్యర్థులు గొడవలు సృష్టించి దృష్టి మళ్లించే ప్లాన్ చేస్తారు. ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలి. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలి తప్ప గొడవ పడొద్దు" అని వివరించారు. ఈ ఎన్నికల్లో తమ గెలుపు కోసం బండి సంజయ్ అందించిన ఆర్థిక సాయం, సహకారం మరువలేనిదని అభ్యర్థులు భావోద్వేగానికి లోనయ్యారు. "మీ మేలు జన్మలో మరువలేం" అంటూ సంజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఫలితాల అనంతరం అందరం కలిసి కరీంనగర్ నుండి కొండగట్టు అంజన్న క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు చెల్లించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, బాస సత్యనారాయణ, గుగ్గిళ్ల రమేశ్ తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.



# ఎగిరేది గులాబీ జెండాయే

■ శేరిలింగంపల్లి నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** హైదరాబాద్ కార్పొరేషన్‌ను ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేడని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

# నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

## ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నేడు (ఫిబ్రవరి 13) ఉదయం 8 గంటలకు నిర్దేశిత కేంద్రాల్లో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం అవసరమైన సూపర్ వైజర్లు, అసిస్టెంట్లను ఇప్పటికే నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రాల పరిసరాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (నిషేధాజ్ఞలు) అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. కౌంటింగ్ హాల్ లోపలికి కేవలం సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఎలక్షన్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. వీరందరూ తప్పనిసరిగా జారీ చేసిన పాసులు కలిగి ఉండాలి. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి అనుమతించరు. పారదర్శకత కోసం అన్ని కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఇటీవల ముగిసిన ఈ ఎన్నికల్లో 73.01 శాతానికి పైగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపట్టి, అది పూర్తయ్యాక సాధారణ బ్యాలెట్ బాక్సులను తెరుస్తారు. వార్డులవారీగా బ్యాలెట్ బాక్సులను టేబుల్ వద్దకు తీసుకువచ్చి, ఒక్కో పోలింగ్ స్టేషన్ ఓట్లను 25 చొప్పున కట్టలుగా కడతారు. మిగిలిన చిల్లర ఓట్లను (25 కంటే తక్కువ ఉంటే) విడిగా ఉంచి స్లిప్ అంటిస్తారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వివరాలు నమోదు చేసిన తర్వాత, వార్డులోని అన్ని బ్యాలెట్ కట్టలను ఒక పెద్ద డ్రమ్ములో వేసి బాగా కలుపుతారు. దీనివల్ల ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయో తెలియకుండా గోప్యత పాటించవచ్చు. అసంపూర్తిగా ఉన్న కట్టలను సాధ్యమైనంత వరకు కలిపి పూర్తి కట్టలుగా మారుస్తారు. మిగిలిన చిల్లర ఓట్లను విడిగా ఉంచి లెక్క రాస్తారు. ఈ ప్రక్రియను ప్రతి వార్డుకూ ఇదే రీతిలో అనుసరిస్తారు.

# 15న సంత్ సేవాలాల్ జయంతి

## బంజారా భవన్‌లో కార్యక్రమాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** ఈ నెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాద్లో ఉన్న బంజారాహిల్స్ లోని సేవాలాల్ బంజారా భవన్లో లంబాడీ గిరిజనుల సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఘనంగాజరుగనుంది. ఈ జయంతి ఉత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, రాష్ట్రానికి చెందిన అందరు గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక కార్పొరేటర్ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని గిరిజన సంక్షేమ శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లంబాడీ గిరిజన సాంప్రదాయ పద్ధతి ప్రకారం సంత్ సేవాలాల్ ఆరాధన కార్యక్రమాలు, గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ 2024 నాటి సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని గౌ. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు అప్పటి వరకు వేడుకలకు ఖర్చు పెడుతున్న రూ. కోటిని రూ.రెండు కోట్లుగా రెట్టింపు చేయడమే కాకుండా బంజారా ఉద్యోగులకు ఉత్సవాలు జరుపుకోవడానికి వీలుగా ఫిబ్రవరి 15 నాడు స్పెషల్ లీవ్ శాంక్షన్ చేశారని గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి 21 వరకు అన్ని జిల్లాలలోని అన్ని ఎమ్మెల్యే నియోజకవర్గాలలో జరుగనున్న



సేవాలాల్ జయంతి ఉత్సవాల నిర్వహణకై రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ అందరికీ ఆహ్వానం పలికారు.

# 44వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు

## పారదర్శకంగా జర్నలిస్టులకు న్యాయం
## సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఫిబ్రవరి 12:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. పక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు. అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర పక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# 44 కార్మిక చట్టాల కుదింపుపై కన్నెర్ర

- పెద్దపల్లిలో కదం తొక్కిన కార్మిక లోకం
- జిల్లా కేంద్రంలో ఘనంగా సార్వత్రిక సమ్మె
- కేంద్ర వైఖరిపై భగ్గుమన్న కార్మిక సంఘాల జేఏసీ
- రాజ్యాంగ రక్షణ కోరుతూ బస్టాండ్ కూడలిలో నిరసన




**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** దేశవ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను కుదించడాన్ని నిరసిస్తూ పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మె పెద్దపల్లి జిల్లాలో విజయవంతమైంది. కార్మిక హక్కులను హరిస్తూ, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాలు భారీ ప్రదర్శన నిర్వహించి, బస్టాండ్ అంబేద్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, సీఐటీయూ ఉపాధ్యక్షులు సిపెల్లి రవీందర్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఐ రాజేశం, ఏఐఎఫ్‌టీయూ నాయకులు రత్నకుమార్, రైతు కూలీ సంఘం నాయకులు వెల్తురు సదానందం, స్కీం వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రవికుమార్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కారు కార్మిక చట్టాలను కుదించి, కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు దోచిపెట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు.

సమ్మె హక్కు, పోరాడే హక్కు, కనీస వేతనాలు, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, ఉద్యోగ భద్రత, ఉపాధి హామీ వంటి కీలక హక్కులను కాలరాస్తూ బడా పారిశ్రామికవేత్తలకు దాసోహమయ్యేలా చట్టాలను మార్చారని మండిపడ్డారు. భవిష్యత్తులో కార్మికులకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న 30 కోట్ల మంది కార్మిక వర్గానికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకునేంత వరకు పోరాటం ఆగదని, కార్మికులకు అనుకూల చట్టాలు వచ్చేవరకు విశ్రమించబోమని నేతలు ప్రతిజ్ఞ చేశారు.

# గాయత్రి కళాశాలలో టాస్క్ శిక్షణ ప్రారంభం




- నైపుణ్యాల పెంపుతోనే ఉజ్వల భవిష్యత్తు
- డిగ్రీ విద్యార్థులకు టాస్క్ మహీంద్రా ప్రైడ్ వరప్రదాయిని
- చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్
- సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ మెలకువలపై అవగాహన

**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ ఏండ్ పీజీ కళాశాలలో టాస్క్ మహేంద్రా ప్రైడ్ శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, టాస్క్ రీజినల్ ఇన్ ఛార్జ్ డాక్టర్ కౌసల్య, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ భవాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రతి ఏటా టాస్క్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు కేవలం ఇంజనీరింగ్ విద్యార్థులకే వస్తాయనేది అపోహ మాత్రమేనని కొట్టిపారేశారు. తమ కళాశాలలో డిగ్రీ చదివిన గ్రామీణ నేపథ్యం గల విద్యార్థులు ఎంతోమంది ప్రముఖ ఏమ్ ఎన్ సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. డిగ్రీ విద్యతో పాటు పోటీ పరీక్షల్లో రాణించడానికి టాస్క్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. టాస్క్ రీజినల్ ఇన్ ఛార్జ్ డాక్టర్ పీ కౌసల్య మాట్లాడుతూ విద్యార్థులందరూ టాస్క్ లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందులో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, అర్థమెటిక్ రీజనింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ భవాని విద్యార్థులకు 'ఐ యామ్ యూనిక్', 'ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఫర్ కెరీర్', 'ఆర్ట్ ఆఫ్ స్పీకింగ్' అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జే రవీందర్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ కే కుమార్, ఏమ్ ఏ సమద్, శారద, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులకు 7.56 కోట్లు

- అడిషనల్ పీడీ రంగాచార్యులు
- మండలంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక
- 345 పనులకు 7.56 కోట్ల రూపాయల వెచ్చింపు
- నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ కు షోకాస్ నోటీసు




**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) కింద చిన్నశంకరంపేట మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను 7 కోట్ల 56 లక్షల 74,137 రూపాయలు వెచ్చించినట్లు అడిషనల్ పీడీ రంగాచార్యులు వెల్లడించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 345 పనులను చేపట్టినట్లు రంగాచార్యులు తెలిపారు. ఇందులో కూలీల వేతనాల కోసం 6 కోట్ల 36 లక్షల 44,793 రూపాయలు చెల్లించగా, మెటీరియల్ ఖర్చుల కింద 1 కోటి 20 లక్షల 29,344 రూపాయలు ఖర్చు చేసినట్లు వివరించారు. సామాజిక తనిఖీలో భాగంగా పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) కు షోకాస్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 2,860 రూపాయలను రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీఓ శ్రీహరి, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో దామోదర్, ఎస్టీఎం అంజా గౌడ్, ఎస్ఆర్పీ నాగరాజు, ఈజీఎస్ రాజకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గాయపడ్డ గోమాతకు సపర్యలు.. దేవరకద్ర యువకుల మానవత్వం

- జీపు ఢీకొని గాయపడ్డ ఆలయ గోవు
- సమయానికి స్పందించి చికిత్స అందించిన వైనం
- యువకుల సేవలను అభినందించిన పట్టణ ప్రజలు



**దేవరకద్ర, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మానవత్వం పరిమళించింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ గోమాతకు స్థానిక యువకులు అత్యవసర చికిత్స అందించి తమ ఉదారతను చాటుకున్నారు. స్థానిక శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి చెందిన గోమాతను ఒక జీపు ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానిక యువకులు వెనువెంటనే స్పందించారు. గాయాలతో విలవిలలాడుతున్న గోమాత వద్దకు చేరుకుని, అవసరమైన మందులతో చికిత్సలు నిర్వహించారు. మూగజీవి ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు వారు చేసిన కృషిని చూసి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న గోవును కాపాడిన యువకులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

# ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత: ఎస్పీ రాజేష్ చంద్ర



**బిచ్కుంద, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కామారెడ్డి జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బలగాలతో పాటు క్యూఆర్టీ, బాంబ్ డిస్పోజల్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయోత్సవ ర్యాలీలు, డీజేలు, బాణసంచా కాల్చడంపై పూర్తి నిషేధం విధించినట్లు ఎస్పీ స్పష్టం చేశారు.

# ఈ నెల 18న జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారి ఏమ్ రాజశేఖర్
- టాటా మోటార్స్, హ్యుందాయ్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు
- 40 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఐటీఐ, డిప్లమా, డిగ్రీ అభ్యర్థులు అర్హులు
- పెద్దపల్లి కలెక్టరేట్ లో ఇంటర్వ్యూల నిర్వహణ

**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏమ్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంస్థలైన టాటా మోటార్స్, హ్యుందాయ్ కంపెనీల్లో 40 సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపికైన వారికి పెద్దపల్లి, రామగుండం, కరీంనగర్ ప్రాంతాల్లో పని చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ ఉద్యోగాలకు ఐటీఐ, డిప్లమా (ఎలక్ట్రికల్, మెకానికల్) లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 19 నుంచి 25 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 18 బుధవారం ఉదయం 11 గంటలకు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని కోరారు. పెద్దపల్లి పెద్దకాల్వల వద్ద గల నూతన కలెక్టర్ భవన సముదాయం, మొదటి అంతస్తులోని గది నంబర్ 233లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాజశేఖర్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8985336947, 8121262441 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కేటీఆర్ ను కలిసిన బీఆర్ఎస్ నాయకుడు గుర్ల తిరుమలేష్

- జన్మదినం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశీస్సులు
- యువతకే భవిష్యత్తు.. పార్టీలో తగిన గుర్తింపు: కేటీఆర్
- నంది నగర్ నివాసంలో మర్యాదపూర్వక భేటీ



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుర్ల తిరుమలేష్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ నంది నగర్ లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో పార్టీలో యువకులదే ప్రధాన పాత్ర అని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కష్టపడి పనిచేసే యువ నాయకులకు పార్టీలో మరిన్ని మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వాలా హరీష్ రావు, మల్లారెడ్డి, సంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి సాగర్, సోమేశ్వర్ రెడ్డి, ప్రసాద్, బాబు మోహన్, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

- 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి
- మధ్యాహ్న భోజన పథకం మెనూ కచ్చితంగా పాటించాలి
- స్కాలర్ షిప్ పత్రాల జారీలో జాప్యం వద్దు
- మీ సేవలో అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ కే హైమావతి



**సిద్దిపేట, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ కే హైమావతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని మండలాల విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో వచ్చే ఫలితాల ఆధారంగానే వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని, కావున ప్రతి మండలంలో ఒక ప్రణాళిక రూపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక తరగతులు, స్టడీ హవర్లలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండి సబ్జెక్టులపై అవగాహన కల్పించాలని, సులభంగా చదివే మెలకువలు నేర్పించాలని కోరారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరుకు అనుగుణంగా రుచికరమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) సైతం కొలతల ప్రకారం అన్నం, కూరగాయలు అందించాలని స్పష్టం చేశారు. అలాగే ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్లకు ఫోన్ ద్వారా సూచించారు. మీ సేవ కేంద్రాల్లో విద్యార్థుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఈడీఎం ఆనంద్ ను ఆదేశించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ రవికుమార్

**ఓట్ల లెక్కింపునకు పటిష్ట బందోబస్తు**

**అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల నిఘా**

**అధికారులతో కలిసి ఏర్పాట్ల తనిఖీ**



**బిచ్కుంద, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం కౌంటింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఏర్పాట్లను సీఐ రవికుమార్ గురువారం పరిశీలించారు. కౌంటింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల కోసం ప్రత్యేకంగా కేటాయించిన గ్యాలరీలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజు, కమిషనర్ హయ్యూమ్, విశాల్, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.

# పైతర అభివృద్ధికి అహర్నిశలూ కృషి

**సర్పంచ్ రవితేజ రెడ్డి**

**ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం**

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సహకారంతో నిధుల మంజూరు**

**రాజకీయాలకు అతీతంగా ఊరి బాగుకు పాటుపడదాం**



**కొల్చారం, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** పైతర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పైతర సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో నిర్వహించిన మొదటి గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల వంటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి, గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఐదేళ్ల కాలంలో పైతరను ఆదర్శ గ్రామంలా మారుస్తానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు భాను ప్రకాష్ రెడ్డి, రవితేజ రెడ్డి, మాజీ ఎమ్ పీ టీ సీ చంద్రశేఖర్ రెడ్డి, మల్లేశం, మురళి, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

# మన్యంకొండ హుండీ ఆదాయం 37.64 లక్షలు

**ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్**

**బ్రహ్మోత్సవాల ముగింపుతో హుండీ లెక్కింపు**

**స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలు 37,64,907 రూపాయలు**

**ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన ప్రక్రియ**



**దేవరకద్ర, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన క్షేత్రం మన్యంకొండ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇటీవల బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆలయ హుండీలను తెరిచి భక్తుల కానుకలను లెక్కించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం 6 గంటల వరకు సాగింది. ఇందులో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ ఆదాయం 37 లక్షల 64 వేల 907 రూపాయలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వీణ, మహబూబ్ నగర్ ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, సత్యసాయి సమితి మహిళా మండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# సీఎం కప్‌లో శృతి మెరుపులు

## అభినందించిన హెచ్‌ఎమ్ కృష్ణ కుమార్




**లాంగ్ జంప్ లో ప్రథమ.. రన్నింగ్ లో ద్వితీయ స్థానం**

**బేలా జెడ్ పీ హెచ్ ఎస్ కు గర్వకారణం.. క్రీడల్లో అద్భుత ప్రతిభ చాటిన విద్యార్థిని**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** ఆదిలాబాద్ లో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో బేలా మండల కేంద్రంలోని జెడ్ పీ హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థిని జి శృతి అద్భుత ప్రతిభ కనబరిచింది. అథ్లెటిక్స్ విభాగంలో తన సత్తా చాటుతూ లాంగ్ జంప్ లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రన్నింగ్ పోటీలో సైతం మెరుగైన ప్రదర్శన చేసి రెండో బహుమతి సాధించి పాఠశాల కీర్తిని చాటింది. విద్యార్థిని సాధించిన ఈ ఘనత పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వందన తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని శృతిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# రుద్రారం సంగమేశ్వరస్వామి జాతరకు రండి

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డికి ఆహ్వానం
- వైభవంగా 77వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు
- ఈనెల 15న ఆదివారం వేడుకల నిర్వహణ
- ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు



**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో నిర్వహించే కామేశ్వరీదేవి సమేత సంగమేశ్వరస్వామి 77వ వార్షికోత్సవ జాతర, బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఏమ్ పద్మాదేవేందర్ రెడ్డిని కోరారు. హైదరాబాద్ కొంపల్లిలోని నివాసంలో గురువారం మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి రాజు, ఆలయ కమిటీ సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 15న ఆదివారం జరిగే ఉత్సవాలకు హాజరై స్వామివారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, ప్రవీణ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు సర్వం సిద్ధం
- శుక్రవారం ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు
- పోస్టల్ బ్యాలెట్లతో మొదలవ్వనున్న ప్రక్రియ
- మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో కేంద్రం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** పెద్దపల్లి మున్సిపాలిటీ రెండో సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ గురువారం పరిశీలించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకే లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో భాగంగా మొదటగా 211 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి, ఆ తర్వాత బ్యాలెట్ బాక్సులను తెరుస్తారని వివరించారు. మొత్తం 36 వార్డులకు గాను ఆరు కౌంటింగ్ హాళ్లు, 36 టేబుళ్లను సిద్ధం చేశారు. ఈ విధుల్లో 40 మంది సూపర్ వైజర్లు, 80 మంది అసిస్టెంట్లతో కలిపి మొత్తం 120 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు తప్పనిసరిగా రిటర్నింగ్ ఆఫీసర్ జారీ చేసిన ఐడీ కార్డులు ధరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు లేని వారిని కేంద్రంలోకి అనుమతించబోమని హెచ్చరించారు. అలాగే కౌంటింగ్ హాల్ లోపలికి సెల్ ఫోన్లు, ఆహారం, తాగునీరు తీసుకురావడంపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సహకరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో పాటు పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఫైర్ విభాగాల సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, టీఓటీ మాస్టర్ ట్రైనర్ కృష్ణా రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో సంచార జాతుల సర్వే పుస్తకావిష్కరణ

- 33 సంచార జాతులపై విస్తృత అధ్యయనం
- క్రిమినల్ ట్రైబ్స్ చట్టం ప్రభావంపై ఆవేదన
- సంచార జాతుల కళల పరిరక్షణకు విజ్ఞప్తి
- సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు

**గజ్వేల్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** గజ్వేల్‌లో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన 'సంచార జాతుల సమగ్ర సర్వే' పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్ బాబు పాల్గొని మాట్లాడారు. సంచార జాతుల ఘనమైన చరిత్రను, వారి పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా కొనియాడారు. మొఘల్, బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సంచార జాతుల వారు సైనికులుగా, గూఢాచారులుగా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సంచార జాతుల కళారూపాలకు విశిష్ట స్థానం ఉందని నరేశ్ బాబు పేర్కొన్నారు. 1871లో బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చిన క్రిమినల్ ట్రైబ్స్ చట్టం వల్ల ఈ జాతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ అనేక కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నాయని తెలిపారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో యాభై మంది సామాజిక కార్యకర్తల బృందం రాష్ట్రవ్యాప్తంగా 33 సంచార జాతులకు చెందిన 1,450 కుటుంబాలను సందర్శించిందని వివరించారు. సుమారు 7 వేల మందిని నేరుగా కలిసి సేకరించిన వివరాలతో ఈ సమగ్ర నివేదికను రూపొందించి, పుస్తకంగా ముద్రించినట్లు చెప్పారు. సంచార జాతుల పిల్లల విద్య కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కుల ధృవపత్రాల జారీ ప్రక్రియను సులభతరం చేయాలని, భూమి లేని నిరుపేదలకు భూములు, పక్కా గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి ఆచార వ్యవహారాలకు, కళలకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లయ్య, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అశ్విన్ కుమార్, డాక్టర్ నాగేందర్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



# లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- వినాశకర చట్టాలతో శ్రమజీవుల పొట్ట కొడుతున్న మోడీ సర్కార్
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ
- కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెడుతున్నారని ఆగ్రహం
- ఎల్బీనగర్ సర్కిల్‌లో భారీగా కార్మికుల నిరసన ర్యాలీ




**ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కొత్తపేట చౌరస్తాలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సరూర్ నగర్, హస్తినాపురం, కర్మన్‌ఘాట్, ఎన్టీఆర్ నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన తెలిపారు.

### కార్పొరేట్లకు దేశ సంపద దారాదత్తం

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ మాట్లాడుతూ.. విద్యుత్ సవరణ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో వంద శాతం విదేశీ పెట్టుబడులు వంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశాన్ని కార్మిక సంఘాలు, చట్టాలు లేనిదిగా మార్చేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దేశ సంపదను బంగారు పళ్ళెంలో పెట్టి ఇచ్చేందుకే.. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి స్థానంలో యజమానులకు కొమ్ముకాసే నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చారని ధ్వజమెత్తారు.

### కార్మికుల పొట్ట కొట్టేలా చట్టాలు..

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల లాభాల కోసమే 2025 నవంబర్ 21న లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేసిందని విమర్శించారు. కనీస వేతనం రోజుకు కేవలం 178 రూపాయలుగా నిర్ణయించడం దారుణమన్నారు. ఇది అమలైతే కార్మికులు బతకడమే కష్టంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మేడే స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని పది నుంచి పన్నెండు గంటలకు పెంచుతూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కోడ్స్ వల్ల ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కనుమరుగవుతాయని హెచ్చరించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఉపాధి హామీ కూలీలను కనీసం కార్మికులుగా కూడా గుర్తించడం లేదని వాపోయారు. దేశవ్యాప్త సమ్మె ద్వారా ప్రభుత్వం కళ్లు తెరవాలని, శ్రమజీవులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గ్యార క్రాంతి కుమార్, కమలమ్మ, ఇస్మాయిల్, శ్యామల, రమణమ్మ, ఉష, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను బానిసలుగా మార్చొద్దు




- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి
- దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్బీనగర్‌లో భారీ ర్యాలీ
- రోడ్డుపై బైఠాయించి నిరసన.. నాయకుల అరెస్ట్
- 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా మార్చడంపై ఆగ్రహం

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష కార్మిక సంఘాల పిలుపుమేరకు నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఎల్బీనగర్‌లో ఉద్రిక్తంగా సాగింది. ఏఐటీయూసీ అర్బన్ రంగారెడ్డి జిల్లా, సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితిల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చాకలి ఐలమ్మ చౌరస్తా నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. ఈ క్రమంలో పోలీసులు నాయకులను అరెస్టు చేసి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. దేశ కార్మిక లోకం సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. నియంతృత్వ ధోరణితో వాటిని కేవలం 4 లేబర్ కోడ్ లుగా మార్చడం ద్వారా కార్మిక హక్కులను కాలరాస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలతో కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కోడ్ ల వల్ల ఉద్యోగ భద్రత కోల్పోవడమే కాకుండా పని గంటలు పెరగడం, యూనియన్ హక్కులు హరించబడటం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఎల్బీనగర్ అధ్యక్షుడు బోయపల్లి రాములు గౌడ్, వృత్తి సంఘాల రాష్ట్ర నాయకుడు బొడ్డుపల్లి కృష్ణ, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నె సుజాత, మనసురాబాద్ డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్, మున్సిపల్ కార్మిక సంఘం ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి మద్దిలేటి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు హయత్ నగర్ మండల కార్యదర్శి కొప్పుల సరిత, డీహెచ్ పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న మోడీ సర్కార్

- మాజీ ఎమ్మెల్సీ చెరుకుపల్లి సీతారాములు
- కార్మికుల సమస్యలు మీకు పట్టవా అని నిలదీత
- లేబర్ కోడ్లతో వెట్టి చాకిరి తప్పదని హెచ్చరిక
- ఆటోనగర్‌లో విజయవంతమైన బంద్.. భారీ సభ

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆటోనగర్ పారిశ్రామిక వాడలో బంద్ సంపూర్ణంగా జరిగింది. వరుణ్ మోటార్స్, టాటా మోటార్స్, అశోక్ లేలాండ్, మహేంద్రా మోటార్స్, ఎస్ఆర్ఎంటీ, ఐచర్, టీసీఐ, ఐలా, హమాలీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బంద్ పాటించారు. సీఐటీయూ హయత్ నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సభకు మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుకుపల్లి సీతారాములు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

### అదానీ, అంబానీల కోసమే పాలన

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సీతారాములు మాట్లాడుతూ.. వంద సంవత్సరాల క్రితం కొట్లాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం దారుణమని మండిపడ్డారు. ఈ కోడ్ లు అమలైతే ఎనిమిది గంటల పని విధానం పోయి పన్నెండు గంటల వెట్టి చాకిరి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత గాలిలో కలుస్తుందని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి వ్యవసాయ కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తోందని, పేదలు, కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ట్రంప్ పెట్టిన ఆంక్షలకు తలొగ్గి దేశ ప్రజలకు నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మాజీ ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధ్యక్షుడు ముషం నరహరి, సీఐటీయూ నాయకులు నక్క అంజయ్య, బూరెళ్ల భాస్కర్, కొత్తగణేష్ గౌడ్, నోముల సుదర్శన్, రాసూరి బిక్షపతి, చిట్యాల నర్సిరెడ్డి, చిట్యాల జనార్ధన్ రెడ్డి, మద్దెల కృష్ణ, సుందర్ రావు, సుభద్ర, సుగుణ, ధనాజీ బిరదర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకున్నా అండగా ఉంటా

**మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**శుభోదయ కాలనీలో విద్యుత్ స్తంభం సమస్యపై స్పందన**

**ఏఈ ఖాద్రితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన**

**ప్రజలకు ఇబ్బంది లేకుండా స్తంభం మార్చాలని సూచన**



**ఎల్బీనగర్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని, పదవి ఉన్నా లేకున్నా కాలనీవాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో గార్డెన్ పార్కు వద్ద రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత ఎలక్ట్రికల్ ఏఈ ఖాద్రితో కలిసి గురువారం సమస్యను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆ విద్యుత్ స్తంభాన్ని అనుకూలమైన మరో ప్రదేశానికి వెంటనే మార్చాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రజా సమస్యల పట్ల తాను ఎప్పుడూ చిత్తశుద్ధితో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు నర్సింహా, కాలనీ వాసులు గఫూర్, గడ్డం సత్యనారాయణ, దేవా గౌడ్, బీజేపీ నాయకులు అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్, అసిస్టెంట్ లైన్ మెన్ శ్రావణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు కార్మికులే శ్రీరామరక్ష

**మహేశ్వరం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

**కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ చట్టాలు చేసింది..**

**మోడీ సర్కార్ తుంగలో తొక్కింది**

**కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని తీవ్ర ధ్వజం**

**మహేశ్వరం నియోజకవర్గంలో సార్వత్రిక సమ్మె విజయవంతం**




**రంగారెడ్డి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యవస్థలకు లాభం చేకూర్చే నాలుగు కేంద్ర చట్టాలను వెంటనే రద్దు చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గ ఐఎన్టీయూసీ అధ్యక్షుడు నడకుడ శివ ఆధ్వర్యంలో భారీ ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, కూలీలు లేనిదే పరిశ్రమలకు మనుగడ లేదని స్పష్టం చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో చట్టాలు తీసుకువచ్చిందని, కానీ నేడు ప్రధాని నరేంద్ర మోడీ వాటిని రద్దు చేశారని మండిపడ్డారు. కార్మికులు, రైతుల పొట్టకొట్టే చట్టాలను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త చట్టాలను రద్దు చేసే వరకు బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వీబీ జీ రామ్ జీ విధానాన్ని వెంటనే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు, ఐఎన్టీయూసీ నేతలు, నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఈ నెల 20వ తేదీన జరగనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న ఈ కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. జయంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుధ్యం వంటి కనీస వసతుల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమ ప్రాంగణంలో అంబులెన్స్‌తో పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తుల సౌకర్యార్థం తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలని సూచించారు. భద్రతా పరంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, డీటీడీఓ అంబాజీ, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కార్యకర్తలే నా బలం

**మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**

**నాయకులు, పోలింగ్ ఏజెంట్లకు మాజీ ఎమ్మెల్యే ఆత్మీయ కృతజ్ఞతలు**

**బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల వేళ కార్యకర్తల శ్రమ అమోఘం**

**బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల అంకితభావానికి శిరస్సు వంచి నమస్కారం**



**జుక్కల్, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసిన నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకుల సేవలను గుర్తుచేసుకుంటూ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిచ్కుంద పట్టణ బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు ఎండను సైతం లెక్కచేయకుండా తమ కుటుంబాలను పక్కన పెట్టి పార్టీ విజయం కోసం చూపిన అంకితభావం మాటల్లో వర్ణించలేనిదని కొనియాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ జెండాను భుజాన వేసుకుని ఇంటింటికీ తిరిగి ఓటర్లను చైతన్యపరచడంలో కార్యకర్తలు చేసిన కృషి ఎంతో గొప్పదని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద నిమిషం కూడా విశ్రమించకుండా ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ పోలింగ్ ఏజెంట్లుగా బాధ్యతాయుతంగా వ్యవహరించిన సోదరులందరికీ ఆయన శిరస్సు వంచి నమస్కరించారు. కార్యకర్తలు చిందించిన ప్రతి చెమట చుక్క పట్టణ అభివృద్ధికి ఒక బలమైన పునాది కాబోతోందని, పార్టీ మీద వారికి ఉన్న ఈ చెక్కుచెదరని ప్రేమే తనకు కొండంత అండ అని స్పష్టం చేశారు. నాయకులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకునే కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి అసలైన బలమని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల గెలుపు కోసం రాత్రింబవళ్లు శ్రమించిన ప్రతి ఒక్కరికీ, వారు పడిన కష్టానికి, చూపిన తెగువకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. గెలుపు మనదేనని, ఈ విజయం పూర్తిగా కార్యకర్తల శ్రమకే అంకితమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నిజాయితీ చాటుకున్న రూరల్ కానిస్టేబుల్ రమేష్

**ప్రమాద బాధితురాలి బంగారు ఆభరణాలు కుటుంబానికి అప్పగింత**

**సమయస్ఫూర్తితో వ్యవహరించి నగలను భద్రపరిచిన వైనం**

**పోలీసుల సేవా దృక్పథంపై స్థానికుల ప్రశంసలు**



**సిద్దిపేట, ఫిబ్రవరి 13 (మనసులో మాట):** విధి నిర్వహణలో మానవత్వం, నిజాయితీ చాటుకున్న సిద్దిపేట రూరల్ పోలీస్ కానిస్టేబుల్ రమేష్ పై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట పట్టణంలోని కోటిలింగాల పరిసరాల్లో ఉన్న నల్ల పోచమ్మ గుడి సమీపంలో పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలిని 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో ఘటనాస్థలికి చేరుకున్న రూరల్ పోలీస్ కానిస్టేబుల్ రమేష్ పరిస్థితిని సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు కిందపడిన విషయం గమనించిన ఆయన.. వాటిని ఎవరూ తీసుకెళ్లకుండా భద్రంగా సేకరించారు. ప్రతి నగను జాగ్రత్తగా తీసుకొని సంఘటన స్థలంలోనే పంచనామా నిర్వహించి సంబంధిత సిబ్బంది సమక్షంలో భద్రపరిచారు. అనంతరం ఆభరణాలను వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి అధికారిక ప్రక్రియ ప్రకారం భద్రపరిచారు. దురదృష్టవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వృద్ధురాలు మృతి చెందారు. ఆమె పేరు అసా లక్ష్మి అని, నిజామాబాద్‌కు చెందిన ఆమె కుటుంబం గత ఇరవై ఏళ్లుగా సిద్దిపేటలోనే నివసిస్తోందని పోలీసులు గుర్తించారు. పది రోజుల తరువాత కుటుంబ సభ్యులను సంప్రదించి.. ముఖ్యంగా ఆమె కుమారుడికి సమాచారం ఇచ్చారు. అన్ని ధృవపత్రాల పరిశీలన పూర్తి చేసిన అనంతరం బంగారు ఆభరణాలను తిరిగి వారికి అప్పగించారు. పోలీస్ సిబ్బంది.. ముఖ్యంగా కానిస్టేబుల్ రమేష్ చూపిన ముందుచూపు, నిజాయితీ పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి బంగారం సురక్షితంగా అందడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటన పోలీస్ శాఖలోని సేవా దృక్పథానికి, బాధ్యతాయుత వ్యవహారానికి నిదర్శనంగా నిలిచింది.

# రహదారి వెంట పిచ్చి మొక్కల తొలగింపు

**సర్పంచ్ సెగ్గం వెంకటేష్ చొరవ**

**ప్రమాదాల నివారణకు బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం**



**మంచిర్యాల, ఫిబ్రవరి 12 (మనసులో మాట)**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం వెంకటాపూర్ (గుడిపెల్లి) నుంచి శ్రీరాంపూర్ వెళ్లే లింక్ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ గురువారం తన చొరవతో తొలగించారు. ఆర్కే5 గని పక్కన ఉన్న ఈ రహదారిలో పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి.. బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక గతంలో ప్రమాదాలు జరిగాయని, వాటి నివారణ కోసమే ఈ చర్యలు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. ఈ పనుల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో రోడ్డుపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరగా.. సర్పంచ్ సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి త్వరలోనే లైట్లు వేయిస్తానని హామీ ఇచ్చారు.



# సిద్దిపేటను విద్యా నిలయంగా మార్చింది హరీష్‌రావే

- రెడ్డి యాదగిరి, శ్యామ్ యాదవ్
- పదో తరగతి విద్యార్థులకు 'డిజిటల్' దన్ను.. పుస్తకాల అందజేత
- సొంత నిధులతో 2,800 మందికి విద్యా కానుక
- వెటర్నరీ కళాశాల తరలింపుపై ఆందోళన బాట పడతాం



**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేటను విద్యాలయాల నిలయంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుకే దక్కుతుందని జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్ యాదవ్ స్పష్టం చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. వచ్చే నెలలో వార్షిక పరీక్షలు ఉన్నందున విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే లక్ష్యంతో, గత ఐదేళ్లుగా హరీష్‌రావు ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

**విద్యార్థుల కోసం సొంత నిధుల ఖర్చు..**

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సుమారు 2,800 మంది పదవ తరగతి విద్యార్థుల కోసం దాదాపు ఐదు లక్షల రూపాయల సొంత నిధులతో హరీష్‌రావు ఈ డిజిటల్ పుస్తకాలను అందజేస్తున్నారని నేతలు తెలిపారు. "స్కూల్‌లో స్పెషల్ స్టడీ - ఇంట్లో డిజిటల్ స్టడీ" అనే నినాదంతో విద్యార్థులు తమ ఇళ్ల వద్దే పాఠాలను పునశ్చరణ చేసుకునేలా ఈ కంటెంట్ ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిద్దిపేటలో మెడికల్, పీజీ, నర్సింగ్, పాలిటెక్నిక్ వంటి ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేసి విద్యా రంగంలో జిల్లాను ఆదర్శంగా నిలిపిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

**కళాశాల తరలింపుపై నిరసన..**

మరోవైపు సిద్దిపేటలో దాదాపు మూడు వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సగం పనులు పూర్తయిన తర్వాత కళాశాలను తరలించడం సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపు చర్యేనని వారు ఆరోపించారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నేతలు హెచ్చరించారు. విద్యార్థులు ఈ డిజిటల్ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ మార్కులు సాధించాలని వారు ఆకాంక్షించారు.





# కేంద్రంపై కార్మిక గర్జన

- కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా భారీ ర్యాలీ
- 4 లేబర్ కోడ్లతో హక్కుల అణచివేతపై ఆగ్రహం
- దేశ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారు
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాలు చేపట్టిన భారీ ర్యాలీతో సంగారెడ్డి నగరం దద్దరిల్లింది. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై కన్నెర్ర చేశారు. ప్రజల కష్టార్జితమైన దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా మోడీ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్ల పేరుతో హక్కులను కుదించే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ.. 'హైర్ అండ్ ఫైర్' విధానం ద్వారా శ్రమ దోపిడీకి ప్రభుత్వం చట్టబద్ధత కల్పిస్తోందని ఆరోపించారు. రోజుకు కేవలం 178 రూపాయలతో కార్మికుడు గౌరవప్రదంగా ఎలా జీవించగలడని ఆయన నిలదీశారు. రేపు ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని అనిశ్చితిలో కార్మికులు బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "జీనా హై తో మర్నా సీఖో.. కదమ్ కదమ్ పర్ లడ్నా సీఖో" అనే నినాదాలతో సభ హోరెత్తింది. ఉద్యోగం పోతుందనే భయంతో మౌనంగా ఉంటే యజమాన్యాలు మరింత అణచివేతకు పాల్పడతాయని, హక్కుల కోసం భయపడకుండా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, గిట్టుబాటు ధర పొందడం రైతుల హక్కు అని నేతలు స్పష్టం చేశారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవసాయ విధానాలను రూపొందించడాన్ని తప్పుబట్టారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా అయినా కేంద్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా లభించాల్సిన సౌకర్యాలు అందనప్పుడు శాంతియుత నిరసనలు, సమ్మెలే కార్మికులకు ఆయుధాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# పొలాలకు ఒంటరిగా వెళ్లొద్దు

- సీపీ రష్మీ పెరుమాళ్
- కోహెడ గుట్టల్లో పులి సంచారంపై సీ పీ హెచ్చరిక
- గుంపులుగానే వెళ్లాలని గ్రామస్తులకు సూచన
- అటవీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

**కోహెడ, ఫిబ్రవరి 12 (మనసులో మాట):** కోహెడ మండల పరిధిలోని సింగరాయ గుట్టల పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తో పాటు జిల్లా అటవీశాఖ అధికారి పద్మజ రాణి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పులి పాదముద్రలు కనిపించిన ప్రాంతాలను, పులి సంచరిస్తున్న మార్గాలను వారు నిశితంగా పరిశీలించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, దానిని పట్టుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి తెలిపారు. అటవీశాఖ సిబ్బంది సైతం నిరంతరం గాలింపు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కూరెళ్ల, శనిగరం, గుండారెడ్డిపల్లి, తంగళ్ళపల్లి గ్రామ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీ పీ సూచించారు. పొలాలకు లేదా ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వెళ్లకూడదని, ఎల్లప్పుడూ ఐదు నుండి ఆరుగురు చొప్పున గుంపులుగా మాత్రమే వెళ్లాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం పులి సంచారం ఉన్నందున అటవీ ప్రాంతంలోకి వెళ్లడం అత్యంత ప్రమాదకరమని,



ప్రజలు అడవి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ విజ్ఞప్తి చేశారు.




# ఆఫ్ఘన్ ఆల్‌రౌండర్‌కు ఐసీసీ బిగ్‌షాక్

బుధవారం జరిగిన ఆఫ్ఘనిస్థాన్- దక్షిణాఫ్రికా మ్యాచ్ ప్రపంచం వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ ఎంత ఉత్కంఠ భరితంగా సాగిందో చెప్పనవసరం లేదు. ఇక ఈ మ్యాచ్ అనంతరం ఆఫ్ఘనిస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీకి ఐసీసీ షాక్ ఇచ్చింది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత టీ20 మ్యాచ్‌లో అంపైర్లతో వాగ్వాదానికి దిగిన కారణంగా చర్యలు తీసుకుంది. నబీ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్ల ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.4ను ఉల్లంఘించినట్లు తేలింది. ఈ నిబంధన ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో అంపైర్ సూచనలను పాటించకపోవడం తప్పుగా భావిస్తారు. ఆఫ్ఘనిస్థాన్ ఇన్నింగ్స్ 14వ ఓవర్ ఆరంభంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దక్షిణాఫ్రికా పేసర్ లుంగీ ఎంగిడీ చేతికి ధరించిన రిస్ట్‌బ్యాండ్ విషయంలో నబీ అంపైర్లను ప్రశ్నిస్తూ వాదనకు దిగారు. అదే ఈ ప్లేయర్‌కు చెడ్డ పేరు తెచ్చింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ఇది ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్‌లోనే అత్యంత ఉత్కంఠభరిత పోరుగా నిలిచింది. ఫలితం తేలడానికి రెండు సూపర్ ఓవర్లు అవసరమయ్యాయి. చివరకు దక్షిణాఫ్రికా విజయం సాధించింది. నబీకి ఈ మ్యాచ్ కలిసి రాలేదు. రెండు ఓవర్లు వేసిన నబీ 20 పరుగులు ఇచ్చాడు. బ్యాటింగ్‌లో ఆరు బంతుల్లో ఐదు పరుగులకే పరిమితమయ్యాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ తరఫున వికెట్ కీపర్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ అద్భుతంగా ఆడాడు. 42 బంతుల్లో 84 పరుగులు చేసి జట్టును విజయానికి దగ్గరగా తీసుకెళ్లాడు. చివర్లో లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వేగంగా పరుగులు చేసి స్కోరు సమం చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు వెళ్లింది. మొదటి సూపర్ ఓవర్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ ఎంగిడీపై రెండు బౌండరీలు, ఒక సిక్స్ కొట్టి 17 పరుగులు సాధించాడు. కానీ దక్షిణాఫ్రికా తరఫున ట్రిస్టన్ స్టబ్స్ రెండు భారీ సిక్సులు బాదడంతో మ్యాచ్ రెండో సూపర్ ఓవర్‌కు చేరింది. రెండో సూపర్ ఓవర్‌లో డేవిడ్ మిల్లర్, స్టబ్స్ కలిసి మూడు సిక్సులు బాదుతూ 23 పరుగులు చేశారు. ఇది పెద్ద లక్ష్యంలా కనిపించినా, గుర్బాజ్ మళ్లీ పోరాడాడు. కేశవ్ మహారాజ్‌పై వరుసగా మూడు సిక్సులు కొట్టి మ్యాచ్‌ను మళ్లీ ఉత్కంఠకు గురి చేశాడు. చివరికి ఔటవడంతో ఆఫ్ఘనిస్థాన్ విజయం అందుకోలేకపోయింది. ఇలా ఉత్కంఠభరిత పోరులో ఓడినా, మ్యాచ్ మాత్రం అభిమానులకు అసలు టీ20 మజా చూపించింది.




# నమీబియాపై గ్రాండ్ విక్టరీ

## సత్తా చాటిన కిషన్, చక్రవర్తి

**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్-2026 భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఏ పోరులో టీమిండియా విజయాల పరంపర కొనసాగుతోంది. పసికూన నమీబియాపై భారత్ 93 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించి పాయింట్స్ టేబుల్ అగ్రస్థానంలో నిలిచింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ ఇషాన్ కిషన్ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న కిషన్ (61 పరుగులు, 24 బంతుల్లో), స్టేడియం నలుమూలల బౌండరీల వర్షం కురిపించాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్యా (52) అర్ధశతకంతో రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. నమీబియా బౌలర్లలో కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ 4 వికెట్ల అద్భుత స్పెల్‌తో భారత్‌ను మరిన్ని పరుగులు చేయకుండా కట్టడి చేశాడు.




## కుప్పకూలిన నమీబియా బ్యాటింగ్..

210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా జట్టు, భారత బౌలర్ల ధాటికి 116 పరుగులకు ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన మాయాజాలంతో 3 వికెట్లు తీసి నమీబియా వెన్ను విరిచాడు. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా 2 వికెట్లతో రాణించగా.. బుమ్రా ఒక వికెట్, పేసర్ అర్షదీప్ సింగ్ టీ20ల్లో తన 250వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. దీంతో నమీబియా జట్టు 17.4 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది.

# ఒమన్‌పై శ్రీలంక భారీ విజయం

## టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక వరు-సగా రెండో విజయం

టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక వరుసగా రెండో విజయం నమోదు చేసింది. కొలంబో వేదికగా ఒమన్ తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. లంక నిర్దేశించిన 226 పరుగుల ఛేదనలో ఒమన్ తేలిపోయింది. లంక బౌలర్లు విజృభించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులే చేయగలిగింది. దుష్మంత చమీర, మహీష్ తీక్షణ చెరో 2, దునిత్ వెల్లలాగే, డాసున్ హేమంత, కామిందు మెండిస్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ లక్ష్య ఛేదనలో ఒమన్ పవర్  ప్లే లోనే ఒమన్ మూడు వికెట్లు కోల్పోయింది. ఆమిర్ ఖలీమ్ (6 పరుగులు), జితేందర్ సింగ్ (1 పరుగు), హమ్మద్ మీర్జా (9 పరుగులు) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. అప్పుడు క్రీజులోకి వచ్చిన మహ్మద్ నదీమ్, వాసిమ్ తో కలిసి వికెట్ల పతనాన్ని కాసేపు అడ్డుకున్నాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్ కు 42 పరుగులు జోడించారు. అయితే 11.5 వద్ద వాసిమ్ ను తీక్షణ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో తొలి బంతికే వినాయక్ శుక్లా (1 పరుగు) ఔట్ అయ్యాడు. ఇక ఒమన్ లో నదీమ్  ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. కానీ, నదీమ్ కావాల్సినంత వేగాంగా పరుగులు చేయలేదు. అతడు ఈ ఇన్నింగ్స్ లో 56 బంతులు ఆడినప్పటికీ చేసింది 53 పరుగులే. ఇందులో మూడు ఫోర్లు, ఒక సిక్స్  ఉన్నాయి. వాసిమ్ అలీ (27 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. ఈ ఇద్దరు మినహా మిగిలిన బ్యాటర్లెవరూ రెండంకెల స్కోర్ చేయలేదు. చివర్లో వికెట్లు పడుతున్న నదీమ్ క్రీజులో నిలబడి తమ జట్టును ఆలౌట్ గండం నుంచి తప్పించాడు.కాగా, టీ20ల్లో పరుగులు పరంగా ఇది శ్రీలంకకు రెండో అతిపెద్ద విజయం. 2007 వరల్డ్ కప్ లో కెన్యాపై 172 పరుగుల భారీ తేడాతో లంక నెగ్గింది. పరుగుల పరంగా లంక జట్టుకు ఇదే భారీ విజయం. అటు ఒమన్ కు ఇదే అతి ఘోర ఓటమి. పొట్టి ఫార్మాట్ లో 100కు పైగా పరుగుల తేడాతో ఓడిపోవడం ఇదే తొలిసారి. గతంలో ఒమన్ 2025 ఆసియా కప్ లో పాక్ పై 93 రన్స్ తో ఓడింది.అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రీలంక బ్యాటర్లలో కుశాల్ మెండిస్ (61 పరుగులు, 45 బంతుల్లో), పవన్ రత్నాయకే (60 పరుగులు, 28 బంతుల్లో; 8ఇ4, 1ఇ6), డాసున్ శనక (50 పరుగులు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఒమన్ బౌలర్లలో జితేన్ రామ్ నంది 2, సఫ్యాన్ మహ్మద్, జయ్ ఒడెడ్ర తలో 1 వికెట్ దక్కించుకున్నారు.ఈ టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో విజయం. తొలుత ఐర్లాండ్ పై గెలిచిన లంక, తాజాగా ఒమన్ పై విక్టరీ కొట్టింది. దీంతో గ్రూప్ బీలో 4 పాయింట్లతో టాప్ లో ఉంది. ఇక శ్రీలంక తదుపరి మ్యాచ్ లో ఆస్ట్రేలియా (ఫిబ్రవరి 16), జింబాబ్వే (ఫిబ్రవరి 19) ఆడాల్సి ఉంది.











# ఐపీఎల్‌కు ఎన్నికల సెగ

## 19వ సీజన్ షెడ్యూల్ ఆలస్యం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ వేలం ముగిసి రెండు నెలలు కావొస్తోంది. మామూలుగా అయితే ఈ లోపే షెడ్యూల్ విడుదలవ్వాలి. కానీ, బీసీసీఐగానీ, ఐపీఎల్ పాలకమండలిగానీ ఐపీఎల్ షెడ్యూల్ గురించి ఒక్క ప్రకటన చేయలేదు. ఆనవాయితీ ప్రకారం మార్చి - మే నెల మధ్యలో మెగా టోర్నీ జరుగనుందని సమాచారం. కానీ, షెడ్యూల్‌పై బీసీసీఐ మౌనం దాల్చడం వెనుక కారణముందని తెలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలోనే షెడ్యూల్‌పై ప్రకటన ఆలస్యం అవుతోందని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. చూస్తుంటే ఐపీఎల్‌కు కూడా అసెంబ్లీ ఎన్నికల సెగ తాకినట్టు అనిపిస్తోంది. నిరుడు డిసెంబర్ 16న అబూధాబీలో 19వ సీజన్ వేలం ముగిసింది. కానీ, ఇప్పటికీ షెడ్యూల్‌పై స్పష్టత లేదు. గత సీజన్ మాదిరిగానే మార్చిలోనే సీజన్ ఆరంభం అవుతుందని టాక్. మార్చి 26 నుంచి మే 31 వరకూ టోర్నీ నిర్వహించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఆ లెక్కన చూస్తే మెగా టోర్నీ ఆరంభానికి ఇంకో 45 రోజులు ఉన్నాయంతే. అయితే.. త్వరలోనే బెంగాల్, తమిళనాడు, అస్సాంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. దాంతో.. ఆయా రాష్ట్రాల్లో పోలీసులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండే అవకాశముంది. అందుకే.. ఐపీఎల్ ఆలస్యమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇదే విషయమై 'ఇన్‌సైడ్ స్పోర్ట్' ప్రతినిధి ఒకరు బీసీసీఐ అధికారులను సంప్రదించగా.. అవునని చెప్పారు. 'ఎన్నికల నేపథ్యంలోనే ఐపీఎల్ షెడ్యూల్ విడుదల చేయడం లేదు. ఒకవేళ ఎన్నికల తేదీ, కౌంటింగ్ తేదీన మ్యాచ్‌లు ఉంటే వేదికను మార్చడం పెద్ద తలనొప్పి. ఎందుకంటే.. పోలీసులంతా ఎన్నిక విధుల్లో నిమగ్నమవుతారు. అప్పుడు స్టేడియాల వద్ద ఆటగాళ్లకు రాష్ట్ర పోలీసులు భద్రత కల్పించలేరు. కాబట్టి.. అధికారులతో మాట్లాడుతూ ఉన్నాం. వారి నుంచి ఎన్నికల తేదీలపై స్పష్టత వచ్చాక ఐపీఎల్ షెడ్యూల్ ప్రకటిస్తాం అని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఒకవేళ ఎన్నికలు ఆలస్యమైతే.. రెండు విడతలుగా ఐపీఎల్ నిర్విహించడంపై ఆలోచిస్తాం' అని ఆయన పేర్కొన్నారు. పద్దెనిమిదో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్బీసీ)జట్టు ఛాంపియన్‌గా అవతరించిన విషయం తెలిసిందే.



# మీనాక్షి చౌదరి మెస్మరైజ్

సాంప్రదాయంఉస్టైల్ కలయికలో మరోసారి మెరిసింది మీనాక్షి చౌదరి. తాజాగా ఎమరాల్డ్ గ్రీన్ చీరలో ఆమె అందం మరింత తళుక్కుమంది. గాఢమైన ఆకుపచ్చ రంగు చీర ఆమెకు రాయల్ లుక్‌ను తీసుకొచ్చింది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌పై చేసిన నాజూకైన ఎంబ్రాయిడరీ, స్వల్ప శిమ్మర్ డిజైన్ సంప్రదాయ దుస్తులకు ఆధునిక టచ్ ఇచ్చాయి. సింపుల్‌గా కనిపించినా స్టైలిష్‌గా మెరిసే ఈ కాంబినేషన్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. గోల్డ్ జుమ్కాలతో లుక్‌ను పూర్తి చేసింది. ఆభరణాలు ఎక్కువగా కాకుండా, సరైన మోతాదులో ఉండటం వల్ల ఆమె ఎలిగెన్స్ మరింత హైలైట్ అయింది. స్లీక్ ఓపెన్ హెయిర్ స్టైల్‌తో గ్రేస్, గ్లామర్ రెండింటినీ సమతూకంగా మేళవించింది. మొత్తానికి, సంప్రదాయ చీరలో మోడ్రన్ వైబ్ చూపిస్తూ మీనాక్షి మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ఈ లుక్ సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తోంది.



# విజయ్ దేవరకొండ పెళ్లి

## ఓటిటి హక్కులు తిరస్కరించిన రౌడీబాయ్

టాలీవుడ్ మోస్ట్ క్రేజీ నటులుగా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వీరి పెళ్లి వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. గతంలో నయనతార ? విఘ్నేష్ శివన్ వివాహ వీడియో స్ట్రీమింగ్ విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలు, డాక్యుమెంటరీ విడుదల కావడానికి పట్టిన సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ జంట అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. అలాగే తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత ముఖ్యమైన వేడుకను వ్యాపారం చేయడం విజయ్‌కి ఇష్టం లేదని, అందుకే ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య అత్యంత ప్రైవేట్‌గా జరుపుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో వీరి వివాహం జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయని నెట్టింట కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లోనే వీరిద్దరికీ నిశ్చితార్థం పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, ఈ జంట మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఏదేమైనా, తమ అభిమాన నటీనటులు ఒకటవుతుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# జగతి మేడం అందాలు చూడతరమా?

కన్నడ , తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్) ప్రస్తుతం కెరీర్ పరంగా బిజీగా ఉన్నారు. పంజాబీ మూలాలున్నప్పటికీ, దక్షిణాది బుల్లితెరపై ఆమె అగ్ర నటిగా ఎదిగారు.కన్నడలో ‘కిన్నరి‘, ‘జోగుల‘ వంటి సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన జ్యోతి, తెలుగులో ‘గుప్పెడంత మనసు‘ సీరియల్‌లో జగతి పాత్రతో ఇంటింటికీ పరిచయమయ్యారు.ప్రస్తుతం ఆమె తన రూటు మార్చి యాక్షన్ సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. మల్టీలింగ్వల్ సూపర్ హీరో మూవీ ‘మాస్టర్ పీస్‘ మరియు థ్రిల్లర్ మూవీ ‘కిల్లర్‘ (డ్రీమ్ గర్ల్) వంటి విభిన్న చిత్రాల్లో నటిస్తున్నారు



# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు

టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.



CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861